thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 252 | కరీంనగర్ బుధవారం, 19 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## జాతీయ భద్రత సలహా మండలి సభ్యుడిగా సతీశ్‌రెడ్డి

న్యూఢిల్లీ: జాతీయ భద్రత సలహా మండలి (ఎన్ఎస్ఏబీ) సభ్యుడిగా డీఆర్‌డీవో మాజీ చైర్మన్ ప్రొఫెసర్ జి.సతీశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ భద్రత మండలి సచివాలయం ఉప కార్యదర్శి పుష్పేంద్ర కుమార్ ఉత్తర్వులిచ్చారు. సతీశ్‌రెడ్డి ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. 2027 జూన్ 9 వరకు.. లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆయన ఎన్ఎస్ఏబీ సభ్యుడిగా ఉంటారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన సతీశ్‌రెడ్డి డీఆర్‌డీవో చైర్మన్‌గా, భారత రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారుగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ఆయనను విమానయానం, రక్షణ రంగాల్లో గౌరవ సలహాదారు(రాష్ట్ర క్యాబినెట్ హోదా)గా ఈ ఏడాది మార్చి 19న నియమించింది. ఆయన భారతదేశ క్షిపణి వ్యవస్థలపై పరిశోధన, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.



# దేవ్జీకి షాక్ ఇచ్చిన హిడ్మా మృతి.!

## -ఇండియాలో వణుకు పుట్టించిన సింగిల్ నేమ్ -మావోయిస్ట్ పార్టీలో ఎస్సీ ఎస్టీ సారథ్యానికి దెబ్బ





చురకలు ప్రత్యేక ప్రతినిధి-మల్లోజుల పోతే పోని,వాసు దేవరావు వెళ్లి పోతే నష్టంలేదు..ప్రసాదరావు లొంగిపోతాడని ప్రచారం పాతదే..ఇంకా కొంత మంది నాయకులు కూడా పోతారు.ఐనా సరే రష్యాలో చర్మకారుడు స్టాలిన్ తో విప్లవం వచ్చింది..అణగారిన వర్గాల నుంచి వచ్చిన నాయకత్వం తో పార్టీ మళ్లీ బతుకుతుందని ఆశించిన వారికి హిడ్మా ఎన్కౌంటర్ షాక్ లో పడేసింది.

ఆంధ్రా ఒడిషా బార్డర్ జరిగిన ఎదురు కాల్పుల్లో మావో నేత హిడ్మా పోలీస్ బలగాలకు తెల్లకోడిలా చిక్కిపిట్టల రాలినట్టుగా..ఆరుగురి తో సహా మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయి.హిడ్మా ఆపార్టీ సైన్యాధికారి గా,ఆ పార్టీ నాయకుడు పిరంగిగా పనిచేస్తున్నారు.ఆలాంటి హిడ్మా గురించి రెండేళ్లుగా ఓ లక్ష సార్లు మరణించినట్లు..ఓ లక్ష సార్లు తప్పించుకున్నటు వార్తలు వచ్చాయి..అవన్నీ అబద్ధాలు అబద్ధాలు రాసినవారు తాము ఎప్పుడో చెప్పినట్లు ఇప్పుడు చెప్పుకోవచ్చు ..ఎట్టకేలకు అన్నట్టుగా ఎన్కౌంటర్లో మరణించిన వారిని గుర్తించారు పోలీసులు. వీరిలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పార్టీ నేత, కేంద్ర కమిటీ సభ్యుడు, పీఎల్జీఏ ఇంఛార్జిగా వ్యవహరిస్తున్న మడావి హిడ్మా అలియాస్ సంతోష్, అతని భార్య, డివిజనల్ కమిటీ సభ్యురాలు రాజీ, జిల్లా కమిటీ సభ్యుడు లక్మల్, పీపీసీఎంలు కమ్లూ, మల్ల, హిడ్మా గార్డ్ దేవ్ చనిపోయినట్టుగా పోలీసు వర్గాలు చెప్తున్నాయి. దక్షిణ బస్తర్ అటవీ ప్రాంతంలో తిరుగులేని పట్టు ఉన్న హిడ్మా సేఫ్టీ కోసం ఏఓబీ ప్రాంతంలో అడుగు పెట్టారు కావొచ్చు.బలగాలకు తారస పడడం ఎన్కౌంటర్లో హతం కావడం సంచలనంగా మారింది. హిడ్మా కోసం పోలీసులు టార్గెట్‌గా చేసుకొని ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు.ముఖ్యంగా ఆపరేషన్ కగార్ కు మోస్ట్ వాంటెడ్ ఆలాంటి ఆయన ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో షెల్టర్ తీసుకునేందుకు వచ్చి ఈజీగా ఉంటాడని భావిస్తున్నారు. హిడ్మా హతం తో ఛత్తీస్ఘడ్ మావో ఈస్ట్ గుండె చెదిరిందని చెప్పాలి.ఇటీవల కాలంలో చత్తీస్ గడ్ బస్తర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల ఏరివేత కోసం భారీగా కూంబింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఆయనతో పాటు పార్టీకి చెందిన ముఖ్య నాయకులంతా ఏఓబీ అటవీ ప్రాంతంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారన్న సమాచారం మేరకు జాయింట్ ఆపరేషన్ కొనసాగించినట్టుగా తెలుస్తోంది. ఘటనా స్థలం నుండి 2 ఏకె 47, ఒక రివాల్వర్, ఒక పిస్టల్ స్వాధీనం చేసుకున్నట్టుగా సమాచారం.మావోయిస్టు పార్టీకి చెందిన ముఖ్య నాయకత్వం అంతా కూడా జనజీవనంలో కలిసేందుకు బయటకు వస్తున్న నేపథ్యంలో మోస్ట్ వాంటెడ్ హిడ్మా కూడా బయటకు రావాలని చత్తీస్ గడ్ ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలోనే హిడ్మా స్వగ్రామమైన సుక్మా జిల్లా పవ్వర్తికి అక్కడి డిప్యూటీ సీఎం విజయ్ శర్మ వెళ్లారు. హిడ్మాతో పాటు దేవా కుటుంబ సభ్యులను కలిసి బాహ్య ప్రపంచంలోకి వచ్చేందుకు పిలుపునివ్వాలని సూచించారు. వారితో పాటు సహపంక్తి భోజనం కూడా చేశారు. హిడ్మా పార్టీని వీడినట్టయితే దండకారణ్య అటవీ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి లేకుండా పోతుందని భావించి అక్కడి ప్రభుత్వం హిడ్మా లక్ష్యంగా స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. అనూహ్యంగా మంగళవారం ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో చనిపోయిన మావోయిస్టు పార్టీ నాయకుల్లో హిడ్మాతో పాటు అతని భార్య కూడా ఉండడం సంచలనంగా మారింది. పోలీసు వర్గాలు కూడా హిడ్మా ఉన్నట్టుగా ధృవీకరించడంతో మావోయిస్టు పార్టీ తీరని నష్టాన్ని చూసిందనే చెప్పాలి.పెద్ద ఎత్తున కార్యకర్తలు సహా అగ్రనేతలు కూడా లొంగి పోతున్నారు ఈ సమయంలో హిడ్మా,దేవ్జీ,దామోదర్, దేవల్,మాంజా లాంటి దళిత,ఆదివాసీ గిరిజనులే ఇక మావోయిస్టు పార్టీ బలోపేతం చేస్తారన్న విశ్వాసం పై ప్రచారం చేస్తున్నారు.ఇలా ఊహించ లేదు హిడ్మాను అనే యుద్ధ వీరుడు నేల కొరిగి పోయిన తర్వాత పెద్ద షాక్ దేవ్జి కి తగిలిందని విశ్లేషకులు అంటున్నారు అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఎన్ కౌంటర్ నేపథ్యంలో ఏపీ డీజీపీ హరిష్ కుమార్ గుప్తా కూడా ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మారేడుమిల్లి నుండి మావోయిస్టుల ఏరివేతపై సమీక్షిస్తున్నట్టుగా సమాచారం.బీజేపీ కేంద్ర సర్కార్ తలపెట్టిన కగార్ దెబ్బలకు కేంద్ర కమిటీ సెక్రటరీ జనరల్ నంబాల్లా కేశవరావు సహా నేటి హిడ్మా వరకు ముఖ్యులు వరుసగా కాల్చివేతకు గురయ్యారు.ఇక మిగిలిన వాల్లను మట్టుబెట్టడం పోలీసులకు పెద్ద సమస్యగా కానే కాదు..ఎందుకంటే ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలంటే 500 లోపు నక్సలైటు ఉండగా వాళ్లను చంపడానికి లక్షమంది పోలీసులు,సైనికులు ఉన్నారు.




## మహిళలు ఇక 600 ఆర్టీసీ బస్సులకు ఓనర్లు

### మహిళా స్వయం సహాయక బృందాలకు 600 బస్సులు

హైదరాబాద్ : తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కార్ గ్రామీణ మహిళల సాధికారత కోసం మరో అద్భుతమైన స్కీమ్ ప్రవేశపెట్టింది. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ కింద, మహిళల స్వయం సహాయక బృందాలకు మొత్తం 600 బస్సులు అందించనుంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళలు బస్సుల యజమానులుగా మారి, స్థిరమైన ఆదాయాన్ని సంపాదించే అవకాశం లభిస్తుంది.

ఇది మహిళల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని బలోపేతం చేస్తూ, గ్రామీణ పేదరిక నిర్మూలనకు కీలకంగా నిలవనుంది. ఈ స్కీమ్ ప్రకారం, ఒక్కో బస్సు ధర సుమారు రూ.36 లక్షలు. మహిళా బృందాలు రూ.6 లక్షలు ఇన్వెస్ట్ చేస్తాయి. మిగిలిన మొత్తాన్ని కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా ప్రభుత్వం అందిస్తుంది. బస్సులు మహిళల యాజమాన్యంలో ఉంటాయి. కానీ, ఈ బస్సులను తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నడిపిస్తుంది. TGSRTC ప్రతి బస్సుకు నెలకు రూ.69,648 చెల్లిస్తుంది. ఇందులో రూ.19,648 ఆపరేషనల్ ఖర్చులకు, మిగిలినది లోన్ తిరిగి చెల్లింపునకు వాడతారు. ఇలా 7 సంవత్సరాలపాటు రిస్క్ లేకుండా స్థిర ఆదాయం లభిస్తుంది. కార్యక్రమం దశలవారీగా అమలవుతోంది.

# బీఆర్ఎస్ పేరులోనే దోషం ఉందా? మళ్లీ పేరు మార్చే చాన్స్ కనిపిస్తోందా?




హైదరాబాద్ : జూబ్లీహిల్స్ పరాజయం తర్వాత బీఆర్ఎస్ పార్టీ పరిస్థితిపై తీవ్ర చర్చ జరుగుతోంది. ముఖ్యంగా వరుస పరాజయాలు పార్టీ కేడర్ ను నిరాశకు గురిచేస్తున్నాయి. తెలంగాణ సెంటిమెంటు తగ్గిపోవడం, పార్టీ పేరులో తెలంగాణకు చోటు లేకపోవడమే ఎదురుదెబ్బలకు కారణంగా విశ్లేషిస్తున్నారు. పార్టీ పేరులో తెలంగాణ తొలగించి భారతీయ రాష్ట్ర సమితిగా మార్చడంతోనే ఈ దుస్థితి వచ్చిందని కూడా అంటున్నారు. గత ఎన్నికల ముందు బీఆర్ఎస్ గా పేరు మార్చడం వల్లే అధికారం చేజారిందని, మళ్లీ ఏ ఎన్నికల్లోనూ గెలవలేకపోవడానికి 'తెలంగాణ' సెంటిమెంటు దూరం కావడమే అంటున్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీ పేరులో మళ్లీ పేరు మార్చితే బాగుటుందనే సూచనలు వస్తున్నాయి. ఇదేసమయంలో టీఆర్ఎస్ బీఆర్ఎస్ గా మారిందని.. ఇక వీఆర్ఎస్ తీసుకోవడమే మిగిలివుందని రాజకీయ ప్రత్యర్థులు సెటైర్లు కూడా వేస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ బీఆర్ఎస్ పార్టీ పేరుపైనే ప్రస్తుతం ఎక్కువ చర్చ జరుగుతోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించాలనే ఆశయంతో తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్నే పునాదిగా చేసుకుని తెలంగాణ రాష్ట్ర సమితి అనే పార్టీని పెట్టిన ఉద్యమ నేత కేసీఆర్.. పార్టీ పేరు మార్చి చాలా తప్పు చేశారని విశ్లేషిస్తున్నారు. 2023 ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్ర సమితి – టీఆర్ఎస్ ను భారత రాష్ట్ర సమితిగా మార్చారు. తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైన టీఆర్ఎస్ ను జాతీయ పార్టీగా మార్చాలనే ఆలోచనతో ఈ మార్పు చేశారు కేసీఆర్.

పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేయడమే కాకుండా, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి కారణమైన తాను దేశంలో కీలకనేతగా చక్రం తిప్పుతానని భావనతో కేసీఆర్ తన పార్టీకి జాతీయ స్థాయి గుర్తింపు తేడానికి చాలా ప్రయత్నాలు చేశారు. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీతోపాటు ఒడిశా, ఛత్తీస్ గడ్ తోపాటు దేశవ్యాప్తంగా పార్టీని విస్తరిస్తానని ప్రకటించారు. అంతేకాకుండా దేశ్ కీ నేత కేసీఆర్ అంటూ నినాదాలు ఇచ్చారు. తన నాయకత్వాన్ని దేశవ్యాప్తంగా ప్రజలు కోరుకుంటున్నారన్న ఆలోచనకు వచ్చిన కేసీఆర్.. పార్టీ పేరులో తెలంగాణ ఉంటే దేశ ప్రజలకు దగ్గరయ్యే పరిస్థితి ఉండదని భావించి తెలంగాణకు బదులుగా భారత్ పేరును తీసుకువచ్చారు. అయితే ఇలా భారతీయ రాష్ట్ర సమితిగా మారిన తెలంగాణ రాష్ట్రసమితి సొంత రాష్ట్రంలో తీరని నష్టాన్ని చవిచూడాల్సివచ్చింది. దేశంపై పెత్తనం చెలాయించాలనే ఆశలు అడియాశలు కాగా, చేతిలో ఉన్న అధికారం కోల్పోవాల్సివచ్చింది. ఇప్పుడు జరుగుతున్న ఉప ఎన్నికల్లోనూ ప్రభావం చూపలేకపోవడంతో కేడర్ లో అంతర్మథనం సాగుతోంది. పార్టీ పేరు మార్చిన నుంచి విజయాలు ముఖం చాటేస్తున్నాయని, మళ్లీ పార్టీ పేరు మార్చితే కానీ మంచి రోజులు వచ్చే పరిస్థితి లేదని అంటున్నారు. అయితే ఈ విషయంలో బీఆర్ఎస్ అధిష్టానంలో తర్జనభర్జన సాగుతోందని అంటున్నారు. పార్టీ పేరు మళ్లీ మార్చితే ప్రజల్లో ఇంకా చులకనయ్యే అవకాశం ఉందని గులాబీ పెద్దలు భయపడుతున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ విషయంపై తొందరపాటు నిర్ణయం తీసుకోకుండా నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సలహాలు కూడా అందుతున్నట్లు చెబుతున్నారు.

# అభివృద్ధే లక్ష్యంగా...!




## తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా మార్చేస్తాం!!

## అర్బన్ డెవలప్‌మెంట్ మినిస్టర్స్ రీజనల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు18 : ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం భారతదేశమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్ 2047 అనుగుణంగా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా దేశాన్ని తీర్చిదిద్దాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ని కోరారు.

**అనుమతులు వేగంగా జారీ చేయాలి..** వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అనుమతులు వేగంగా జారీ చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఇవాళ(హైదరాబాద్)లో అర్బన్ డెవలప్‌మెంట్ మినిస్టర్స్ రీజనల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్, గోదావరి జలాల తరలింపు, మూసీ ప్రక్షాళనతో పాటు వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని సూచించారు. రాబోయే ఏడాదిలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను హైదరాబాద్ నగరంలో తీసుకురావాలని ప్రణాళికలు వేస్తున్నామని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేయబోతున్నామని తెలిపారు. 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా, 2047 నాటికి మూడో ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. దేశ ఎకానమీలో 10 శాతం ఎకానమీని తెలంగాణ నుంచి అందించాలని భావిస్తున్నామని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

**భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కృషి..** హైదరాబాద్ నగర అభివృద్ధితో పాటు తాము భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో డ్రై పోర్టు ఏర్పాటు చేయాలనే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. తమ పోటీ ఇతర రాష్ట్రాల నగరాలతో కాదని.. తమ పోటీ సింగపూర్, టోక్యో, న్యూయార్క్ నగరాలతో ఉంటుందని.. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

**అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో కీలక ఒప్పందం...** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ ఏర్పాటుకు కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్‌తో అవగాహన ఒప్పందాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంతో ప్రముఖ డిజిటల్ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందనుంది అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ. బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపరచడానికి ఐడీఈఏ అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పనిచేస్తుంది. టెక్నాలజీ ద్వారా నాణ్యమైన విద్యను అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందించనుంది. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి తమప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్రంలోని యూనివర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్‌గా తీర్చి దిద్దేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఓఎల్ అధ్యక్షుడు పీటర్ స్కాట్‌కు వివరించారు ముఖ్యమంత్రి. ఈ సమావేశంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు అండ్ సీఈవో పీటర్ స్కాట్, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఘంటా చక్రపాణి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## తెలంగాణకు మరోసారి జాతీయ స్థాయిలో అవార్డుల పంట

ఢిల్లీ, నవంబరు18 : జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన ఆరో జాతీయ జల అవార్డులు – 2024లో జాతీయ స్థాయిలో తెలంగాణ తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం– 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 5,20,362 పనులని పూర్తిచేసింది. జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇవాళ (మంగళవారం) పురస్కారాలు ప్రదానం చేశారు. జల్ సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒక పట్టణ స్థానిక సంస్థ, రెండు భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్‌జీఓలు, ఇద్దరు దాతలు, 14 మంది నోడల్ అధికారులు ఉన్నారు. క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. రాష్ట్రాలను ఐదు జోన్లుగా విభజించారు. ప్రతి ఒక్కరూ కనీసం 10 వేల కృత్రిమ రీఛార్జి, స్టోరేజ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో రూఫ్‌టాప్ వాన నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, బావుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేర్చారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అవార్డులు ప్రకటించారు. మొదటి కేటగిరీలో ఎంపికైన వాటికి రూ.2 కోట్లు, రెండో కేటగిరీలో కోటి రూపాయలు, మూడో కేటగిరీలో రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. జిల్లాల విభాగంలో కేటగిరీ–1 కింద దక్షిణ జోన్ నుంచి మూడు జిల్లాలను ఎంపిక చేయగా.. ఆ మూడింటినీ తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. ఒక్కో జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నగదు బహుమతి అందజేసింది. ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు ఈ నగదు బహుమతిని సాధించాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఏరియాలో జల సంరక్షణ చర్యలు చేపట్టినందుకు.. హైదరాబాద్ మెట్రో కార్పొరేషన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించింది. రూ.2 కోట్ల నగదు బహుమతిని సొంతం చేసుకొంది. ఈ విభాగంలో కేటగిరీ–2లో వరంగల్, నిర్మల్, జనగామ, జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి రూ.కోటి చొప్పున బహుమతి గెలుచుకున్నాయి. కేటగిరీ–3లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ 1, 3 ర్యాంకుల్లో నిలిచి.. రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి సొంతం చేసుకున్నాయి. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు నోడల్ అధికారిగా వ్యవహరించిన కేంద్ర జల సంఘానికి చెందిన ఎ.సతీశ్‌కు కూడా అవార్డు దక్కింది. ఈ మేరకు పౌర సంబంధాల అధికారి, తెలంగాణ సమాచార కేంద్రం న్యూఢిల్లీ ద్వారా ఈ ప్రకటన జారీ చేశారు.

**అవార్డుల వివరాలివే..** డా.శ్రీజన, ఐఏఎస్, పీఆర్, ఆర్డీ కమిషనర్, కే.అశోక్ కుమార్ రెడ్డి, ఎండీ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్, రాజర్షి షా, ఐఏఎస్, కలెక్టర్, ఆదిలాబాద్, జే.శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్, నల్గొండ, కుమార్ దీపక్, ఐఏఎస్, కలెక్టర్, మంచిర్యాల, డాక్టర్ సత్యశారద, ఐఏఎస్, కలెక్టర్, వరంగల్, అభిలాష అభినవ్, ఐఏఎస్, కలెక్టర్, నిర్మల్, రిజ్వాన్ భాషా షేక్, ఐఏఎస్, కలెక్టర్, జనగామ, జితేష్ వీ పాటిల్, ఐఏఎస్, భద్రాద్రి కొత్తగూడెం, బి.విజయేందిర, ఐఏఎస్, కలెక్టర్, మహబూబ్ నగర్.




## హైదరాబాద్‌లో ప్రముఖ హెూటళ్ల ఛైర్మన్లు, డైరెక్టర్ల ఇళ్లలో ఐటీ సోదాలు

హైదరాబాద్: నగరంలో ఆదాయపన్ను శాఖ సోదాలు చేపట్టింది. ఏకకాలంలో 15 చోట్ల ఆ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ప్రముఖ హెూటళ్ల ఛైర్మన్లు, డైరెక్టర్ల నివాసాల్లో సోదాలు జరిపి పలు పత్రాలు పరిశీలిస్తున్నారు. పిస్తా హౌస్, షా గౌస్, మెహిఫిల్ హెూటళ్లలో అధికారులు తనిఖీలు చేస్తున్నారు.


ఈ హెూటళ్లు ఏటా వందలకోట్ల వ్యాపారం చేస్తున్నాయి. పిస్తా హౌస్, షా గౌస్ హెూటళ్లు ఇతర నగరాల్లోనూ నడుస్తున్నాయి. దుబాయ్‌లోనూ వాటికి బ్రాంచ్‌లు ఉన్నాయి.

భారీగా పన్ను ఎగవేత ఆరోపణల నేపథ్యంలో ఆదాయపన్ను శాఖ అధికారుల తనిఖీలు చేపట్టారు. రాజేంద్రనగర్‌లోని పిస్తా హౌస్ యజమాని మాజిద్ ఇంట్లో, శాలిబండలోని పిస్తాహౌస్ ప్రధాన బ్రాంచ్‌ల్లో సోదాలు కొనసాగుతున్నాయి.





నేరడిగొండ: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి కష్టం లేకుండా చూశామని BRS కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అప్పుడు ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి ధాన్యం గింజ కొన్నామన్నారు. మళ్లీ మనమే అధికారంలో వస్తామని.. రైతుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డ్‌లో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడేందుకు కేటీఆర్ వచ్చారు. ఆయనకు నేరడిగొండ టోల్ ప్లాజా వద్ద బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వాగతం పలికారు. అనంతరం నేరడిగొండ జిన్నింగ్ మిల్లులో సోయాబీన్, మొక్క జొన్న పంట కొనుగోలు కేంద్రాలను కేటీఆర్ పరిశీలించారు. రైతులు అధైర్య పడవద్దని.. మీకు అండగా కేసీఆర్, భారత రాష్ట్ర సమితి పార్టీ ఉంటుందని హామీ ఇచ్చారు.

## గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేమూ కోరుతున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్రం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని.. తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకంగా మారుతుందని చెప్పారు. హెూటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో సీఎం మాట్లాడారు. "హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త నగరాన్ని నిర్మించాలని భావిస్తున్నాం. తెలంగాణ రైజింగ్–2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించాం. ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుంది. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. కేంద్రం నిర్దేశించుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో రాష్ట్ర వాటా 10 శాతం ఉండాలని భావిస్తున్నాం. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయి. కేంద్రం సహకరించకుంటే రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుంది. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్‌ఆర్‌ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి. దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధాని మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించుకున్నట్లే మేం తెలంగాణ మోడల్ తీసుకొచ్చాం. ఆయన సబర్మతి నది ప్రక్షాళన చేపట్టినట్లే మేం మూసీ పునరుజ్జీవం చేస్తున్నాం. గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేం తెలంగాణకు కోరుతున్నాం. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఏపీ మంత్రి పొంగూరు నారాయణ, గుజరాత్ మంత్రి కనుభాయ్ మోహన్‌లాల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ తుగ్లక్ నిర్ణయాలతో పత్తి రైతులకు కష్టాలు: హరీశ్‌రావు



వరంగల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు విధానాలు, సీసీఐ తుగ్లక్ నిర్ణయాలతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. సీసీఐ ఎల్1, ఎల్2, ఎల్3 విధానాల కారణంగా.. గత రెండు రోజులుగా సీసీఐ, ప్రైవేట్ పత్తి కొనుగోళ్లు బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వరంగల్ ఎనుమాముల మార్కెట్‌ను పార్టీ నాయకులతో కలిసి హరీశ్ రావు సందర్శించారు.

యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన, ఎకరానికి 7 క్వింటాళ్ల కొనుగోలు పరిమితిని తొలగించాలని డిమాండ్ చేశారు.

## బుల్లెట్‌ను కాదు.. బ్యాలెట్‌ను నమ్ముకోండి: కేంద్రమంత్రి బండి సంజయ్




వేములవాడ: అర్బన్ నక్సలైట్ల మాట విని యువత చెడిపోవద్దని కేంద్ర మంత్రి బండి సంజయ్ హితవు పలికారు. వాళ్లంతా ఏసీ గదుల్లో ఉండి పైరవీలు చేసుకుంటున్నారని విమర్శించారు. వేములవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బుల్లెట్లను నమ్ముకున్న మావోయిస్టులు ఏం సాధించారని ప్రశ్నించారు. "ఇన్నాళ్లూ తుపాకీ చేతబట్టిన హిడ్మా ఏం సాధించారు. ఇవాళ ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగి ఎదురుకాల్పుల్లో హిడ్మా, ఆయన భార్య చనిపోయారు. తుపాకీ చేతపట్టుకొని చర్చలు కావాలంటే కుదరదు. ఇప్పటికే లొంగిపోయిన మావోయిస్టులంతా క్షేమంగా ఉన్నారు. బుల్లెట్లను నమ్ముకొని ఏం సాధించలేరు. బ్యాలెట్‌ను నమ్ముకోండి" అని బండి సంజయ్ అన్నారు.

## కుట్ర చేసే బయటకు పంపారు.. కవిత సంచలన వ్యాఖ్యలు



ఖమ్మం, నవంబర్ 18: కొత్త రాజకీయ పార్టీ గురించి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత (%ఖుజఊ్ష్ఞు%) కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. తనను ఏ విధంగా పార్టీ నుంచి బయటకు పంపారనే విషయాన్ని తెలియజేశారు. రాజకీయ పార్టీ గురించి ఇప్పుడప్పుడే ఆలోచన చేయటం లేదని కవిత అన్నారు. బీఆర్‌ఎస్‌లో నుంచి తనను సస్పెండ్ చేశారని.. ఆ పార్టీతో తనకెటువంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కుట్రతో బీఆర్‌ఎస్ నుంచి తనను బయటికి పంపించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది కుట్ర చేసి తనను.. తన కుటుంబాన్ని బీఆర్‌ఎస్ పార్టీకి దూరం చేశారన్నారు. తన జీవితంలో చిన్న పొరపాటు కూడా చేయలేదన్నారు. రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షం బాధ్యతగా వ్యవహరించటంలేదని విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరావును బీఆర్‌ఎస్ వదులుకోవడంతోనే మూడోసారి అధికారంలోకి రాకుండా పోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. తుమ్మల బయటకు వెళ్లడంతోనే రాష్ట్రంలో గులాబీ పార్టీ పరిస్థితి తలకిందులైందన్నారు. తుమ్మల లాంటి నేతను బీఆర్‌ఎస్ వదులుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పే అని అన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం ఫెయిల్ అయ్యిందని.. తన బాధ్యతను నిర్వర్తించలేకపోతోందని వ్యాఖ్యలు చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను భవిష్యత్తులో తాము పోషించబోతున్నామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తనకు ఎక్కడా ఎటువంటి అవకాశం ఇవ్వలేదని.. కనీసం ఒక టీచర్ పోస్ట్ కూడా ట్రాన్స్ఫర్ చేయించుకోలేకపోయానని చెప్పుకొచ్చారు. బీఆర్‌ఎస్‌లో జాగృతి కార్యకర్తలకు అన్యాయం చేశారని... కనీస గుర్తింపు ఇవ్వలేదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. కవిత ఇంకా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదిన జిల్లా ఖమ్మం జిల్లా అని జాగృతి అధ్యక్షురాలు అన్నారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖమ్మం జిల్లా పూర్తిగా మారిపోయిందని గుర్తుచేశారు. వెంగళరావు హయాంలో జిల్లా విశేషంగా అభివృద్ధి చెందిందన్నారు. ఆ తరువాత పెద్దలు తుమ్మల నాగేశ్వరావు ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఖమ్మం అభివృద్ధి కోసం ఎవరి ప్రయత్నం వారు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదని అన్నారు. ఇంకా ఖమ్మం అభివృద్ధి చెందాల్సి ఉందని.. సీతారామ ప్రాజెక్టును కూడా వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక తెలంగాణ రావాలన్నదే తన ఆశయమని.. అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమని కవిత స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి విప్లవాత్మకమైన మార్పులు రావాలని.. అన్ని వర్గాలకు అధికారం అందాలని ఆకాంక్షించారు. బీసీలకు భిక్షం వేయొద్దని.. బిక్షం వేస్తే తీసుకోవడానికి వాళ్ళు బిచ్చగాళ్ళు కాదన్నారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి బీసీల ద్రోహిగా మిగిలిపోతారని.. నూటికి నూరు శాతం బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేయాలని డిమాండ్ చేశారు. జమలాపురం టెంపుల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జమలాపురం ఆలయంపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. పాతర్లపాడులో సామినేని రామారావు దారుణ హత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రామారావు హత్యపై డీజీపీని కలువనున్నట్లు కవిత తెలిపారు. హత్యా రాజకీయాలు సరికాదన్నారు. రేపు (బుధవారం) హైదరాబాద్‌లో సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి భవన్‌ను ముట్టడించబోతున్నామని ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఆయకట్టు స్థిరీకరించి రైతాంగానికి సాగు నీరు అందించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల భూమి వచ్చే వరకు వారి తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు. తెలంగాణలో పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని.. సీసీఐతో మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం పేరు మార్చి చేపడుతోంది: మంత్రి ఉత్తమ్



దిల్లీ: పోలవరం–బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం పేరు మార్చి చేపడుతోందని, ఆ ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకించామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రితో భేటీ అనంతరం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు.ల "ఏపీ ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఆ ప్రాజెక్టును పరిగణనలోకి తీసుకోవద్దని కేంద్రమంత్రిని కోరాం. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు భూ సేకరణ కోసం కర్ణాటక జీవో జారీ చేసింది. 519 మీటర్లకంటే ఎక్కువ ఎత్తు పెంచవద్దని సుప్రీంకోర్టు స్టే ఉంది. స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టింది. కర్ణాటక ప్రభుత్వం తెచ్చిన జీవోను కేంద్రజల్‌శక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లాం.

తెలంగాణలోని పలు ఇరిగేషన్ ప్రాజెక్టులను నిధులివ్వాలని కోరాం. మా ప్రభుత్వంలో కేఆర్‌ఎంబీ టెలీమెట్రీ స్టేషన్ పనుల్లో పురోగతి వచ్చింది. కేఆర్‌ఎంబీ టెలీమెట్రీ స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాని అడిగాం.. మరో 20 టెలీమెట్రీ స్టేషన్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఫేజ్–2లో 9, ఫేజ్–3లో 11 నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.




దేశీయంగా పసిడి ధరలు దిగొచ్చాయి. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ పుత్తడి ధర తగ్గుముఖం పట్టాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.25 లక్షలు పలుకుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం రూ.1.14 లక్షల వద్ద కొనసాగుతోంది. అటు వెండి ధర సైతం కిలో రూ.1.56 లక్షలుగా ఉంది. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా బంగారం ధరలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ఈనెల 13వ తేదీన 10 గ్రాముల పసిడి రూ.1.30 లక్షల వద్ద ఉంది. ఐదు రోజుల వ్యవధిలో రూ.5వేల మేర తగ్గింది. వెండి కిలో రూ.1.70 లక్షలు ఉండేది. అప్పటితో పోలిస్తే దాదాపు రూ.15వేలు తగ్గింది. అప్పట్లో అంతర్జాతీయంగా ఔన్సు బంగారం 4200 డాలర్లుగా ఉండగా.. ఇప్పుడు 4010 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ప్రస్తుతం ఔన్సు 49 డాలర్లుగా ఉంది. ఈ ధరలను అనుసరించి దేశీయంగానూ ధరలు తగ్గుముఖం పట్టాయి. సాధారణంగా బంగారానికి, అమెరికాలోని వడ్డీ రేట్లకు విలోమ సంబంధం ఉంటుంది. ఫెడ్ వడ్డీ రేట్లు పెంచినప్పుడు బంగారం ధర పడుతుంది. తగ్గినప్పుడు పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అమెరికా డాలర్ బలపడటం, వచ్చే నెల ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు క్షీణించడంతో పసిడికి డిమాండ్ తగ్గింది. దీనికితోడు డాలర్ ఇండెక్స్ బలపడడమూ మరో కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ ముగిసిన నేపథ్యంలో కీలక ఎకనామిక్ డేటా ఈ వారం వెలువడనుంది. ఫెడ్ గత మీటింగ్‌కు సంబంధించిన మినిట్స్, సెప్టెంబర్ నెలకు సంబంధించి జాబ్స్ డేటా ఈ బుధ, గురువారాల్లో వెలువడనుంది. ఈ డేటా ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయాన్ని, బంగారం ధరలను ప్రభావితం చేయనుంది. వాస్తవానికి వచ్చే నెలలో మరోమారు వడ్డీ రేట్లలో కోత ఉంటుందని తొలుత అంచనాలు ఉన్నప్పటికీ.. ఫెడ్ అధికారులు మాత్రం దీనిని తోసిపుచ్చుతున్నారు.

# ప్రథమ స్వాతంత్ర్య సమర యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి

## - నవంబర్ 19... ఝాన్సీ రాణి జయంతి

ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగుబాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది. ఉత్తర, మధ్య భారత దేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది. 1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీ వైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి నిస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు. ఉత్తర భారత దేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది. భారత దేశంలోని బ్రిటిష్ పరిపాలనలో ఝాన్సీ కీ రాణి గ ప్రసిద్ధికెక్కినది. 1857 లో భారత దేశ తిరుగుబాటు దార్లలో ముఖ్యమైన వాళ్ళలో ఆమె ముఖ్యమైనది. ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరం నవంబరు19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమీ నాడు జన్మించింది. లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసు లోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. 1851లో లక్ష్మీబాయికి ఒక కుమారుడు జన్మించాడు. అయితే ఆ పిల్లవాడు నాలుగు నెలల వయసులోనే కన్ను మూశాడు. 1853 లో గంగాధర రావుకు అనారోగ్యం సోకింది. వేరే బిడ్డను ఎవరినైనా దత్తత తీసుకోమని అందరూ సలహా ఇచ్చారు. దాంతో ఆయనకు దూరపు బంధువైన వాసుదేవ నేవల్కర్ కుమారుడైన దామోదర్ రావు అనే పిల్లవాడిని చని పోవడానికి కేవలం ఒక్క రోజు ముందుగానే దత్తత తీసుకున్నారు. 1853, నవంబర్ 21 వ తేదీన గంగాధరరావు మరణించాడు. హిందూ సాంప్రదాయం ప్రకారం దామోదర్ రావు రాజ్యానికి వారసుడు కావల్సి ఉన్నా బ్రిటీష్ ప్రభుత్వం అందుకు అంగీకరించ లేదు. దామోదర్ రావు రాజా కు రక్త సంబంధం కానందు




వలన అంటే దత్త సంబంధం కావున, ఈస్ట్ ఇండియా కంపనీ గవర్నర్ జనరల్ లార్డ్ డల్ హౌసి, సిద్ధాంతం ప్రకారం రావు సింహాసనాన్ని అధిష్టించే అధికారం లేదని అతనిని నిరాకరించాడు. రాణి ఝాన్సీని ఇవ్వకూడదని నిశ్చయించు కొన్నది. ఆమె తన సైన్యాన్ని బలపర్చి, తమకు తాముగా వచ్చిన వాళ్ళను పోగుచేసి ఒక సేనను తయారు చేసింది. మహిళలకు కూడా యుద్ధ శిక్షణ ఇవ్వబడింది. యుద్ధ వీరులైన గులాం గాస్ ఖాన్, దోస్త్ ఖాన్, ఖుదా బక్ష్, లాల భు బక్షి, మోతీ బాయి, సుందర్ - ముందర్, ఖాసి బాయి, దీవాన్ రఘునాథ్ సింగ్, దీవాన్ జవహర్ సింగ్ రాణి బలగంలో ఉన్నారు. అలా జరిగిన యుద్ధంలో లక్ష్మిబాయి 1858 జూన్ 17 న గ్వాలియర్ లో యుద్ధ సమయములో మరణించింది. గ్వాలియర్ యుద్ధం గురించి జనరల్ రోస్ ప్రస్తావిస్తూ విప్లవ కారుల్లోకెల్లా ఆమే అత్యంత ధైర్య సాహసాలతో పోరు సల్పిందని కితాబిచ్చాడు. ఆమెకున్న ధైర్యము, పరాక్రమము, వివేకము, భారత దేశంలో 19 వ శతాబ్దములో మహిళలకున్న అధికారం పై ఆమెకున్న ముందుచూపు, ఆమె చేసిన త్యాగాలు ఆమెను స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రసిద్ధ వ్యక్తిగా నిలిపింది. "జోన్ ఆఫ్ ఆర్క్" లాగా ఆమె భారత దేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచిపోయింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**




మారేడుమిల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ ఉన్నారు.

మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిడ్మా.. బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు.

**ఛత్తీస్‌గఢ్‌లోనూ..** మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోనూ ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు-భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు.




వరుస ఎదురుదెబ్బలతో ఉక్కిరిబిక్కిరవుతున్న మావోయిస్టులకు తాజాగా మరో గట్టి షాక్ తగిలింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత మద్వి హిడ్మా అలియాస్ సంతోష్ మృతి చెందాడు. మావోయిస్టు పార్టీలో భీకర గెరిల్లా దాడులకు వ్యూహకర్తగా పేరొందిన హిడ్మా మృతి చెందడం.. భద్రతాదళాలకు భారీ విజయనే చెప్పాలి. భద్రతా బలగాలపై కనీసం 26 సాయుధ దాడులకు ఇతడు పథక రచన చేసినట్లు సమాచారం.

**17 ఏళ్ల వయసులో ఉద్యమం వైపు..** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన హిడ్మాకు పార్టీలో విలాస్, హిడ్మాల్, సంతోష్ అనే పేర్లు ఉన్నాయి. మావోయిస్టు ఉద్యమం వైపు ఆకర్షితుడై 17 సంవత్సరాల వయసులోనే పార్టీలో చేరాడు. మురియా తెగకు చెందిన హిడ్మాకు ఇంగ్లీష్, హిందీ, గోండు, తెలుగు, కోయ, బెంగాలీ భాషల్లో పట్టుంది. దండకారణ్యంలో పార్టీశ్రేణుల్ని ముందుండి నడిపించడంలో ఆరితేరారు. భారీ దాడులకు వ్యూహకర్తగా గుర్తింపు ఉంది. అడవుల్లోని కేంద్ర బలగాల క్యాంపులపై మెరుపు దాడులు నిర్వహించడంలో నిష్ణాతుడు. ఈ క్రమంలోనే మిలిటరీ దాడులకు మారుపేరైన పీఎల్‌జీఏలో ఒకటో బెటాలియన్‌కు సారథ్యం వహిస్తున్నారు. ప్రతి భారీ దాడిలో స్వయంగా పాల్గొంటూ కేంద్ర బలగాలకు మోస్ట్ వాంటెడ్‌గా మారారు. కొంతకాలం క్రితం కేంద్ర కమిటీలో స్థానం సంపాదించాడు. సాధారణంగా ఈ కమిటీలో తెలుగు రాష్ట్రాల వారు అత్యధికంగా ఉంటారు. కానీ, సుక్మా నుంచి ఈ స్థానంలోకి వెళ్లిన తొలి వ్యక్తి ఇతడే.

**పోలీసులకు కొరకరాని కొయ్య..** పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) నంబర్ 1 బెటాలియన్‌కు హిడ్మా నేతృత్వం వహిస్తున్నాడు. దీనిలోని సభ్యులు అత్యాధునిక ఆటోమేటిక్ ఆయుధాలను వినియోగిస్తారు. ఈ బెటాలియన్‌లో 350 వరకు ఉంటారని సమాచారం. దళాలపై దాడులు చేశాక.. అపహరించిన అత్యాధునిక ఆయుధాలు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లను ఈ బెటాలియన్ ఎక్కువగా వాడుతుంటుంది. వీరు పూర్తిగా యూనిఫామ్‌లో ఉంటారని సమాచారం. హిడ్మా నేతృత్వంలో జరిగే దాడుల్లో భద్రతా దళాలకు జరిగే నష్టంతో పోలిస్తే మావోల వైపు 10శాతం కంటే తక్కువ ప్రాణ నష్టం ఉంటుందనే పేరుంది. రెండు దశాబ్దాలుగా ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఇతడి ప్రమేయంతోనే చాలా దాడులు జరిగినట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. చింతల్నార్, డోర్నాపాల్, తాడిమెట్ల, మినప.. ఇలా భారీగా ప్రాణనష్టం జరిగిన అనేక ఆపరేషన్లలో హిడ్మా స్వయంగా పాల్గొని 200 మందికి పైగా పోలీసు సిబ్బంది మృతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమయ్యాడని సమాచారం. యుద్ధ నైపుణ్య మెలకువల్ని కేడర్‌కు అలవోకగా నూరిపోస్తుంటాడనే పేరుంది. కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించే పోలీసు బలగాలపై, సీఆర్పీఎఫ్ శిబిరాలపై మెరుపుదాడులు నిర్వహించడంలో కీలకంగా వ్యవహరిస్తుంటాడు. పార్టీలో పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) విభాగం ఇతడి కనుసన్నల్లోనే పనిచేస్తుంది.

**హిడ్మా జరిపిన దాడుల్లో కొన్ని..** 2010లో దంతెవాడలో జరిగిన దాడిలో 76 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. 2013లో జైరామ్ ఘాటీలో జరిపిన మెరుపుదాడిలో 27 మంది మరణించారు. వీరిలో పలువురు కాంగ్రెస్ నాయకులు కూడా ఉన్నారు. 2021లో సుక్మా-బీజాపుర్‌లో జరిగిన మెరుపుదాడిలో 22 మంది భద్రతా సిబ్బంది మృతిచెందారు.

**బలమైన ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్..** హిడ్మా స్థానిక ఆదివాసీ తెగకు చెందిన వ్యక్తి కావడంతో అతడికి గ్రామస్థుల మద్దతు లభించేది. దీంతో బలమైన ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొన్నాడు. అతడు ఉన్న ప్రాంతానికి కొన్ని కిలోమీటర్ల అవతల భద్రతా దళాల కదలికలు కూడా అతనికి తెలిసిపోతాయి.

ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశాకు తేలిగ్గా వెళ్లే జంక్షన్‌లో ఉండటం కూడా అతనికి కలిసి వస్తోందని గతంలో ఓ భద్రతా అధికారి వెల్లడించారు. కేవలం 7వ తరగతి వరకే చదివిన హిడ్మా ఇంగ్లిష్ మాత్రం చక్కగా మాట్లాడగలడని 2015 ఫిబ్రవరిలో అతన్ని ఇంటర్వ్యూ చేసిన ఓ విలేకరి పేర్కొన్నారు.

**కర్రెగుట్టల దాడితో ఆంధ్రాకు వచ్చి..** హిడ్మా కోసం కొన్నేళ్లుగా ఛత్తీస్‌గఢ్ పోలీసులతోపాటు సీఆర్పీఎఫ్ కోబ్రా బలగాలు, తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో కర్రెగుట్టల నుంచి మొదలుకొని అబూజ్‌మడ్ పర్వతాలతోపాటు నేషనల్ పార్కులో భద్రతా దళాలు అణువణువూ జల్లెడ పట్టాయి. దండకారణ్యంలో వేలాదిగా సాయుధ బలగాలు కూంబింగ్ నిర్వహించగా.. అనేకమంది మావోయిస్టు అగ్రనేతలు వరుసగా ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు హిడ్మా కూడా తన బెటాలియన్‌తో కలిసి నేషనల్ పార్క్‌లోనే ఉన్నట్లు నిఘా వర్గాలు అనుమానించాయి. ఆ సమయంలో అతడి తాజా ఫొటో ఒకటి బయటకు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది.ల అయితే, జనవరిలో భద్రతా బలగాలు తన స్థావరాన్ని చుట్టుముట్టడానికి కొన్ని గంటల ముందే హిడ్మా అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత సమీపంలోని ఓ కొండల ప్రాంతంలో నక్కినట్లు తెలిసింది. ఓ సమయంలో హిడ్మా లొంగిపోనున్నాడనే ప్రచారం కూడా జరిగింది. భద్రతా బలగాల కూంబింగ్ నిరంతరం కొనసాగుతుండటంతో హిడ్మా బృందం.. ఛత్తీస్‌గఢ్ నుంచి మకాం మార్చేందుకు ఆంధ్రా సరిహద్దులను పరిశీలించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

మారేడుమిల్లి సరిహద్దు మీదుగా వీరు ఆంధ్రాలోకి ప్రవేశించారని, అక్కడి నుంచి ఒడిశా వెళ్లేందుకు ప్రయత్నించినట్లు పేర్కొన్నాయి. వీరి కదలికలపై సమాచారం అందడటంతో భద్రతా బలగాలు తాజా ఆపరేషన్‌ను చేపట్టాయి.

# పరిపాలనా దక్షురాలు ఇందిరా ప్రియదర్శిని

## - నవంబర్ 19... ఇందిరా గాంధీ జయంతి

ఇందిరాగాంధీ ఈ పేరు వినగానే ... తెగింపు , ధైర్యం, ఆత్మ విశ్వాసం, సాధికారిక, పట్టుదల అన్నీ గుర్తుకు వస్తాయి. ఒక మహిళ అయి ఉండి ప్రఖ్యాతి గాంచిన మహానేతలతో పోటీ పడి భారత దేశాన్ని ఏకచక్రాధి పత్యంగా పాలించ గలిగిన రాజనీతిజ్ఞులు. ఎన్ని సంక్షోబాలు ఎదురైనా, బెణుకు అనేది లేకుండా , ధైర్యసాహసాలతో ప్రధాని హొదాలో ఎన్నో కఠినమైన నిర్ణయాలు తీసుకోని పరిపాలనలో చెరగని ముద్ర వేసుకున్న సాటిలేని మేటి. ఇందిరా ప్రియదర్శిని గాంధీ (నవంబర్ 19, 1917 %-% అక్టోబర్ 31, 1984) భారత దేశపు మొట్ట మొదటి, ఏకైక మహిళా ప్రధాన మంత్రి. ఆమె భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఏకైక కుమార్తె. జవహర్ లాల్ నెహ్రూ మొదటి సారి ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ప్రధానమంత్రి సెక్రటరీగా జీతం లేకుండా పనిచేసింది. 1964 సంవత్స రములో తండ్రి మరణం తరువాత రాజ్యసభకు ఎన్నిక అయింది. లాల్ బహదుర్ శాస్త్రి మంత్రి మండలిలో ప్రసారశాఖ మంత్రిగా పని చేసింది.ఆమె 1966 నుండి 1977 వరకు వరుసగా 3 పర్యాయాలు, 1980లో 4వ పర్యాయం ప్రధాన మంత్రిగా పనిచేసింది. 1917, నవంబర్ 19 తేదీన జవహర్ లాల్ నెహ్రూ, కమలా నెహ్రూల ఏకైక సంతానంగా జన్మించింది ఇందిరాగాంధీ. తాను ఆడుకునే ప్రతీ ఆటలో బ్రిటీష్ వారిని ఎదిరించి పోరాడే ఒక దేశభక్తురాలి గానే తనను ఊహించుకుంటూ ఆడుకొనేది. 18 సంవత్సరాల వయస్సులోనే ఆమె వానర సేనను నడిపి ఉద్యమాలలో అనుభవం సంపాదించింది. ఇందిర పూణే విశ్వవిద్యాలయం నుండి మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణు రాలయింది. విశ్వభారతి విశ్వ విద్యాలయంలో చదివింది. ఇంగ్లండు నందలి ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయం లోని సోమర్ విల్ కళాశాలలో చదివేటప్పుడు, స్వాతంత్ర్యం సంపాదించడంకోసం లండనులో స్థాపించ బడిన ఇండియాలీగ్ లో, 1930 లో చేరింది. 1936లో తల్లి కమలా నెహ్రూను కోల్పోయింది. 1938 లో భారత జాతీయ కాంగ్రెస్ లో చేరింది. జర్నలిస్ట్ ఫిరోజ్ తో పరిచయము క్రమంగా పరిణ యానికి దారి తీసింది. నెహ్రూ కాశ్మీరీ బ్రాహ్మణులు కావటం, ఫిరోజ్ పూర్వీకులు పర్షియా నుండి భారత దేశానికి వలస వచ్చి స్థిరపడిన పార్సీలు కావటంతో పెళ్లి చేయటానికి ఆ సమయంలో నెహ్రూ ఒప్పుకోలేదు, ఆ తర్వాత నెహ్రూను మహాత్మా గాంధీ ఒప్పించడంతో, 1942-03-26న ఇందిరా (25), ఫిరోజ్ (29)ల పెళ్లి చేసారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో జైలుకు వెళ్ళి 1943 మే 13 న విడుదలైంది. జైలులో ఉండగానే ఆమె ఒక మగ పిల్ల వాడికి తల్లి కాగా, ఆ బాలునికి రాజీవ్ అని పేరు పెట్టారు. రాజీవ్ గాంధీకి రెండు సంవత్సరాల వయసు ఉన్నప్పుడు, వారు లక్నో వెళ్లగా, అక్కడ నేషనల్ హెరాల్డు పత్రికా సంపాదకునిగా ఫిరోజ్ గాంధీ పనిచేసిన సమయంలో సంజయ్ గాంధీ జన్మించాడు. భర్తతో కలిసి అలహాబాదులో ఉంటున్న సమయంలో విభేదాలు రావడంతో అలహాబాదును వదలి ఢిల్లీ చేరి ఆమె తండ్రితో జీవించింది. 1951లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలలో జవహర్ లాల్ నెహ్రూకు పోటీగా ఫిరోజ్ గాంధీ రాయ్‌బరేలీ నియోజక వర్గంలో పోటీ చేసినప్పుడూ ఇందిర తండ్రి తరఫున ప్రచారం చేసి , ఆ ఎన్నికల్లో తండ్రిని గెలిపించింది. ఖంగుమని మోగే కంఠస్వరం, సామాన్యులలో కలసిపోయే ఆమె స్వభావం ప్రజలను ఆకర్షించేవి. 1959 ఫిబ్రవరి 2 న భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆమెను ఎన్నుకున్నారు. 1960 సెప్టెంబర్ 8న ఫిరోజ్ గాంధీ మరణించాడు. 1964 మే 27న జవహర్ లాల్ నెహ్రూ మరణిం చడంతో ఇందిర జీవితంలో పెనువిషాదం ఏర్పడింది. తండ్రి మరణానంతరం ఇందిర రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికై లాల్ బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో కేబినెట్



హొదా కలిగిన సమాచార, ప్రసార శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టింది. 1966 జనవరి 24న ఇందిర మొదటి సారిగా ప్రధానమంత్రి బాధ్యతలను స్వీకరించి దేశ మొట్ట మొదటి మహిళా ప్రధానమంత్రిగా సంచలనం సృష్టించింది. నేటివరకు కూడా మరో మహిళ ఆ స్థానాన్ని చేపట్టలేని రికార్డు అది. ఇందిర 1966 నుండి 1977 వరకు వరుసగా 3 పర్యాయాలు, 1980లో 4వ పర్యాయం ప్రధానమంత్రిగా పనిచేసింది. 1975-06-26 భారత ప్రధాని ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. 1977-03-22 ఇందిరా గాంధీ భారత ప్రధాని పదవికి రాజీనామా చేశారు. 1977లో అత్యవసర పరిస్థితిని ఉపసంహరించి ఎన్నికలను ప్రకటించింది. అత్యవసర పరిస్థితి పరిణామం 1977 ఎన్నికలలో ఓటమి రూపంలో బయట పడింది. ఇందిర సొంత నియోజకవర్గ మైన రాయ్ బరేలీలో కూడా జనతా పార్టీకి చెందిన రాజ్ నారాయణ్ చేతిలో ఓడిపోయింది. 1977-10-03 ఇందిరా గాంధీని అరెస్టు చేశారు. ఇది జాతీయ అసంతృప్తి, దేశ వ్యాప్తంగా నిరసనలకు దారి తీసింది. 1978లో ఇందిరా కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసి ఉప ఎన్నికలలో విజయం సాధించి లోక సభలో మళ్ళీ అడుగు పెట్టింది. 1980-01-06 ఎన్నికలలో ఇందిరా గాంధీ కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికలలో భారీ విజయం సాధించి మరో సారి ప్రధాన మంత్రి బాధ్యతలను చేపట్టింది. ఈసారి విశేషం ....ఆమె స్వయంగా ఆంధ్ర ప్రదేశ్ లోని మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి భారీ ఆధిక్యతతో గెలుపొందింది. రాజభరణాల రద్దు, 1966లో రూపాయి మూల్య న్యూనీకరణ, 1969లో బ్యాంకుల జాతీయా కరణ, బంగ్లా శరణాగతుల పునరావాసం లాంటి నిర్ణయాలతో పాటు దేశంలో పంటల ఉత్పత్తిని పెంచడానికి హరిత విప్లవం, పేదరిక నిర్మూలనకై గరీబీ హటావో నినాదం, 20 సూత్రాల పథకము లాంటి ప్రజాకర్షక పథకాలు చేపట్టింది. ఆమె 1984-06-05 ఇందిరా గాంధీ సిక్కు పవిత్ర స్థలమైన అమృత్సర్‌లోని స్వర్ణ దేవాలయం పై ఆపరేషన్ బ్లూ స్టార్ దాడి చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే 1984-10-31 భారత ప్రధాన మంత్రి ఇందిరా గాంధీని ఆమె అంగరక్షకులు సత్వంత్ సింగ్, బితాంత్ సింగ్ లు న్యూ ఢిల్లీలోని ప్రధాని అధికార నివాసంలో కాల్చి హత్య చేశారు. 1984-11-03 ఇందిరా గాంధీ మృతదేహాన్ని దహనం చేశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

# అలనాటి మేటి కుస్తీ వీరుడు దారా సింగ్ - నవంబర్ 19...దారా సింగ్ జయంతి

కుస్తీ వీరుడు దారాసింగ్. దశాబ్దాల క్రితం బాగా పేరున్న వ్యక్తి. ఒకనాడు యువతరానికి రోల్ మోడల్. ఆ రోజుల్లో ప్రతి యువకుడు దారాసింగ్ లా కండలు కలిగి ఆకర్షణీయంగా ఉండాలని కోరుకునే వారు. దారా సింగ్ గా సుపరిచితులు అయిన దారా సింగ్ రణ్‌ధావా 1928 నవంబరు 19 - 2012 జూలై 12) ఒక భారతీయ ప్రొఫెషనల్ రెజ్లర్, నటుడు, రాజకీయవేత్త . ఆయన 1952 లో నటించడం ప్రారంభించాడు. రాజ్యసభకు నామినేట్ అయిన మొదటి క్రీడాకారుడు. హిందీ, పంజాబీ చిత్ర నిర్మాత, దర్శకుడు, రచయితగా పనిచేశాడు. ఆయన సినిమాలతో పాటు, టెలివిజన్‌లో కూడా నటించాడు. బజరంగ్బలి (1976) చిత్రంలోను, రామానంద్ సాగర్ నిర్మించిన రామాయణంలోనూ హనుమంతుడి పాత్రతో అతడు ప్రాచుర్యం పొందాడు. పంజాబ్ మజా ప్రాంతంలోని ధర్మూచక్ గ్రామంలో, రణ్‌ధావా జాట్ సిక్కు కుటుంబంలో 1928 నవంబరు 19 న దీదార్ సింగ్ రాంధవాగా జన్మించాడు. ఆ సమయంలో భారతదేశం బ్రిటిషు వలస పాలనలో ఉంది. ఆయన 1947 లో సింగపూర్ వచ్చాడు. అక్కడ డ్రమ్-తయారీ మిల్లులో పనిచేశాడు. గ్రేట్ వరల్డ్ స్టేడియంలో హర్నాం సింగ్ ఆధ్వర్యంలో తన కుస్తీ శిక్షణను ప్రారంభించాడు. ఆయన ఎత్తు 6 అడుగుల 2 అంగుళాలు ఉండేవాడు. బరువు 127 కిలోలు, ఛాతీ కొలత 53 అంగుళాలు. అతని శరీరాకృతి కారణంగా, అతను భారతీయ కుస్తీ శైలి అయిన పెహల్వానీని చేపట్టమని ప్రోత్సహించాడు. ప్రొఫెషనల్ రెజ్లింగ్‌కు మారిన తరువాత, అతను బిల్ వెర్నా, ఫిర్పో జిబిస్కో, జాన్ డా సిల్వా, రికిడాజాన్, డానీ లించ్, స్కీ హాయ్ లీ వంటి ప్రత్యర్థులతో ప్రపంచవ్యాప్తంగా పోటీ పడ్డాడు. అతడు కింగ్ కాంగ్ ను మట్టికరిపించిన వైనం ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. 1954 లో దారా, రుస్తాం-ఎ-హింద్ (ఛాంపియన్ ఆఫ్ ఇండియా) టోర్నమెంట్‌లో పాల్గొన్నాడు. అక్కడ టైగర్ జోగిందర్ సింగ్‌ను ఓడించి ఫైనల్‌ను గెలుచు కున్నాడు. మహారాజా హరి సింగ్ నుండి వెండి కప్పును అందు కున్నాడు. 1959 లో, కలకత్తాలో జార్జ్ గోర్డింకోను ఓడించి కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచు కున్నాడు. 1968 మే 29 న బొంబాయిలో, లౌ థేస్‌పై విజయంతో అతను ప్రపంచ ఛాంపియన్‌షిప్ సాధించాడు. ఆయన విరమణ ప్రకటించక ముందు చివరి టోర్నమెంట్ 1983 జూన్ లో ఢిల్లీలో జరిగింది. దారా సింగ్ తన గ్రామాన్ని సింగపూర్ కోసం 1948 లో విడిచిపెట్టాడు. ఆయన 1952 లో సంగ్దిల్‌తో కలిసి నటుడిగా తన వృత్తిని ప్రారంభించాడు. చాలా సంవత్సరాలు స్టంట్ ఫిల్మ్ యాక్టరుగా నటించాడు. బాబుభాయ్ మిస్త్రీ చిత్రం కింగ్



కాంగ్ (1962) లో తన మొదటి ప్రధాన పాత్రను పోషించాడు. 1963 నుండి దారా ప్రముఖ హీరోయిన్ ముంతాజ్ తో కలిసి 16 హిందీ చిత్రాలలో నటించాడు. ఈ జంట అత్యధిక పారితోషికం పొందిన బి-గ్రేడ్ నటులు అయ్యారు. సింగ్ ఒక్కో చిత్రానికి దాదాపు నాలుగు లక్షల రూపాయలు అందుకున్నాడు. అతను 1980 ల చివరలో టెలివిజన్‌లో నటించేందుకు వెళ్ళాడు. భారతీయ ఇతిహాసం రామాయణం టెలివిజన్ సీరియల్లో హనుమంతుడి పాత్రను పోషించాడు. వీర్ భీమ్ సేన్, రామాయణం వంటి అనేక చిత్రాలలో, ఇతర టెలివిజన్ సీరియల్స్ లో కూడా ఆయన నటించాడు. అతను అనేక సార్లు మహా భారతంలో భీమ పాత్ర పోషించాడు. బలరాముడు, శివుడి పాత్రలు కూడా ధరించాడు. సింగ్ 1998 జనవరిలో భారతీయ జనతా పార్టీలో చేరారు. రాజ్యసభకు నామినేట్ అయిన తొలి క్రీడాకారుడు దారా సింగ్. ఆయన 2003 - 2009 కాలంలో రాజ్యసభ సభ్యుడిగా పని చేసాడు. జాట్ మహాసభ అధ్యక్షుడిగా కూడా ఉన్నాడు. భారీ గుండెపోటుతో దారా సింగ్‌ను 2012 జూలై 7 న కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చేర్చారు. రెండు రోజుల తరువాత, రక్త ప్రవాహం లేకపోవడం వల్ల అతనికి మెదడు దెబ్బతిన్నట్లు నిర్ధారించారు. దారా 2012 జూలై 11 న ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యాడు. మరుసటి రోజే ముంబైలోని తన ఇంటిలో మరణించాడు. జుహు శ్మశానవాటికలో దహనం చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు

## సంపాదకీయం

# కాంగ్రెస్ వెరీ వీక్... కొత్త మిత్రులు వస్తారా ?

వైసీపీ కాంగ్రెస్ కి వ్యతిరేకంగా ఏర్పాటు అయిన పార్టీ. ఆ విషయాన్ని ఆ పార్టీ నేతలు ఎన్నో సార్లు చెప్పారు కూడా. లేటెస్ట్ గా చూస్తే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కూడా ఇండియా కూటమి అభ్యర్ధిని పక్కన పెట్టి ఎన్డీయే అభ్యర్ధికి వైసీపీ ఓటు చేసింది. ఇక జగన్ ని జైలు పాలు చేయించిందని కేసులు అక్రమంగా పెట్టిందని కాంగ్రెస్ మీద వైసీపీ అధినాయకత్వానికి కోపం ఉందని అంటారు. అది ఎప్పటికీ తీరని ఆరని కోపంగానే ఉంది అని అంటున్నారు.

**కాంగ్రెస్ ఏపీ ఫోకస్:** ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ మళ్ళీ కోలుకోవాలని, పునర్ వైభవం కలగాలని ఆ పార్టీ నేతలు గట్టిగా కోరుకుంటున్నారు. కాంగ్రెస్ వివిధ రాష్ట్రాలలో అధికారం కోల్పోవడానికి బలమైన నేతలు పార్టీని వీడడం కారణం అని అంటున్నారు. ముఖ్యంగా సౌత్ లో తీసుకుంటే పాతిక ఎంపీ సీట్లు ఉన్న ఏపీలో వైసీపీని జగన్ స్థాపించాక కాంగ్రెస్ కుదేల్ అయింది. తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలో ఉంది, తమిళనాడులో మిత్రుల పొత్తుతో కొనసాగుతోంది. కేరళలో తన కంటూ బలం ఉంది. కర్ణాటకలో అధికారంలో ఉంది. ఈ విధంగా చూస్తే సౌత్ లోనే కాంగ్రెస్ కి ఎక్కువ బలం ఉంది, ఆశలు ఉన్నాయి. అయినా సరిపడా ఎంపీ సీట్లు దక్కడం లేదు, దాంతో ఏపీ వైపు కాంగ్రెస్ పెద్దలు ఫోకస్ చేశారు అని అంటున్నారు.

**డీకే వ్యాఖ్యలకు అర్థం :** బీహార్ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘోర పరాజయం పాలు కాగానే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి ట్రబుల్ షూటర్ గా పేరు గడించిన డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. కాంగ్రెస్ మళ్ళీ పూర్వ వైభవం అందుకోవాలంటే బలమైన ప్రాంతీయ పార్టీలను కలుపుకుని పోవాలని ఆయన చెప్పడం విశేషం. మరి ఆయన ఏ ఉద్దేశ్యంతో చేశారు, ఎవరిని ఉద్దేశించి చేశారు అన్న దాని మీదనే ఇపుడు చర్చ సాగుతోంది. ఏపీలో వైసీపీ అధినేత జగన్ అయితే అక్కడ బలమైన విపక్షంగా ఉంటున్నారు. పైగా ఆయన బెంగళూరులోనే ఎక్కువగా ఉంటున్నారు. బహుశా ఆయనను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారా అన్నది కూడా చర్చగా ఉంది.

**సేఫ్ జోన్ గా :** ఇక జగన్ ఓటమి తరువాత ఎక్కువగా బెంగళూరులోనే గడుపుతున్నారు. ఆయన అది సేఫ్ జోన్ గా భావిస్తున్నారు. డీకే శివ కుమార్ కి వైఎస్ ఫ్యామిలీకి మొదటి నుంచి మంచి సంబంధాలు ఉన్నాయి. షర్మిల కాంగ్రెస్ లో చేరడానికి కారణం ఆయనే అని అంటారు. ఇపుడు ఏపీలో కాంగ్రెస్ పరిస్థితిలో మార్పు అయితే లేదు, అంతే కాదు ఆమె వల్ల వర్కౌట్ ఏదీ కాలేదు అని అంటున్నారు. దాంతో నేరుగా జగన్ తోనే పొత్తులకు కాంగ్రెస్ ని ఒప్పించే ప్రయత్నం డీకే చేస్తున్నారా అన్న చర్చకు తెర లేస్తోంది. తెలంగాణాలో కాంగ్రెస్ గెలుపునకు తగిన వ్యూహాలు అందించి అధికారంలోకి తేవడంలోనూ డీకే కీలక పాత్ర పోషించారు. అంతే కాదు సౌత్ ఇండియాలో కాంగ్రెస్ కి ఆయన ఒక కీలక నేతగా పెద్ద దిక్కుగా ఉంటున్నారు

**ఇద్దరూ ఎన్డీయేలోనే :** ఇక దేశంలో చూసుకుంటే ఎన్డీయే మిత్రులు బంధం మరింత గట్టిపడడం ఖాయమని తేలిపోతోంది 2029 నాటికి నితీష్ చంద్రబాబు ఇద్దరూ ఎన్డీయేలోనే ఉంటారు. ఈ ఇద్దరు నేతలను కలుపుకునే బీజేపీ ఎన్నికలకు వెళ్తుంది. దాంతో కాంగ్రెస్ కి ఇండియా కూటమి బలపడడానికి ఎన్డీయేతర పార్టీల అవసరం ఉంది. తమతో ఇప్పటిదాకా కలవని పార్టీలను చేర్చుకోవడం ద్వారా రానున్న కాలంలో అయినా ఎన్డీయేని ఢీ కొట్టే ప్రయత్నం అయితే కాంగ్రెస్ చేస్తుంది అని అంటున్నారు. అలా ఏపీ ఒడిశా తో పాటు వీలైన చోట్ల కాంగ్రెస్ కొత్త మిత్రుల కోసం అన్వేషించే పనిలో ఉంది అని అంటున్నారు. అందులో జగన్ ఉన్నారా లేరా అంటే రానున్న కాలమే జవాబు చెప్పాల్సి ఉంది.

# స్త్రీ, పురుషులు ఇద్దరూ సమాజంలో సమానులే - నవంబర్ 19...అంతర్జాతీయ పురుషుల దినోత్సవం




అంతర్జాతీయ పురుషుల దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబరు 19 న అంతర్జాతీయా స్థాయిలో జరుపబడే ఉత్సవం. ఇది ఐక్య రాజ్య సమితి ఆమోదంతో మొదటగా ట్రినిడాడ్ , టొబాగోలో 1999 లో మొదట ప్రారంభించబడి, 70కి పైగా దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపు కొంటు న్నాయి. 1960 ల నుండే రష్యాలో పురుషుల దినోత్సవ ప్రతిపాదన ఉంది. 60వ దశకం నుండి 90వ దశకం వరకూ అసమానత పై అనేక చర్చలు చోటు చేసుకున్నాయి. పాశ్చాత్య దేశాలలో పురుషులు, వారి హక్కులు, అవసరాలు, ఆరోగ్యం, సుఖ సంతోషాల గురించిన ఆలోచన తొంభయవ దశకంలోనే ప్రారంభమైనది. స్త్రీ ఆకాంక్షల ప్రకారం పురుషులు రెక్కలు ముక్కలు చేసు కొంటున్ననూ వారి కృషిని గుర్తించటానికి ఒక్క రోజు కూడా లేదు అని, అప్పటికే అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుప బడుతుండటం పితృ దినోత్సవం జరుపుబడు తున్ననూ, పురుషుల కంటూ ఒక దినోత్సవం లేకపోవటం, ఈ దినోత్సవ ఆలోచనకు దారి తీశాయి. 7 ఫిబ్రవరి 1992న ఇదే ఆలోచనను అమలులోకి తెచ్చారు. పురుషులే కాక స్త్రీలు సైతం ఒక చిన్న సమూహంగా ఏర్పడి మొట్ట మొదటి అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని జరిపారు. 1991-92 సమయంలో థామస్ అంతర్జాతీయ పురుషుల దినోత్సవం పై ఒక పుస్తకాన్ని కూడా రచించారు. 1994లో మాల్టాలో 7 ఫిబ్రవరిలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవం తొలిసారిగా నిర్వహించ బడింది. వైవాహిక జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటూన్న పురుషు లెవరూ విదేశాలకు వెళ్ళకుండా అక్కడి చట్టాలుండేవి. కోర్టులో కేసులు విచారణ దశలో ఉన్ననూ, భర్తను కారాగారంలోనే ఉంచేవారు. అతి సుదీర్ఘంగా ఈ దినోత్సవాన్ని జరుపుతూ వస్తోన్న దేశాలలో మాల్టానే మొదట నిలచింది. 2009 లో అక్కడి పురుషుల హక్కుల సంఘాలు మిగతా దేశాలోలాగానే 19 నవంబరుకు ఈ దినోత్సవాన్ని మార్చటానికి ఏకగ్రీవంగా అంగీకరించాయి. తర్వాత ట్రినిడాడ్ , టొబాగో, జమైకా, హంగేరి, కెనడా, ఇటలీ, క్యూబా,ఆస్ట్రేలియా, చైనా, హాంగ్‌కాంగ్, డెన్మార్క్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఫ్రాన్స్, పాకిస్తాన్, గ్రెనడా ఆంటిగ్వా , బార్బుడా, సెయింటి కిట్స్ , కివిస్ లలో మొదటి అంతర్జాతీయ పురుషుల దినోత్సవం జరుప బడింది. ప్రస్తుతం అధిక సంఖ్యాక దేశాలు పాటిస్తున్నాయి. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం చరిత్ర, ప్రత్యేకించి బాలురు/పురుషులు ఎదుర్కొనే సమస్యలను అధిగమిస్తూ, వారి అనుభవాలను పంచుకొంటూ, ప్రాముఖ్యతను వివరిస్తూ వస్తోన్నది. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం జరుపటం నేపథ్యంలో గల ప్రాథమిక లక్ష్యాలు..సంఘానికి, వర్గానికి, కుటుంబానికి, వైవాహిక వ్యవస్థకు, శిశు సంరక్షణకు , పర్యావరణకు పురుషులు ఒనగూర్చిన ప్రయోజ నాలను గుర్తించటం, పురుషుల సాంఘిక, భావోద్వేగ, శారీరక , ఆధ్యాత్మిక ఆరోగ్యంపై దృష్టి సారించటంబీ సాంఘిక సేవలలో, విలువలలో, అంచనాలలో , చట్టాలలో పురుషులు ఎదుర్కొం టూన్న వివక్షను చాటటం, స్త్రీ-పురుషుల మధ్యన సఖ్యత, సరైన సంబంధాలను నెలకొల్పటం లింగ సమానత్వాన్ని వ్యాపింప జేయటం, సంఘంలో పురుషులు/బాలురు ఎదుర్కొనే వివక్షను పురుష జాతికి...సంఘం పట్ల, కుటుంబం పట్ల, వివాహం పట్ల, శిశు సంరక్షణ పట్ల గల సత్సంకల్పము, ఆయా దిశలలో పురుష జాతి సల్పే కృషి, వీటి వలన పురుష జాతికి కలిగే సాధక బాధకాలను విశదీకరించే సందర్భమే అంతర్జాతీయ పురుషుల దినోత్సవము. స్థూలంగా ఈ దినోత్సవం యొక్క విశాల , అంతిమ ధ్యేయం ప్రాథమిక మానవీయ విలువలను పెంపొందించటం. నిరాధార వరకట్న వేధింపు, గృహ హింస వ్యాజ్యాలతో పురుషుల వ్యక్తిగత, వృత్తి సంబంధిత, వైవాహిక జీవితం చిన్నాభిన్న కావటంబీ ఏ నేరము చేయకనే పురుషులు, వారు తోబుట్టువులు, వృద్ధ తల్లిదండ్రులు జైలుపాలు కావటంబీ సంఘం, వ్యవస్థ, చట్టాలు, ప్రసార మాధ్యమాలు, స్త్రీ వాదులు, స్త్రీ వాద సంస్థలు, తల్లి, ఆడ పడుచు స్థానాలలో ఉన్న స్త్రీలను విస్మరించి కేవలం భార్య స్థానంలో ఉన్న స్త్రీలను మాత్రమే స్త్రీలుగా పరిగణించటంతో ఈ వైఖరిని ఖండిస్తూ, ఈ దృక్పథంలో మార్పును ఆశిస్తూ భారతీయ స్త్రీలు సైతం అంతర్జాతీయ పురుషుల దినోత్సవంలో పాలుపంచు కోవటం ప్రారంభించారు. చట్టపరమైన తీవ్రవాదాన్ని ఆపమని, అకారణంగా బనాయించబడే 498ఏ/గృహహింస వ్యాజ్యాలకు అడ్డుకట్ట వేయమని అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా 2007 లో కలకత్తా నగరంలో భారతీయ మహిళలు ప్లేకార్డులు ప్రదర్శిస్తూ కవాతును నిర్వ హించారు. అలాగే పురుష హక్కుల సంస్థ సేవ్ ఇండియన్ ఫ్యామిలీ అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని జరపటానికి పిలుపునిచ్చింది. పురుషులకు కూడా సంక్షేమ శాఖ నెలకొల్పాలన్నది సంస్థ ప్రధాన డిమాండు. భారత దేశంలో పన్ను కట్టేవారిలో 82% శాతం పురుషులేనని, కానీ గడచిన 60 సంవత్సరాలలో పురుషుల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా వెచ్చించ బడలేదని పేర్కొన్నారు. వివక్ష లేని గృహహింస చట్టాలు కావాలని, పురుషుల సమస్యలు పరిగణలోకి తీసుకోవాలని ఈ దినోత్సవాన్ని ఇతర పురుషుల హక్కుల సంస్థలు సమర్థించాయి. నిత్య జీవితంలో పురుషుడు ఎన్నో కష్టాలను పడుతుంటాడని అతనికి ఇది కేవలం ఒక చిన్ని కృతజ్ఞత తెలిపే సందర్భంగా సంఘాలు పేర్కొన్నాయి. తనకేం కావాలో, తనకు ఇష్టమైనదేదో, తన మనస్తత్వ మేమిటో తెలుసుకొనే లోపే పురుషుడు యాంత్రిక జీవితాన్ని అంది పుచ్చు కొంటాడని, పురుషుని త్యాగం అక్కడే మొదలవు తుందన్నాయి. స్త్రీ విమోచనకు కృషి చేసిన పురుషులను గుర్తు చేసుకొంటూ, వారు లేనిదే స్త్రీ జాతి ఈ రోజున ఇంత ముందుకు పోలేక పోయేదన్నాయి. పురుషులు కూడా మానవులేనని, ఒక స్త్రీకి ప్రేమాభి మానాలు ఎంత అవసరమో, పురుషుడికి కూడా అంతే అవసరం అని, సృష్టిలో స్త్రీ - పురుషులిరువురూ భాగస్థులేనని, పురుషులు గ్రహాంతర వాసుల నుండి రాలేదని అని వివరించాయి. ప్రస్తుత సాంఘిక దృక్పథంలో పురుషుడిని దురుసుగా ప్రవర్తించే ప్రతిబింబాలుగానే చూపటం జరుగుతోందని దీనిని మార్చ వలసిన అవసరం ఎంతైనా ఉన్నదని ఈ దినోత్సవాన్ని జరిపే వారి అభిప్రాయం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

# కనుమరుగు అవుతున్న కట్టడాలు...తెరమరుగు అవుతున్న చారిత్రక నిర్మాణాలు...


## రక్షణపై శ్రద్ధ లేని ప్రభుత్వాలు - నవంబర్ 19...ప్రపంచ సాంస్కృతిక వారసత్వ దినం.

ప్రపంచ సాంస్కృతిక వారసత్వ దినోత్సవం ప్రతి ఏట నవంబర్ 19న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. వారసత్వ పరిరక్షణ అంశాల ఆధారంగా 1984, జనవరి 27న నాటి భారతదేశ ప్రధాని ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చైర్మన్‌గా భారత జాతీయ సంస్కృతి వారసత్వ సంస్థ (ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ -ఇంటాక్) అనే సంస్థ ఏర్పాటు చేయబడింది. దీనికి తోడుగా, భారతదేశ వారసత్వ సంపద విలువ, వాటి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిపించేందుకు 'భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ', 'రాష్ట్ర పురావస్తు శాఖ'లకు బాధ్యతలు అప్పగించ బడ్డాయి. అవి భక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి. వి. కృష్ణ శాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్షరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరి వ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహవంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకుల లో అక్కడక్కడ నిక్షిప్తమైయున్న చరిత్ర కొంతవరకు వెలుగులోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్టమొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూలపురుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. శ్రీముఖుని కి చెందిన నాణాలను, ధర్మపురి వాస్తవ్యుడైన చారిత్రక పరిశోధకుడు కీర్తిశేషులు సంగనభట్ల నరహరిశర్మ కనుగొన్నాక, శాతవాహన వంశానికి మూల పురుషుడు అనదగిన శ్రీముఖుడు, కోటిలింగాల రాజధానిగా చేసుకొని పరిపాలించాడని రుజువైనాక, చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. క్రీస్తుపూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్ర రాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెనవేసుకున్న చరిత్ర పలుకుతుంది. శాతవాహన చక్రవర్తుల చత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్థూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్టలేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీభూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజాప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజకవర్గంలోని పాషా యిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాతవాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపాన్ని కి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం నాగ సింపీ యకాయ, జమజోరాగ బ్రహ్మ లేఖలు, స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం - కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్నపూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్టమౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించబడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్ధికి చెందిన హుస్సే నియా వాగు - చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచిలింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను



కలిగి ఉంది. "కాలచక్ర నిర్మాణం"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరిరక్షించేందుకు నాటి ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యథార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... మరోవైపు ప్రాచీనత్వానికి ఆనవాళ్లు అయిన, అపురూప చారిత్రక సాక్ష్యాలను కనుమరుగు చేస్తుంటే, వారి ఆత్మ ఘోష వినిపిస్తుంటే, భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తలదించుకోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్ప తనం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

# పారిశుద్ధ్యంపై అవగాహన అనివార్యం - నవంబర్ 19...ప్రపంచ టాయిలెట్ దినోత్సవం




ప్రతి సంవత్సరం నవంబర్ 19న జరుపుకునే ప్రపంచ టాయిలెట్ దినోత్సవం, మానవ జీవితంలో పారిశుద్ధ్యం, ఆరోగ్యం, సురక్షితమైన మరుగుదొడ్ల ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ప్రజలలో శుభ్రమైన పరిసరాల ప్రాముఖ్యతను జాగృతం చేయడం, ప్రపంచ వ్యాప్తంగా అన్ని వర్గాల వారికి టాయిలెట్ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రోత్సహించడం. 2001లో, సింగపూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త విరాధాన్ బెంకటేశన్ వరల్డ్ టాయిలెట్ ఆర్గనైజేషన్ను స్థాపించారు. టాయిలెట్ సమస్యలు సమాజంలో ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లుగా గుర్తించి, ఈ అంశంపై గ్లోబల్ అవగాహన పెంచే దిశగా కృషి ప్రారంభించారు. 2013లో, ఐక్యరాజ్య సమితి ఈ ప్రయత్నాన్ని గుర్తించి, ప్రపంచ టాయిలెట్ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించింది. మురికి నీరు, శుభ్రత లేమి కారణంగా డయేరియా, మలేరియా వంటి అనేక అంటువ్యాధులు ప్రబలుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రతి సంవత్సరం లక్షలాది మంది చిన్న పిల్లలు మరుగుదొడ్ల అసౌకర్యం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. సురక్షిత మరుగుదొడ్ల ఏర్పాటు, పరిశుభ్రత అనుసరణతో అనేక వ్యాధుల నుండి మనల్ని మనం రక్షించుకోవచ్చు. ముఖ్యంగా మహిళలు, బాలికలు మరుగుదొడ్ల కొరత కారణంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా పాఠశాలలలో మరుగుదొడ్లు లేకపోవడం వల్ల వారు చదువు మధ్యలోనే మానేస్తున్నారు. సురక్షిత మరుగుదొడ్లు సమాజంలో మహిళల ఆత్మ గౌరవాన్ని పెంపొందించడమే కాక, సమాన అవకాశాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సరైన మురుగు నీటి నిర్వహణ లేకపోవడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. భూమి మరియు నీటి కాలుష్యానికి ఇది ప్రధాన కారణం. సురక్షిత మరుగుదొడ్లతో కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా 3.6 బిలియన్ మంది సరైన పారిశుద్ధ్య సదుపాయాలు లేకుండా జీవిస్తున్నారు. గ్రామీణ మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో శుభ్రమైన మరుగుదొడ్ల కొరత అత్యంత తీవ్రమైన స్థాయిలో ఉంది. పిల్లల మానసిక ఆరోగ్యం, మహిళల భద్రత మీద కూడా టాయిలెట్ సౌకర్యాల లేమి ప్రతికూల ప్రభావం చూపుతోంది. ప్రపంచ వ్యాప్తంగా టాయిలెట్ అవసరాలపై ప్రజలలో అవగాహన కల్పించడానికి పలు ప్రచార కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రకారం, 2030 నాటికి ప్రపంచం లోని ప్రతి ఒక్కరికి శుభ్రమైన మరియు సురక్షితమైన మరుగుదొడ్లు అందించాలన్నది లక్ష్యం. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మరుగుదొడ్ల నిర్మాణంలో ముందుండి భాగస్వాములు కావాలి. ప్రతి ఒక్కరూ ఈ సమస్యపై చైతన్యవంతులై కృషి చేయవచ్చు. టాయిలెట్ ప్రాముఖ్యతను కుటుంబ సభ్యులు, స్నేహితులతో చర్చించాలి. పాఠశాలలు, గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి సహాయ పడాలి. పారిశుద్ధ్యానికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

చురకలు



# నోట్లో పొక్కులు.. జ్వరం

కరీంనగర్ : కరీంనగర్‌లోని ఓ కాలనీకి చెందిన మూడేళ్ల బాలుడి నోట్లో చిన్న బుడగల్లాంటి పొక్కులు ఉండటం గమనించి ఆసుపత్రికి వెళ్లి పిల్లల వైద్యుడికి చూపించారు. ఇది చికెన్ పాక్స్ కాదని, కాక్సాకి వైరస్‌తో ఇలా అవుతుందని భయపడాల్సిన అవసరం లేదని, మందులు రాసి పంపించారు. ఇంటికి తీసుకెళ్లి విశ్రాంతి తీసుకోమని సూచించారు. కరీంనగర్‌లోని ఒక పిల్లల ఆసుపత్రికి రోజు 50 మంది వస్తే.. అందులో అయిదారుగురు ఈ సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు వివరించారు.

**చిన్న పిల్లలపై 'కాక్సాకి వైరస్' ప్రభావం**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాక్సాకి అనే వైరస్ కారణంగా చిన్న పిల్లల్లో చేతులు, కాళ్లు, నోరు భాగంలో బొబ్బల్లా ఏర్పడి జ్వరంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. నీ వాతావరణంలో మార్పులతోపాటు చలికాలంలో వైరసుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పిల్లలు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ఇతరులకు వ్యాధి సోకే అవకాశముంది. నీ నోట్లో చిన్న, చిన్న బొబ్బల్లాగా ఏర్పడి సాధారణ జ్వరం వస్తోంది.నీ నోటి ద్వారా ఏమి తినలేకపోతారు. లక్షణాలు కనిపించగానే వైద్యుడిని సంప్రదించాలి.

**వ్యాధి బారిన పడితే..**

యాంటీబయోటిక్స్ ఉండవు. లక్షణాల ఆధారంగా పరీక్షించి



అవసరమైన లోషన్ ఇస్తారు.

పిల్లలు ఆహారం తీసుకోవడానికి ఇబ్బంది పడితే చల్లటి ద్రవ పదార్థాలు పట్టించాలి. పిల్లలకు ఉతికిన దుస్తులు వేసి, పరిశుభ్ర ప్రదేశంలో విశ్రాంతి తీసుకునేలా చూడాలి. చేతులు ఎప్పటికప్పుడు హ్యాండ్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలి. తగిన స్థాయిలో ద్రవ పదార్థాలు ఇస్తూ పర్యవేక్షణ చేయాలి. అయిదు నుంచి వారం రోజులకు పైగా విశ్రాంతి ఇవ్వాలి. మిగతా పిల్లలతో దూరంగా ఉంచాలి.

జ్వరంగా ఉంటే పారాసిటమాల్ వాడవచ్చు. బి కాంప్లెక్స్ సిరప్ వంటివి తాగించవచ్చు.

**నిర్లక్ష్యం చేయొద్దు**నోట్లో, కాలు, చేతులపై వచ్చే బొబ్బలు లాంటివి కాక్సాకి వైరస్‌తో వస్తున్నాయి. లక్షణాలు కనిపించిన వారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. చికెన్ పాక్స్ అనేది వ్యారి సెల్లా అనే వైరస్‌తో వస్తుంది. చికెన్ పాక్స్ వచ్చిన వారికి బొబ్బలు మొత్తం శరీరంపై వస్తాయి. రెండు వ్యాధి లక్షణాలు కొద్దిగా వేరుగా ఉంటాయి.

– డాక్టర్ పి.రాజేందర్, సీనియర్ పిల్లల వైద్య నిపుణులు

# సర్కారు ఇసుక.. భారంగా ధర

జగిత్యాల: నిర్మాణరంగ అవసరాలు తీరేలా తక్కువ ధరకు ఇసుక అందించేందుకు గత నెలలో జగిత్యాలలో ఇసుక బజార్‌ను ప్రారంభించారు. ఉద్దేశం మంచిదే అయినా బయటి కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తుండటంతో వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. మరోవైపు ఇసుకబజార్ ధరలు చూసి వ్యాపారులు సైతం అధికంగా వసూలు చేస్తుండటం ఇందిరమ్మ లబ్ధిదారులకు భారంగా మారింది.

**1,387 టన్నులే విక్రయం**

జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న ఇసుక బజార్‌లో టన్నుకు రూ.1400 చొప్పున తీసుకుంటున్నారు. అదనంగా 5 శాతంతో కలిపి రూ.1470 కు చేరుతోంది. ట్రాక్టరుకు అద్దె కూడా వినియోగదారుడే చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక ఇంటికి చేరడానికి దాదాపు రూ.7 వేల వరకు అవుతుంది. అదే బయటి వ్యాపారులు రూ.4 వేలకే ఇంటి వద్ద పోసి వెళ్తున్నారు. అధిక ధరతో ఇసుక బజార్‌కు వినియోగదారులు రావడం లేదు. నెల దాటినా కేవలం 1,387 టన్నులు మాత్రమే విక్రయించారు. ఇందిరమ్మ ఇళ్ల అవసరాలకు టన్నుకు రూ.1200 చొప్పున తీసుకుంటున్నారు. అంటే ఇతరుల కంటే కేవలం రూ.200 మాత్రమే తక్కువ కావడం, బయట ఇంతకంటే తక్కువే ఉండటంతో ఇసుక బజార్ నిరుపయోగంగా మారింది.

**వ్యాపారులు పెంచినా వెయ్యి తక్కువే**

గతంలో ప్రభుత్వ ఇసుక రీచ్‌లలో 4.6 టన్నులకు రూ.3830 చొప్పున తీసుకొనేవారు. అప్పట్లో బయట ధర రూ.5 వేలకు పైగా ఉండేది. ఇటీవల భూగర్భ జల వనరుల శాఖ ఇసుక ధరలు పెంచడంతో ఇసుకబజార్ వైపు ఎవరూ రావడం లేదు. ఇటీవలి కాలం వరకు ట్రాక్టరుకు రూ.4 వేలు వసూలు చేసిన ప్రైవేటు వ్యాపారులు ఇసుక బజార్ ధరలు చూసి రూ.4500 నుంచి రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. బయట ధరలు పెరిగినా ప్రభుత్వ ధర కంటే రూ.వెయ్యి వరకు తక్కువకు లభిస్తుండటంతో నిర్మాణదారులు ఇసుకబజార్‌కు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి ధర తగ్గిస్తేనే లక్ష్యం నెరవేరనుంది.

నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

జిల్లాలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేవు. గతంలో ఉన్నా ఇప్పుడు వినియోగంచడం లేదు. స్థానికంగా ఇసుక అందుబాటులో లేకపోవటంతో అధిక ధరలు చెల్లించలేక చాలా గ్రామాల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. వాస్తవానికి ఇందిరమ్మ ఇళ్లకు స్థానిక వాగుల నుంచి ఉచితంగా తీసుకునేలా అనుమతినివ్వాలి. అయితే ఇది ఎక్కడా అమలు కావడం లేదు. మరోవైపు ఇటీవల కంకర ధరలు సైతం పెరిగిపోయాయి. గతంలో రూ.3200 చొప్పున ఉండగా ప్రస్తుతం రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు. కంకర, ఇసుక అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఇందిరమ్మ లబ్ధిదారులు కోరుతున్నారు.

5 శాతం జీఎస్టీ.. అద్దె అదనం

టన్నుకు రూ.1400, 5 శాతం జీఎస్టీతో కలిపి మొత్తం రూ.1,470.

ఇందిరమ్మ ఇళ్లకు టన్నుకు రూ.1200, 5 శాతం జీఎస్టీతో రూ.1,260.

బయటి వ్యాపారుల ధర టన్నుకు రూ.1000. ట్రాక్టరుకు రూ.4 వేల నుంచి రూ.4,500.

ఇసుకబజార్‌లో వినియోగదారుడు ట్రాక్టరు కిరాయి అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

# కార్పొరేట్‌కు దీటుగా.. వసతుల్లో మేటిగా..!



ఖమ్మం : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో సకల వసతులు కల్పించి ఆదర్శ(మోడల్) పాఠశాలలుగా తీర్చిదిద్దాలని సర్కారు భావిస్తోంది. నిధుల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా విడతల వారీగా జిల్లాలోని 15 బడులను ఎంపిక చేసి సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మెరుగుపరచనుంది. మొదటి విడతలో మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు, చింతకాని మండలం నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మధిర మండలం మహదేవపురం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో బడికి ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్డీఎఫ్) నుంచి రూ.2కోట్లు కేటాయించగా.. ఆయా విద్యాలయాల్లో సమకూర్చాల్సిన వసతులపై అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

సమీక్షించి.. ఆదేశాలిచ్చి..ముదిగొండ మండలం గంధసిరిలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ శ్రీజ, డీఈఓ చైతన్య జైనీ, ఎంఈఓతో కలిసి విద్యాశాఖ ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గురువారం సమీక్షించారు. ఆదర్శ పాఠశాలల ఎంపికపై చర్చించిన సందర్భంలో బనిగండ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను నమూనా స్కూల్‌గా మార్చాలని అధికారులు ప్రతిపాదించారు. మూడు పాఠశాలలనూ ఎంపిక చేసి ప్రతిపాదనలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మూడు చొప్పున 15 పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. నిధుల కొరత దృష్ట్యా తొలుత మూడు పాఠశాలలపై దృష్టిసారించనున్నారు. తరువాత విడతల వారీగా ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు, జమలాపురం, మధిర మండలంలోని సిరిపురంతో పాటు మరో తొమ్మిది సర్కారు బడులను ఎంపిక చేయనున్నట్లు తెలిసింది.

**కల్పించే సౌకర్యాలు**

ఎంపికైన ప్రతి స్కూల్‌లో 800 మంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పిస్తారు. అధునాతన తరగతి గదులు, ప్రయోగశాల, డిజిటల్ తరగతి గది, డైనింగ్ హాల్, ప్రతి బ్లాక్‌కు ప్రత్యేక మలమూత్రశాలలు, చుట్టూ ప్రహరీ నిర్మించాలి. కాపలాదారును తప్పనిసరిగా నియమించాలి. విద్యార్థులు బడికి వెళ్లి రావటానికి బస్సు సౌకర్యం కల్పించి.. నిర్వహణ బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించే అవకాశం ఉంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించి సెమీ రెసిడెన్షియల్ స్కూల్‌గా తీర్చిదిద్దనున్నారు.

**కన్సల్టెన్సీ సంస్థతో సర్వే**

ఎంపికైన మూడు పాఠశాలల్లో సమకూర్చాల్సిన వసతులపై ఓ కన్సల్టెన్సీ సంస్థ సర్వే చేస్తున్నట్లు తెలిసింది. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంత, బడి విస్తీర్ణం, క్రీడాప్రాంగణం ఉందా, లేనిపక్షంలో అందుబాటులోని స్థలాలు, తరగతి గదులను పరిశీలిస్తున్నారు. ఒక్కో బడిలో 800 మంది విద్యార్థులు ఉండాలి. సర్కారు బడిని ఆదర్శంగా తీర్చిదిద్ది బస్సు సౌకర్యం కల్పిస్తే.. 'ప్రైవేటు'కు వెళ్లేవారూ మోడల్ స్కూల్‌కు వస్తారని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

# బిరబిరా 'దారి'కొస్తోంది!



కరీంనగర్ : కరీంనగర్ : జాతీయ రహదారి విస్తరణ పనుల్లో వేగం పెరుగుతోంది. వరంగల్ నుంచి కరీంనగర్ వరకు 68 కి.మీ పొడవునా నిర్మించే ఈ మార్గం పనులు మరో నాలుగు నెలల వ్యవధిలో పూర్తి కానున్నాయి. గత ఆరు నెలలుగా రోడ్డు నిర్మాణంలో శరవేగం కనిపిస్తోంది. విస్తరణ ప్రక్రియ కొన్నిచోట్ల కొలిక్కి వచ్చింది. రూ.1647 కోట్ల వ్యయంతో ఈ మార్గంపై సాంకేతిక సౌకర్యాలు, ఇతర వసతుల రూపంలో సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మొదలు కరీంనగర్ వరకు కొత్త రూపుతో సిద్ధమవుతోంది.

**78 శాతం పురోగతి..**

ఎప్పటికప్పుడు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ఇక్కడి పురోగతిని పరిశీలిస్తోంది. ఇప్పటి వరకు 78 శాతం పనులు పూర్తయినట్లు సంబంధిత శాఖ అధికారులు ఇటీవల కలెక్టరుకు ఇచ్చిన నివేదికలో తెలిపారు. 2026 మార్చి 31 నాటికల్లా పూర్తి చేయనున్నారు. 2023 జులై 16న ఈ మార్గానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయి కదలిక వచ్చింది. అంతకుముందు ఏడాదిపాటు రెవెన్యూ అధికారులు భూమి సేకరించారు. ఇప్పటికీ అక్కడక్కడ నిర్వాసితుల సమస్యలు కొలిక్కిరావాల్సి ఉంది.

**కొత్త ప్రతిపాదనలు..**

ఒక వైపు నిర్మాణమవుతుండగా, మరో వైపు ప్రజల నుంచి వినతులు అందుతున్నాయి. ఇటీవల ఈదులగట్టెపల్లి వద్ద రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని గ్రామస్థులంతా కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడారు. మరో వైపు కొత్తగట్టు వద్ద యూ టర్న్ లేక చాలా దూరం వెళ్లాల్సి వస్తోందనే అక్కడి ప్రజలు తెలిపారు.

నిర్మాణ స్వరూపం..

కరీంనగర్ జిల్లాలో 46 కి.మీ రోడ్డులో 35 కి.మీ పూర్తయింది.

హనుమకొండ జిల్లాలో 22 కి.మీ దారికి 18 కి.మీ వేశారు.

9 పెద్ద వంతెనల్లో 6 కొత్తవి వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి.

చిన్నవంతెనలు 20కి అయిదారు మాత్రం చివరి దశలో ఉన్నాయి.

112 బాక్స్ కల్వర్టులు, 77 కూడళ్ల వారధుల్లో కొన్ని ఏర్పాటవ్వాలి.

ఒక ఆర్వోబీ.. ఇంకో చోట ఆర్‌యూబీ పనులు జరుగుతున్నాయి.

ఇరువైపులా 12 చోట్ల బస్‌షెల్టర్లు నిర్మించాలి.

# ఉపాధి కరవై వలసెళ్తున్నారు!

మంథని : స్థానికంగా ఉపాధి లేకపోవడంతో గ్రామానికి చెందిన యువత ముంబాయి, దుబాయి ప్రాంతాలకు వలస వెళుతున్నారు. రెండేళ్లుగా పార్వతీ బ్యారేజ్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదలడంతో మత్స్యకార్మికులకు ఉపాధి దొరకడం లేదు. మంథని మండలం బెస్తపల్లి గ్రామంలో 1083 జనాభా ఉండగా 139 గృహాలు, 300 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో ఒకే సామాజిక వర్గానికి(గంగపుత్రులు) చెందిన వారు ఉన్నారు. వీరంతా చేపలు పడుతూ ఉపాధి పొందుతుంటారు.

గ్రామంలో భూలక్ష్మిగుట్టచెరువు, పంతులుకుంట చెరువు, నలకుంట చెరువులున్నాయి. వీటిలో నీరు లేకపోవడంతో 50 ఏళ్లుగా ముంబాయి, దుబాయికి ఉపాధి కోసం వలస వెళ్లేవారు. 2020లో పార్వతీ బ్యారేజీ నిర్మాణంతో మత్స్యకారులకు ఉపాధి లభించింది. స్థానికంగా ఉపాధి దొరకడంతో వలసవెళ్లిన వారంతా స్వగ్రామానికి తిరిగొచ్చారు. రెండేళ్లుగా బ్యారేజీలో నీరు నిల్వ చేయకపోవడంతో మత్స్యకారులకు ఉపాధి కరవై మళ్లీ వలస వెళ్తున్నారు.

**గజ ఈతగాళ్లకు ప్రసిద్ధి**

బెస్తపల్లి గ్రామంలో సుమారు 40 మంది గజ ఈతగాళ్లు ఉన్నారు. పుష్కరాల సమయంలో మంథని, కాళేశ్వరం, కోటి లింగాలు, గోదావరి ఖని వంతెన వద్ద వీరు సేవలందిస్తారు. వినాయక నిమజ్జనాలకు వీరి సేవలకు వినియోగిస్తారు.

**చెరువులున్నా నీరు లేదు**

రెండేళ్లుగా బ్యారేజీలో నీరు లేకపోవడంతో ఉపాధి కరవైంది. బ్యారేజీ



నిర్మాణం చేపట్టడంతో అయిదేళ్ల కిందట గ్రామానికి వచ్చాను. చేపలు పడుతూ రోజుకు రూ.1500 వరకు సంపాదించేవాడిని. గ్రామంలో మూడు చెరువులున్నా నీరు లేకపోవడంతో ఉపాధి లేకుండా పోయింది. ప్రస్తుతం నేను వలసవెళ్లలేక ఇంటివద్దే ఉంటున్నాను. – మెడి శంకరయ్య

**బ్యారేజీ గేట్లు ఎత్తొద్దు**

గ్రామ సమీపంలో ఉన్న పార్వతీ బ్యారేజీలో నీరు నిల్వ చేయాలి. గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో చేపలు లభించక ఉపాధి దొరకడం లేదు. మాకు వ్యవసాయ భూములు లేవు చేపలు వృత్తే ఆధారం. యువత ఇతర గ్రామాలకు భవన నిర్మాణ పనులకు వెళ్తున్నారు. – మెడి సాయికుమార్

# ఇల్లు పీకి.. పందిరేసుకుని..!

బోనకల్లు : రెండు పడక గదుల ఇళ్లు మంజూరయ్యాయని ఉన్న ఇల్లు పీకేసి కొత్త ఇంటికి పునాదులు తీశారు. పునాదులు పూర్తయితే మొదటి బిల్లు వస్తుందని ఆశించారు. బిల్లు వచ్చే సమయానికి రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది. బిల్లులు ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన రెండు పడక గదుల ఇళ్ల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో ఉన్న ఇల్లు కోల్పోయి.. నూతన ఇల్లు సమకూరక రెండేళ్లుగా ఎండలకు ఎండుతూ.. వానలకు తడుస్తూ లబ్ధిదారులు తాత్కాలిక గుడిసెల్లో, పందిర్ల కింద నివాసం ఉండాల్సిన దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిన లబ్ధిదారులను ప్రస్తుత ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

జిల్లాలో 850 మంది రెండు పడకగదుల ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి ఇదే విధంగా ఉంది. రెండు పడక గదుల ఇళ్ల డిజైన్, ఇందిరమ్మ ఇళ్ల డిజైన్ వేరువేరుగా ఉండటంతో వారికి కొత్తగా ఇళ్లు మంజూరు చేయడానికి సాంకేతికంగా సాధ్యపడటంలేదు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారు ప్లాట్ చదును చేసి ప్రభుత్వం ఇచ్చిన డిజైన్ ప్రకారం పునాదులు తీయాలి. రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులు



ఇప్పటికే పునాదులు పూర్తిచేసి ప్లింత్ బీములు పోసి పది అడుగుల పిల్లర్లు పోయడంతో వాటిని అధికారులు అంగీకరించడం లేదు. ఇల్లు కావాలంటే వాటిని తీసి కొత్త డిజైన్‌లో పునాదులు వేయాలంటున్నారు. ఇప్పటికే లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. కొందరు స్లాబ్ లెవల్ వరకు కట్టుకున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ పరిస్థితి గమనించి పాత విధానంలో రూ.మూడు లక్షల బిల్లు అయినా ఇప్పించాలని, లేదంటే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వివరాలు ప్రభుత్వానికి పంపాం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, నిర్మాణాల పరిస్థితిపై పూర్తి నివేదికను ఇప్పటికే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపాము. ప్రభుత్వం నుంచి త్వరలో ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది. రాగానే తగు చర్యలు చేపడతాం. రమాదేవి, ఎంపీడీఓ

**ఎండల్లో ఎండుతూ.. వానలకు తడుస్తూ జీవిస్తున్నాం**

ఇల్లు మంజూరైందని ఉన్న ఇల్లు పీకేసుకున్నాం. పునాదులు తీసి పిల్లర్లు పోసుకున్నాం. పిల్లర్లు పోయగానే బిల్లు ఇస్తామన్నారు. అంతలోనే కొత్త ప్రభుత్వం వచ్చిందని ఆపేశారు. రెండేళ్లు అయినా ఒక్క రూపాయి రాలేదు. మా ఇల్లు పునాదుల్లోనే ఉంది. చిన్న గుడిసెలో కాలం వెళ్లదీస్తున్నాం. ఇప్పటికైనా బిల్లు ఇప్పించి ఇల్లు పూర్తి చేయించాలి. ముంగి రాంబాయి, చిరునోముల

**పాములు, విష పురుగులు వస్తున్నాయి..** ఉన్న ఇల్లు పీకేసి చిన్న గుడిసె వేసుకొని ఉంటున్నాం. దానిలోకి పాములు, విష పురుగులు వస్తున్నాయి. రెండేళ్లు అయినా బిల్లు ఇవ్వడం లేదు. ఎవరి దగ్గరకు వెళ్లి అడిగినా పట్టించుకోవడం లేదు. మా పరిస్థితి గమనించి బిల్లు ఇవ్వాలి. కొత్త ఇల్లయినా మంజూరు చేయాలి.ముంగి రాణి

# రద్దయినా.. డబ్బు రాదేం..!

కోదాడ: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటాం. రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఆన్‌లైన్ విధానంలో ప్రభుత్వానికి ముందస్తుగా డబ్బులు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆ తర్వాత కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. డబ్బులు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత వివిధ కారణాల వల్ల రిజిస్ట్రేషన్ ఆగిపోతే నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుంచి డబ్బులు తిరిగిరావాలి. కానీ ఆ డబ్బు కొన్నేళ్లుగా రాక రిజిస్ట్రేషన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని బాధితులు వాపోతున్నారు. వీరిలో రూ.50 వేల నుంచి రూ.5 లక్షలకు పైగా స్లాట్ కోసం డబ్బులు చెల్లించిన వారూ ఉన్నారు.

కోదాడకు చెందిన ఉదయ్ సాయి గతేడాది మార్చి 3న కోదాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంటి రిజిస్ట్రేషన్ కోసం రూ.90 వేలు వెచ్చించి స్లాట్ బుక్ చేసుకున్నాడు. కొన్ని సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయాడు. స్లాట్ బుక్ కోసం చెల్లించిన డబ్బులు తిరిగి పొందేందుకు కొన్ని నెలలుగా నల్గొండ, కోదాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. ట్రెజరీలో పెండింగ్ ఉందని అధికారులు చెబుతున్నట్లు బాధితుడు వాపోయాడు.

సూర్యాపేట జిల్లాకు చెందిన మరో వ్యక్తి తన ఖాళీ స్థలం విక్రయించేందుకు స్లాట్ బుక్ చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల సలహా మేరకు స్లాట్‌ను రద్దు చేసుకున్నాడు. స్లాట్ రద్దయినా డబ్బు తిరిగి రాకపోవడంతో ఎక్కడకు వెళ్లాలో తెలియక సతమతమవుతున్నట్లు



బాధితుడు తెలిపాడు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

స్లాట్ బుక్ చేసుకొని రద్దయిన వారి డబ్బులు తిరిగి రావాల్సి ఉంది. పెండింగ్‌లో ఉన్న డబ్బులు వచ్చేలా చర్యలు చేపడతాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ డబ్బులు వారి అకౌంట్లో జమ చేస్తాం.

రవీందర్, ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్, నల్గొండ

ఉమ్మడి జిల్లా వివరాలు ఇలా..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు: 15

బాధితుల సంఖ్య: 50

స్లాట్ రద్దుతో రావాల్సిన డబ్బు: రూ.1.62 కోట్లు

# చెవిలో హెడ్‌సెట్.. చూపేమో రీల్స్ వైపు





హైదరాబాద్: స్టీరింగ్‌పై సెల్‌ఫోన్ పెట్టుకుని అందులో రీల్స్ చూస్తూ నిర్ల క్ష్యంగా డ్రైవింగ్ చేయడంతోగోల్కొండ ఠాణా పరిధిలో ఇటీవల ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ట్రాలీ వాహనాన్ని గమనించకుండా ఆటో డ్రైవర్ ఢీకొట్టడంతో ఆటో పూర్తిగా దెబ్బతింది. డ్రైవర్‌తో పాటు నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. నిర్లక్ష్యపూరిత డ్రైవింగే కారణమని క్షతగాత్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఒకప్పుడు ఒక చోట నుంచి మరోచోటకు వెళ్లడానికి రోడ్డుపై నిలబడితే ఆటోలు వచ్చి ప్యాసింజర్లను గమ్యస్థానాలకు చేర్చేవి. ఇప్పుడు అన్ని కార్యకలాపాలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఆటో, బైక్, ట్యాక్సీలను బుక్ చేసుకోవడం నుంచి గమ్యస్థానం వెళ్లేవరకు సెల్‌ఫోన్ తప్పనిసరి అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులను పికప్ చేసుకోవడం నుంచి డ్రాప్ చేసేవరకు గమ్యస్థానం కోసం మ్యాప్స్ చూస్తూ వెళ్లాల్సి ఉ ంటుంది. ఈ క్రమంలో చోదకులు చెవిలో హెడ్‌సెట్ పెట్టుకుని సెల్‌ఫోన్‌లో రీల్స్, యూట్యూబ్ వీడియోలు, క్రికెట్ మ్యాచ్‌లను వీక్షిస్తూ డ్రైవింగ్ చేస్తున్నారు. దీంతో బయటి ప్రపంచాన్నే మరచిపోతున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ట్యాక్సీ అగ్రిగేటర్ల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే చోదకుల్లో ఎక్కువ శాతం ఇలా నిర్లక్ష్యంగానే డ్రైవింగ్ చేస్తూ ప్రయాణికుల జీవితాలతో 'సెల్'గాటం ఆడుతున్నారు. సెల్‌ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు.

**అన్నింటి కంటే ప్రాణం ముఖ్యం**

'డ్రైవింగ్ చేస్తూ రీల్స్ చూడవద్దు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. మీ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఇతరుల ప్రాణాలు తీయొద్దు. కుటుంబాలను రోడ్డున పడేయవద్దు. రీల్స్ చూస్తూ వాహనం నడిపితే చర్యలు తప్పవు' అని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

**బాధ్యత ఉండక్కర్లేదా?**

లొకేషన్ సులభంగా కనిపించడం కోసం ఆటో, బైక్ స్టీరింగ్‌పై సెల్‌ఫోన్‌ని ఉంచుతున్నారు. చూడటానికి అనువుగా ఉండటంతో సెల్‌ఫోన్‌లో వీడియోలు పెట్టుకుని చూస్తున్నారు. అంతటితో ఆగకుండా బ్లూటూత్ హెడ్‌సెట్‌లను చెవికి తగిలించుకుంటున్నారు. ఊపున్న డీజే పాటలు వింటూ ప్రయాణం సాగిస్తున్నారు. దీంతో ముందు వెళ్తున్న వాహనాల కదలికపై దృష్టి పెట్టడం లేదు. ఇరువైపులా, వెనక వచ్చే వాహనాల హారన్ శబ్దాలు వినపడటం లేదు. అకస్మాత్తుగా స్పీడ్‌బ్రేకర్లు వస్తే.. నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయవద్దని ప్రయాణికులు వారిస్తున్నా వినిపించుకోవడం లేదు.

# 'పొగ ముంచు'తోంది..!

హైదరాబాద్: నగరంతో పాటు శివారు ప్రాంతాలను పొగమంచు కమ్మేస్తోంది. తెల్లవారుజామున దట్టంగా కమ్ముకుని రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. పొగ మంచు తీవ్రతను అంచనా వేసుకోకుండా దూసుకెళ్తున్న వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారినపడుతున్నారు.

**ఇదీ పరిస్థితి..** 2023తో పోలిస్తే.. 2024లో నగరంలో రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య సగటున 10 శాతం తగ్గింది. మొత్తంగా తగ్గినా.. అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో పెరిగాయి. 2023లో ఈ మూడు నెలల్లో 72 మంది మరణిస్తే.. 2024లో ఆ సంఖ్య 86.

**ఇవీ కారణాలు**

పొగమంచుతో ఎదురుగా వచ్చే, ముందున్న వాహనాలు కనిపించక ఢీకొట్టడం ప్రమాదాలకు కారణమని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. విహారయాత్రలు, ఆలయాలకు వెళ్తుంటారు. ఎక్కువ మందికి చలికాలంలో డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడం, వాతావరణంలో వచ్చే మార్పులకు తగినట్లుగా వ్యవహరించకపోవడంతో ప్రమాదాల బారినపడుతున్నారు.

**జర జాగ్రత్త**

అర్ధరాత్రి తర్వాత నుంచి ఉదయం 8 గంటల వరకు ప్రయాణాలు



వాయిదా వేసుకోవాలి.

అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే వాహన వేగం 50 కిలోమీటర్లు దాటకూడదు. కనీసం 100 మీటర్ల దూరంలో ఉండే వాహనాలు కనిపించాలి.వాహనం నడిపేటప్పుడు ఇతరులకు స్పష్టంగా కనిపించేలా వాహనం లైట్లను ఆన్ చేసి ఉంచాలి.

హైవేలు, శివారు రహదారులపై వాహనాల మధ్య కచ్చితమైన దూరం పాటించాలి. విండ్ స్క్రీన్, సైడ్ మిర్రర్లపై ఎప్పటికప్పుడు మంచును శుభ్రం చేయాలి.

కారు, ఇతర పెద్ద వాహనాల్లో అద్దంపై మంచు పొర కమ్ముకోకుండా డీఫ్రాస్టర్ వినియోగించాలి.

ఆగిన వాహనాలతో.. నగర శివార్లు, ఔటరు రింగురోడ్డుపై సాయంత్రం వాహనాల రద్దీ పెరుగుతుంది. ఏపీ నుంచి మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాలకు ఔటర్ మీదుగా వెళ్లాల్సిందే. కొందరు విశ్రాంతి కోసం ఔటర్ పక్కన ఆపేస్తుంటారు. ఇవే కొంపముంచుతున్నాయి.

## గనుల శాఖకు ఘన ఆదాయం

తాండూరు: జిల్లాలో భారీ వర్షాలు కురిసినా గనుల శాఖకు ఆదాయం మాత్రం తగ్గలేదు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నవంబరు 11వ తేదీ వరకు రూ.64 కోట్లు సమాకూరింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఈనెల 11 వరకు రూ.10 కోట్లు అదనంగా అంటే రూ.74 కోట్లు వచ్చింది. ఈసారి వర్షాలు ఎక్కువగా ఉంటాయన్న వాతావరణశాఖ నిపుణుల సూచనలతో నాపరాయి, సుద్ద, లేటరైట్ ఖనిజాలను వెలికి తీసే వ్యాపారులు అప్రమత్తమయ్యారు. ఆ మేరకు వేసవిలోనే ఖనిజాలను ఎక్కువగా వెలికి తీసి విక్రయించారు. అక్టోబరులో అడపాదడపా వర్షాలు కురిసినప్పుడు మినహా మిగిలిన రోజుల్లో ఖనిజాలు వెలికి తీశారు. ఈనెల గనుల్లో కార్యకలాపాలు యథావిధిగా



కొనాసాగుతున్నాయి. విక్రయాలూ అదే స్థాయిలో ఉండడంతో రాయల్టీ రూపంలో గనుల శాఖకు ఆదాయం సమకూరుతోంది.

**చిన్నతరహా నుంచే ఎక్కువ..**

నాపరాయి, లేటరైట్, స్టోన్ మెటల్, సుద్ద, ఫైర్‌క్లే, క్వార్ట్జ్, పెల్స్‌పార్ వంటి 236 లీజులున్న గనుల నుంచి చిన్నతరహా ఖనిజాలను ఎక్కువగా తవ్వి విక్రయించారు. వీటి ద్వారానే గనుల శాఖకు ఆదాయం ఎక్కువ సమకూరింది. వేల ఎకరాల్లో 4 లీజులున్న పెద్దతరహా ఖనిజమైన సున్నపు రాయిని సీసీఐ, పెన్నా, ఇండియా సిమెంట్ యాజమాన్యాలు తవ్వి సిమెంటు ఉత్పత్తిలో వినియోగించాయని తాండూరు గనుల శాఖ సహాయ సంచాలకుడు సత్యనారాయణ తెలిపారు.

## బృహత్తర కార్యం.. యథాతథ దర్శనం!

భద్రాచలం : యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి పనుల కోసం బాలాలయం ఏర్పాటుచేశారు. ఇప్పుడు వేములవాడ కోవెల విస్తరణకు ప్రధాన ఆలయాన్ని మూసి దర్శనాలకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఇంకొద్ది రోజుల్లో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాభివృద్ధికి పూనుకోనున్నారు. పనులు జరిగే తరుణంలోనూ ప్రధానాలయ దర్శనం యథాతథంగా ఉంటుందని ఆలయ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానాలయం వద్దనున్న పురాతన కట్టడాల జోలికి వెళ్లరు. తూర్పు, పడమర మెట్ల గుండా దర్శన భాగ్యం కల్పిస్తారని సమాచారం. అయితే ఇది పూర్తిస్థాయిలో సాధ్యమవుతుందా లేదా అని అధికారులు ఆరా తీస్తున్నారు. రోజుకు ఐదారు వేల మంది భక్తులు వస్తుంటారు. సెలవులు, పండుగల రోజుల్లో రద్దీ అధికంగా ఉంటుంది. అలాంటప్పుడూ నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సమాలోచనలు సాగిస్తున్నారు.

అప్పట్లో తూర్పు మెట్ల గుండా..

ఎనిమిదేళ్ల క్రితం రాజగోపురం సమీపంలో ద్వజస్తంభం ఎదుట ప్రాకారం పైభాగం నుంచి ఒక శిల జారి కిందపడింది. నిపుణులు పరిశీలించాక మరమ్మతులు చేశారు. ఆ సమయంలో కొద్దిరోజులు ప్రధాన రాజగోపురం గుండా ప్రవేశాలను నిలిపేశారు. వెనుక వైపున తూర్పు మెట్ల నుంచి దర్శన భాగ్యం కల్పించారు. అప్పట్లో చిన్నపాటి పనికే దర్శనాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది. రూ.350 కోట్లతో పనులుభద్రాచలం రామాలయ బృహత్ ప్రణాళిక అమలుకు రూ.350 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదించారు. ఈఓ దామోదర్‌రావు ఇక్కడి పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు పాలకులకు వివరిస్తున్నారు. నిధులు మంజూరైతే ప్రాకారాలు నిర్మించేందుకు చిత్రకూట మండపాన్ని తొలగించాలి. ఇక్కడే ఆలయ కార్యాలయంతో పాటు ప్రసాదాల కౌంటర్లు, క్యూలైన్లు, మండపాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రాకపోకలకు సరిపడా రహదారులు నిర్మిస్తారు.

# ఇందిరమ్మకు లక్ష్మీకటాక్షం



బొంరాస్‌పేట: పేదలకు సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు పరుస్తోంది. గూడులేని నిరుపేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. నిర్మాణ సామగ్రి, కూలీ ధరలు బాగా పెరగడంతో ప్రభుత్వం ఇస్తున్న మొత్తంలో ఇల్లు కట్టుకోవడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో నిరుపేద మహిళలకు బ్యాంకు ద్వారా మరో రూ.లక్ష వడ్డీలేని రుణం అందిస్తున్నారు. తీసుకున్న అప్పును వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

బొంరాస్‌పేట మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన వెంకటమ్మకు సొంతిల్లు లేదు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. నిర్మాణం ప్రారంభించారు. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం సరిపోయేలా లేదు. బయటి నుంచి అప్పు తెస్తే వడ్డీల భారం అధికమవుతోందని భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పొదుపు సంఘం ద్వారా బ్యాంకులు రూ.లక్ష రుణం ఇవ్వడం మంచి పరిణామం.

**జిల్లాలో 1,138 మందికి మంజూరు..**

జిల్లాలో 12,853 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వారిలో 6,698 మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఇప్పటి వరకు 1138 మంది మహిళలకు రూ.లక్ష చొప్పున బ్యాంకు రుణం అందించారు. ఇల్లు మంజూరైనా ఆర్థిక స్తోమత లేక, ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోవని ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు చాలామంది ఉన్నారు. ఇలాంటి వారికి బ్యాంకు రుణం ఎంతో ఉపయోగపడుతోంది.

**ఇవీ నిబంధనలు..**

ఇందిరమ్మ ఇల్లు మంజూరైన మహిళ పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉండాలి.

రుణం కావాలని మహిళా సంఘానికి దరఖాస్తు చేసుకుంటే సభ్యులంతా చర్చించి తీర్మానం చేస్తారు.

సూక్ష్మరుణ ప్రణాళిక(ఎంసీపీ) తయారు చేసి దాని ప్రతిని సంఘం తీర్మానానికి జతపర్చి బ్యాంకులో సమర్పించాలి.

బ్యాంకు అధికారులు పరిశీలించి సంబంధిత మహిళకు రుణం మంజూరు చేస్తారు.

బ్యాంకు రుణం ఉపయోగపడింది..: కొత్తకుర్వ లక్ష్మి, చౌదర్‌పల్లి

ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా రూ.5 లక్షలు సరిపోయేలా లేవు. అప్పు చేస్తే వడ్డీ భారమవుతుంది. సంఘంలో సభ్యులైన వారికి రుణం ఇస్తున్నారని తెలిసి రూ.లక్ష తీసుకున్నా. చెత్తు వరకు నిర్మించుకున్నాం. ప్రభుత్వ సాయానికితోడు రుణం ఉపయోగపడింది.

# ఛార్జింగ్ పెట్టేటప్పుడు జాగ్రత్త బ్రో



హైదరాబాద్ : ఎటువంటి ఫోన్ కొన్నా ఎక్కువ మంది పరిశీలించేది బ్యాటరీ.. ఎందుకంటే ఫోన్ ఎక్కువ సేపు పనిచేసేందుకు బ్యాటరీ సామర్థ్యం ముఖ్యం. మరి అంత ముఖ్యమైన బ్యాటరీని ఛార్జ్ చేసేప్పుడు ఎన్నో రకాల సందేహాలు.. దానికితోడు అప్పుడప్పుడు ఛార్జింగ్ చేస్తుంటే బ్యాటరీ పేలిపోయిందనే వార్తలు వింటున్నారు. ఛార్జింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తే బ్యాటరీకి ఎటువంటి ఇబ్బందులు రావంటున్నారు.. టెక్ నిపుణులు.

హైదరాబాద్‌కు చెందిన కిరణ్ తన ఆఫీసు పనుల హడావుడిలో పడి ఛార్జర్‌ను ఇంటి వద్దే మరచిపోయారు. ఆఫీసుకు వెళ్లాక స్నేహితుడి వద్ద ఉన్న ఛార్జర్‌తో కొంత సేపు ఛార్జింగ్ పెట్టుకున్నాడు. రెండు, మూడు సార్లు అలా జరగడంతో చరవాణికి ఉన్న ఛార్జింగ్ పోర్టు పాడైపోయింది. రిపేర్ కోసం షాపు వద్దకు వెళ్లగానే రూ.5వేల వరకు ఖర్చు అవుతుందన్నారు.

ఓ మహిళ తన వద్ద ఉన్న ఒరిజినల్ ఛార్జర్ పాడైపోవడంతో వేరే సాధారణ ఛార్జర్‌ను వాడడం ప్రారంభించింది. కొన్ని రోజులు గడిచాక బ్యాటరీ ఉబ్బి ఫోన్ పేలిపోయేంత ప్రమాదం ఏర్పడింది. మరమ్మతులకు రూ.2–6 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు.

ఫోన్ రాత్రంతా ఛార్జింగ్ పెట్టినా ప్రమాదం ఉండదు. ఎందుకంటే బ్యాటరీ వంద శాతం ఛార్జ్ అయిన తర్వాత ఛార్జింగ్ దానంతట అదే ఆగిపోతుంది. ప్రస్తుతం తయారవుతున్న ఫోన్లలో బ్యాటరీలు సామర్థ్యానికి మించి ఛార్జ్ కాకుండా ప్రత్యేక టెక్నాలజీ ఉపయోగిస్తున్నారు.

ఒకవేళ రాత్రి ఫోన్ ఛార్జింగ్ పెట్టి అలాగే వదిలేయాలనుకుంటే.. చరవాణిని కవర్(పౌచ్)లో నుంచి బయటికి తీసి ఛార్జింగ్ పెట్టడం మంచిది.

**కంపెనీ ఛార్జర్ ఉత్తమం..**

ఫోన్ ఛార్జ్ చేసేందుకు ఉపయోగించేది కంపెనీ ఛార్జర్ అయితే చాలా మంచిది. నాసిరకం ఛార్జర్ ఉపయోగిస్తే ఫోన్ లేదా ఛార్జర్ కాలిపోయే ప్రమాదం ఉంది. కంపెనీ ఇచ్చే ఛార్జర్లను అనేక రకాలుగా పరీక్షించి ఆమోదముద్ర వేస్తుంది. వాటితో ప్రమాదం ఉండదు.

**లిథియం బ్యాటరీ అయితే..:** ఫోన్లో లిథియం–అయాన్ బ్యాటరీ ఉంటే ..తక్కువ సమయం ఎక్కువసార్లు ఛార్జ్ చేసుకున్నా సరిపోతుంది. ఉదా: 5–10 శాతం వరకు ఛార్జ్ చేసి.. కొంతసేపు వాడుకుని 10–30 శాతం వరకు అలా..అవసరాన్ని బట్టి ఛార్జ్ చెయ్యొచ్చు.

తప్పని పరిస్థితుల్లో..

తప్పని పరిస్థితుల్లో సాధారణ ఛార్జర్లు ఉపయోగించాల్సి వస్తే.. వాటితో వంద శాతం ఛార్జ్ చేయకపోవడం మంచిది. బ్యాటరీ చివరి 20శాతం ఛార్జ్ అయ్యేప్పుడు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఆ సమయంలోపేలిపోయే ప్రమాదం ఉంది.

## వృద్ధాప్యంలో రైతులకు భరోసా

చేవెళ్ల: చిన్న, సన్నకారు రైతులకు వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'కిసాన్ మాన్ ధన్ యోజన' పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందిస్తుండగా.. ఇప్పుడు కేంద్రం ప్రత్యేకంగా రైతుల కోసం పింఛను పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఐదెకరాల్లోపు కర్షకులే అర్హులు: 18 నుంచి 40 ఏళ్ల వయసు, 5 ఎకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులే అర్హులు. భూ రికార్డుల్లో పేరుండాలి. రైతు నిర్ణీత ప్రీమియం చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే నేషనల్ పెన్షన్ స్కీమ్, ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లో చేరిన వారు ఈ పథకానికి అనర్హులు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు, ఆర్థికంగా ఉన్నవారు, ఇతర సామాజిక భద్రత పథకాలను పొందుతున్న వారికి ఈ పథకం వర్తించదు.నామమాత్రపు ప్రీమియం: రైతులు వయసు ఆధారంగా ప్రతినెల రూ.55 నుంచి రూ.200 వరకు ప్రీమియం చెల్లించాలి. దీనికి సమానంగా కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుంది. 60 ఏళ్ల వరకు ప్రీమియం చెల్లిస్తే, తర్వాత ప్రతి నెలా రూ.3 వేల పింఛను అందుతుంది. రైతు మరణించిన పక్షంలో భార్య లేదా నామినీకి నెలకు రూ.1,500 సాయం అందుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు: అర్హులైన రైతులు సమీపంలోని సీఎస్‌సీ కేంద్రాల ద్వారా కానీ, పీఎం కిసాన్ పోర్టల్‌లో కానీ దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్ నంబరు, నామినీ, రైతు బ్యాంకుఖాతా వివరాలుఅప్‌లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక పింఛను కార్డు జారీ అవుతుంది. ప్రతినెలా ప్రీమియం రైతు బ్యాంకు ఖాతా నుంచి నేరుగా డెబిట్ అవుతుంది.

# సార్లకివ్వాలి.. సర్దుకోలేరా!

సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఏ చిన్న అవకాశం వచ్చినా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇందుకు పదో తరగతి పరీక్ష రుసుంను పోషకుల నుంచి అందినంత దండుకుంటున్న తీరే నిదర్శనం. ఇదేంటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే.. ఇంటర్నల్ మార్కులు, ఇతరత్రాలకు 'సార్ల'కు ఎంతోకొంత ఇవ్వాల్సి ఉంటుంది.. ఆ మాత్రం సర్దుకోలేరా.. అంటూ యాజమాన్యాలు సమాధానమివ్వడం గమనార్హం.

వికారాబాద్ జిల్లాలో ప్రైవేటు బడులు: 91

పదో తరగతి విద్యార్థులు: 2648

అధికారుల పేరు చెప్పి..

సంగారెడ్డి జిల్లాలోని ప్రముఖ ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష రుసుం పేరిట రూ.900 తీసుకుంటున్నారు. ఎందుకు ఇంత మొత్తం వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే.. 'అందరినీ చూసుకోవాల్సి ఉంటుంది' అంటూ బదులిస్తున్నారు.

మెదక్ జిల్లాలో ఓ ప్రైవేటు పాఠశాల పదో తరగతి పరీక్ష ఫీజు కింద రూ.1200 వసూలు చేస్తోంది. పదో తరగతి ఇంటర్నల్ మార్కుల సమయంలో తనిఖీలకు వచ్చే బృందాలతో పాటు విద్యాశాఖ అదికారులకు ఎంతో కొంత ఇస్తేనే మార్కులు వేస్తుంటారని యాజమాన్యం ప్రతినిధి పేర్కొంటున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాల్లోని పలు ప్రైవేటు పాఠశాలల్లో రూ.800 నుంచి రూ.1400




వరకు వసూలు చేస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రూ.కోటికి పైగా ఆర్జన**

పదో తరగతి పరీక్ష రుసుంను అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 చెల్లించాలి. ఈ నెల 20వ తేదీ వరకు గడువుంది.

ఇప్పటికే ట్యూషన్, కంప్యూటర్.. వంటి అనేక పేర్లతో ఇష్టారీతిన ఫీజులు తీసుకుంటున్న యాజమాన్యాలు.. పదో తరగతి పరీక్ష రుసుంను 5–10 రెట్లు ఎక్కువ చేసి వసూలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా, వికారాబాద్ వ్యాప్తంగా 18,666 మంది పదో తరగతి విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.500 అదనంగా వసూలు చేసినా.. రూ.93 లక్షలవుతుంది. రూ.800 చేస్తే రూ.1.49 కోట్లు వెనుకేసుకోనున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా విద్యాశాఖ

పదో తరగతి పరీక్ష రుసుంను అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 మాత్రమే వసూలు చేయాలి. అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలుంటాయి. నిబంధనలు పాటించని పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయవచ్చు.

## 2 శాఖలు.. 418 కిలోమీటర్లు

మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలం ఏఎస్ఆర్ తండా శివారులోని లోలెవల్ కల్వర్టు ఇది. ఏటా వర్షాకాలంలో దీనిపై నుంచి వరద పారుతుండటంతో రాకపోకలు నిలిచిపోయి తండావాసులు ఇబ్బంది లు పడుతున్నారు. వంతెన నిర్మాణానికి 2022లో రూ.81 లక్షలు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి ఏఎస్ఆర్ తండా వరకు నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇందులో భాగంగా వంతెన నిర్మించనుండటంతో ఇబ్బందులు తొలగనున్నాయి.

**హ్యామ్ విధానంలో రహదారుల నిర్మాణం**

జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో ఎంపిక చేసిన రోడ్లను హ్యామ్ విధానంలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండు శాఖల పరిధిలోని సుమారు 418 కిలోమీటర్ల రహదారులను ఈ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో 21 రహదారులను 227.99 కిలోమీటర్ల దూరం అభివృద్ధి చేయడానికి రూ.307.05 కోట్లతో ప్రతిపాదించి ప్రభుత్వానికి నివేదించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 89 పనులను 190.3 కిలోమీటర్ల దూరం నిర్మించడానికి త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది.

**నిర్వహణ బాధ్యత 15 ఏళ్లకు పెంపు**

హ్యామ్ విధానంలో రహదారులను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. నిర్మాణ వ్యయంలో 60 శాతం నిధులను గుత్తేదారు సంస్థకు ప్రభుత్వం బ్యాంకు రుణాన్ని ఇప్పిస్తుంది. ఆ సొమ్మును 15 సంవత్సరాల్లో వాయిదాల పద్ధతిలో ప్రభుత్వమే చెల్లిస్తుంది.

మిగతా 40 శాతం నిధులను దశలవారీగా ప్రభుత్వం విడుదల చేస్తుంది. గతంలో రహదారుల నిర్వహణ బాధ్యత కేవలం ఐదేళ్ల వరకు మాత్రమే గుత్తేదారులకు ఉండేది. దీంతో పనులు ఇష్టానుసా రంగా జరిగేవన్న అభిప్రాయముంది. హ్యామ్ విధానంలో 15 సంవత్సరాల పాటు గుత్తేదారు సంస్థ రహదారులను నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో నిర్మాణంలో నాణ్యత



మెరుగుపడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**నియోజకవర్గాల వారీగా ఇలా..**

హ్యామ్ విధానంలో ప్రతి నియోజకవర్గం నుంచి పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రహదారులను ఎంపిక చేశారు. జగిత్యాలలో బీర్పూర్ మండలంలో 7, జగిత్యాల రూరల్ 9, జగిత్యాల అర్బన్ 2, రాయికల్ 7, సారంగాపూర్ 6, ధర్మపురి నియోజకవర్గంలో ధర్మపురి 7, వెల్గటూర్ 8, గొల్లపల్లి 4, పెగడపల్లి 5, వేములవాడ నియోజకవర్గంలో కథలాపూర్ 3, మేడిపల్లి 2, కోరుట్ల నియోజకవర్గంలో కోరుట్ల 4, మెట్‌పల్లి 8, మల్లాపూర్ 11, ఇబ్రహీంపట్నం 2, చొప్పదండి నియోజకవర్గంలో కొడిమ్యాల 2, మల్యాల 2 రహదారులను ఎంపిక చేశారు. మెట్‌పల్లి మండలంలో రేగుంట–గోధూర్, ఆత్మకూర్–పాటిమీదితండా, ఆత్మనగర్–అందుబొందుల తండా, జగ్గాసాగర్ మూలమలుపు–బండలింగాపూర్, జాతీయ రహదారి–కొండ్రికర్ల, జాతీయరహదారి–రాజేశ్వర్‌రావుపేట, ఆర్‌అండ్‌బీ రోడ్డు–ఏఎస్ఆర్ తండా, రేగుంట–అమ్మక్కపేట రహదారులను అభివృద్ధి చేయనున్నారు.

చురకలు



# శాఖల్లో 'లీకు వీరులు'!

కరీంనగర్ : గత నెల 16న కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని టాస్క్‌ఫోర్స్ బృందంలో పని చేస్తున్న 12 మంది పోలీసు సిబ్బందిని కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ సీపీ కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలు, ఇతరత్రా పర్యవేక్షణ చేపట్టాల్సిన కీలక విభాగంలోని సిబ్బంది తనిఖీలకు వెళ్తున్న సమాచారం అక్రమార్కులకు ముందుగానే ఇస్తున్నారనే అనుమానంతో ఈ చర్య తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో కీలకమైన పోలీస్, విజిలెన్స్, ఎక్సైజ్, అనిశా, మైనింగ్, ఆర్టీఏ ఉన్నతాధికారుల అత్యవసర సోదాలు, తనిఖీల సమయంలో ముందుగానే సంబంధిత వ్యక్తులు సర్దుకుంటున్నారు. ఆ విభాగంలో పని చేసే కొందరు కింది స్థాయి సిబ్బంది వ్యాపారులకు, అక్రమార్కులకు సమాచారం చేరవేస్తుండటంతో అక్రమాలపై పక్కా సమాచారంతో వెళ్లిన అధికారులు అక్కడ పరిస్థితి వేరేగా ఉండటం చూసి విస్తుపోతున్నారు. నెలవారీగా అమ్యామ్యాలకు అలవాటు పడిన కొంతమంది ఉద్యోగులు ఇలా సమాచారం చేరవేస్తున్నారని అధికారులు భావిస్తున్నారు. ఇసుక, మట్టి రవాణా ఎక్కువగా నడిచే మండలాల్లో



ఈ తరహా వ్యవహారం ఎక్కువగా ఉంటోంది.

పెద్దపల్లి జిల్లాలోని రైస్ మిల్లుల్లో రాష్ట్రస్థాయి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు తనిఖీలు చేపట్టేందుకు వచ్చిన సమయంలోనూ ఇలాంటి చేదు అనుభవమే వారికి ఎదురైంది. పక్కా సమాచారంతో వెళ్లి పరిశీలించగా అదనంగా ఉన్న బియ్యమంతా మాయమయ్యాయి. దీంతో తామొస్తున్నామనే సమాచారం జిల్లాకు చెందిన ఎవరో అందించి ఉంటారనే కోణంలో శాఖాపరమైన విచారణ చేపట్టారు.

**సహకరిస్తున్నారిలా..!**

గ్రానైట్ క్వారీల తనిఖీల సమయంలో నిర్వాహకులకు ముందస్తుగా సమాచారం వెళ్తోంది. గంజాయి, గుట్కా విక్రేతలు నెలవారీ మామూళ్లతో తనిఖీల గురించి ముందే తెలుసుకుంటున్నారు.

గొలుసు దుకాణాల తనిఖీలకు గ్రామాలకు వెళ్లే సరికి దుకాణాల్లో మద్యం మాయమవుతోంది. ఇసుక, మట్టి వ్యాపారులు ఠాణాల్లోని కొందరిని తమకు సమాచారమిచ్చే వేగులుగా మార్చుకున్నారు.

# తటాకాలూ గుటకాయ స్వాహా!

కరీంనగర్ : కోరుట్ల తాళ్ల చెరువు భూమిలో నుంచి దర్జాగా రోడ్డు వేశారు. అయిదెకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన తటాకం క్రమేణా కుంటలా మారిపోయింది. నలు వైపులా ఆక్రమణదారులు ఇష్టానుసారంగా మట్టి పోస్తూ కబ్జా చేస్తున్నారు. మద్దుల చెరువు, కుమ్మరికుంట, లస్మగౌడ్‌కుంట, బొల్లికుంట, తిమ్మాయిపల్లె, అయిలాపూర్ గొలుసుకట్టు చెరువుల్లోకి వరద వచ్చే కాలువలు ఆక్రమణ చెరల్లోనే ఉన్నాయి.

జగిత్యాల జిల్లావ్యాప్తంగా 1,226 చెరువుల్లో దాదాపు 60 శాతం కబ్జాకు గురయ్యాయి. ఆరేళ్ల కిందట నీటి నిల్వ సామర్థ్యాన్ని(ఎఫ్‌టీఎల్) గణించే క్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు వీటిని గుర్తించారు. హద్దులు ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేసి రాతి కడీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నిధులు కేటాయించకపోవడంతో ప్రక్రియ ముందుకుసాగలేదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో రెండు దశాబ్దాల కిందటి చెరువుల వాస్తవ స్థితికి, ప్రస్తుత పరిస్థితికి చాలా వ్యత్యాసముందని సంబంధిత అధికారులే చెబుతున్నారు. మిషన్ కాకతీయ కింద జిల్లాలో నాలుగు దశల్లో రూ.204.90 కోట్లతో 720 చెరువుల్లో పనులు చేపట్టారు. అప్పుడే కంచెల ఏర్పాటుకు కొన్ని నిధులు వెచ్చిస్తే ఆక్రమణకు గురి కాకుండా ఉండేది.

**వ్యర్థాలు పోసి కబ్జా**

50 అడుగుల వరకుండాల్సిన చెరువు కట్టల వెడల్పు చాలా చోట్ల 20–30 అడుగులకు కుచించుకుపోయాయి.

కొన్ని పట్టణాల్లో చెరువు కట్టలు కబ్జాలతో పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయాయి. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ స్థలాల్లో ముందుగా వ్యర్థాలను పోస్తూ తరువాత మెల్లిగా ఆక్రమించేస్తున్నారు.

నీటిపారుదల, మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపంతో హద్దులు నిర్ణయించడం లేదు.

నాలాలకు ఆనుకొని ఉన్న భూముల యజమానులు కొంచెం కొంచెం తమ పరిధిలో కలుపుకొని అనుభవిస్తున్నారు. జగిత్యాల పట్టణానికి ఆనుకొని ఉన్న పలు చెరువులపై కబ్జాదారుల కన్ను పడింది. కొద్ది



నెలల కిందట లింగం చెరువు నుంచి చింతకుంట చెరువుకు వచ్చే కాలువ ఆక్రమణపై మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా మోతె చెరువు, కండ్లపల్లి చెరువు, ముప్పాల చెరువు, చింతకుంట చెరువుల కబ్జాతో రూపు కోల్పోతున్నాయి. కొందరు స్థిరాస్తి వ్యాపారులు, సమీపంలో పొలాల యజమానులు దర్జాగా కబ్జా చేస్తున్నారు.

**స్వాధీనం చేసుకునేందుకు చర్యలు**

ఆక్రమిత చెరువు స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో పెట్టిన హద్దులను తొలగిస్తున్నారు. జియో మ్యాపింగ్ ఆధారంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను గుర్తిస్తూ రక్షణ చర్యలు చేపడుతున్నాం. ఎ.హెచ్.ఖాన్, నీటిపారుదల శాఖ ఈఈ, జగిత్యాల

# చెల్లింపులకు ఇక చిక్కులుండవ్..



బషీరాబాద్: మండలాలు: 20
మండల సమాఖ్యలు: 19
గ్రామ సమాఖ్యలు: 657
మహిళా సంఘాలు: 15,697
నమోదైన సభ్యులు: 1.63 లక్షలు

స్త్రీనిధి రుణాల వాయిదాలను ఇకపై తపాలాశాఖలో చెల్లించుకునే అవకాశం కల్పించారు. బ్యాంకుల్లో రద్దీ ఎక్కువగా ఉండడం.. దూరం వెళ్లి చెల్లించే సమస్యలను అధిగమించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామాల్లో బీపీఎంల వద్ద రుణ వాయిదాలు కట్టి రశీదులు పొందాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేశారు. అక్కడ మంచి ఫలితాలు రావడంతో అన్ని ప్రాంతాల్లోనూ అమలు పర్చనున్నారు.

**రూ.22 కోట్ల రుణాలు..**

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి రుణాలు రూ.22 కోట్లు ఇచ్చారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు రూ.50వేల నుంచి రూ.10 లక్షల వరకు తక్కువ వడ్డీకి పొందుతున్నారు. ఏటా జిల్లావ్యాప్తంగా మహిళలు రూ.100 కోట్లకుపైగా వివిధ రకాల రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదుగుతున్నారు. చిరు వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు, గ్రామస్థాయిలో పిండి గిర్నీలు, అల్పాహార కేంద్రాలు, వస్త్ర దుకాణాలు, కుట్టు మిషన్లు వంటి వాటి కొనుగోలుకు స్త్రీనిధి రుణాలను వాడుకొంటున్నారు.

**తపాలాశాఖ ద్వారా ఇలా..**

జిల్లాలో 594 గ్రామ పంచాయతీలున్నాయి. తాండూరు డివిజన్ పరిధిలో 90, వికారాబాద్‌లో 91, కొడంగల్ ప్రాంతంలో సుమారు 40.. మొత్తంగా 221 బ్రాంచి పోస్టు మాస్టర్ కార్యాలయాలున్నాయి. ఉమ్మడి పంచాయతీల్లో ఒకటి చొప్పున ఉన్నాయి. సమీప గ్రామాల వారు బ్రాంచ్ పోస్టు మాస్టర్ కార్యాలయానికి వచ్చి స్త్రీనిధి రుణాల వాయిదాలు చెల్లించుకోవచ్చు. తీసుకున్న రుణం వివరాలు, తీర్మానపత్రం సమర్పిస్తే బీపీఎం రుణ వాయిదాను స్వీకరించి రశీదు ఇవ్వనున్నారు. ఇప్పటికే తపాలా, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ సిబ్బందికి చెల్లింపులపై అవగాహన కల్పించారు.

**రవాణా భారం తీరుతుంది..– లక్ష్మీనారాయణ, స్త్రీనిధి, మేనేజర్**

తీసుకున్న రుణం వాయిదా చెల్లించేందుకు పట్టణంలో ఉన్న బ్యాంకులకు వెళ్లాల్సి వస్తోంది. రవాణా ఇబ్బందులు, సమయం వృథా అవుతాయి. ఇక నుంచి గ్రామాల్లోనే ఉన్న తపాలాశాఖ బ్రాంచ్ పోస్టు మాస్టర్ కార్యాలయంలో స్త్రీనిధి రుణ వాయిదాలు చెల్లించొచ్చు. సంఘాల వివరాలను ఎప్పటికప్పుడు తపాలాశాఖ పోర్టర్‌లో నిక్షిప్తం చేస్తున్నాం.

# నిధులు లేక.. పనులు సాగక



హుజూరాబాద్: హుజూరాబాద్, జమ్మికుంట పురపాలికల్లో నిధుల లేమితో పలు అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. సమీకృత మార్కెట్లు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులతోపాటు పట్టణ ప్రగతి పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గతంలో పట్టణ ప్రగతి పేరిట వచ్చే ప్రత్యేక నిధులు రెండేళ్లుగా నిలిచిపోయాయి.

**హుజూరాబాద్‌లో..**

హుజూరాబాద్ పురపాలికలో రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో 2022లో సమీకృత మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రెండంతస్తుల వరకు నిర్మించి స్లాబ్ వేశారు. రూ.4 కోట్లు ఖర్చువగా 60 శాతం మేర పనులను పూర్తి చేశారు. మిగిలిన పనులకు నిధులు సరిపోకపోవడంతో అదనంగా మరో రూ.4.75 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. ప్రభుత్వం అనుమతిచ్చినా నిధులు మాత్రం విడుదల కాలేదు.

రూ.2.18 కోట్ల వ్యయంతో డంపింగ్ యార్డు నిర్మాణ పనులు చేపట్టగా ఇప్పటివరకు రూ.1.60 కోట్లు ఖర్చు పనులు మాత్రమే పూర్తయ్యాయి.

ధోబీగాట్ల నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా ఆమోదం లభించింది. కానీ నిధులు విడుదల కాలేదు.

మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం నిర్మాణానికి రూ.2 కోట్లతో పనులు ప్రారంభమవగా ప్రహరీ మాత్రమే నిర్మించారు.

హుజూరాబాద్‌లోని క్రైస్తవుల కోసం రూ.25 లక్షలతో శ్మశానవాటిక నిర్మించాల్సి ఉండగా పనులు ప్రారంభం కాలేదు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రూ.10 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణానికి టెండర్ పూర్తయినా నిధులు విడుదల కాలేదు.

ఈ పనులన్నిటికీ నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదించామని, విడుదలవగానే పనులు ప్రారంభిస్తామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు.

**జమ్మికుంటలో..**

జమ్మికుంటలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో 2021లో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభించి స్లాబ్ వరకు పనులు చేసి, మిగతావి ఆపేశారు.

పురపాలికలో పట్టణ ప్రగతి కింద ఒకటో వార్డులో డంపింగ్ యార్డు అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు, జమ్మికుంట పురపాలిక కార్యాలయం ఆవరణలో సుందరీకరణ పనులకు రూ.35 లక్షలు, మున్సిపల్ పరిధిలోని ధర్మారంలో వైకుంఠధామం అభివృద్ధికి రూ.20 లక్షలు, డిగ్రీ కళాశాల మైదానంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ.10 లక్షలు, రామన్నపల్లిలో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు రూ.30 లక్షలు ప్రతిపాదించగా ఆమోదం లభించింది. కానీ నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి.

# నిబంధనలు గాలికి.. వ్యర్థాలు శివారుకి

హైదరాబాద్: పరిశ్రమల వ్యర్థాలతో జీడిమెట్ల, కాటేదాన్, పటాన్‌చెరు, నాచారం, మల్లాపూర్, పాశమైలారం ప్రాంతాల్లో భూగర్భజలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. గ్రేటర్ పరిధిలోని 185 చెరువులు, కుంటల్లో నీరు మురుగుమయమైంది. జీడిమెట్ల సమీపంలోని ఫాక్స్‌సాగర్, కాటేదాన్ చెంత నూర్‌మహ్మద్‌కుంటతోపాటు అనేక చెరువులు నీరు ఉపయోగించలేని విధంగా మారాయి. పారిశ్రామికవాడల్లోని ఇళ్లలో ట్యాప్ తిప్పితే నురగతో నీరు ఉబుకుతోంది. నిత్యం పరిశ్రమల్లో వెలువడే వ్యర్థాలను జీడిమెట్ల, పటాన్‌చెరు ఈటీపీలతో పాటు నాచారంలోని మన ఈటీపీకి తరలించాన్న నిబంధనలు నిర్వాహకులు విస్మరిస్తున్నారు.

**ట్యాంకర్ మాఫియా..** గతంలో పరిశ్రమల నిర్వాహకులు సమీపంలోని డ్రైనేజీ, నాలాల్లోనే వ్యర్థ జలాలను వదిలేవారు. స్థానికుల్లో అవగాహన పెరగడంతో వాటిని ఇప్పుడు శివార్లకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో జీడిమెట్ల సుభాష్‌నగర్‌లో వ్యర్థాలను తరలించేందుకు సిద్ధం చేస్తున్న డ్రమ్ములు నిబంధనలను కాలరాస్తున్నాయి. ఇందుకు ఓ ట్యాంకర్ల మాఫియానే నడుస్తోంది. కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) నిబంధనల ప్రకారం పరిశ్రమల్లోని కాలుష్యకారక వ్యర్థాలు, జలాలను శుద్ధి చేశాకే బయటకు వదలాలి. ఇది భారీ వ్యయంతో కూడుకున్నది కావడంతో యజమానులు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ వ్యవహారం అక్రమం కావడంతో వాహనదారులు తక్కువ దూరమైనా ట్రిప్పునకు రూ.60వేల వరకూ డిమాండ్ చేస్తున్నారు. ఒక్కోసారి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు.



**పీసీబీ ఏం చేస్తోంది?..** వ్యర్థ జలాలను ఇష్టారీతిన తరలించకుండా పీసీబీ నిబంధనలున్నాయి. సంబంధిత ట్యాంకరు ముందస్తుగానే అనుమతి తీసుకోవాలి. అందులో ఏముందో పెద్ద అక్షరాలతో రాయాలి. ఉ.6 నుంచి సా.6 గంటల్లోపే రవాణా చేయాలి. పీసీబీ పర్యవేక్షణ లోపం కారణంగా ఇవేవీ అమలుకావడం లేదు.

శుద్ధి కేంద్రాలకు తరలించడంలో నిర్లక్ష్యం..

మల్లాపూర్ పారిశ్రామికవాడలో 700 పరిశ్రమలుండగా..స్థానిక వ్యర్థాలను బోడుప్పల్ పరిధిలోని ఈటీపీకి తరలించాలి. ఇక్కడ 200 పరిశ్రమలు నమోదవ్వగా..రోజూ 45 కారా?నాల నుంచి వ్యర్థాల ట్యాంకర్లను పంపుతున్నారు. జీడిమెట్ల ఈటీపీను సేకరణ, శుద్ధి, పారబోత పద్ధతిలో నిర్వహిస్తుండగా..1200 పరిశ్రమల్లో 300 మాత్రమే శుద్ధికి పంపుతున్నాయి.

# హద్దులేని ఆక్రమణ'దారులు'

సిరిసిల్ల: జిల్లా కేంద్రం సిరిసిల్ల పురపాలిక చుట్టూ విస్తరిస్తోంది. పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటుతు న్నాయి. దీనికితోడు ఇబ్బడి ముబ్బడిగా లేఅవుట్లు వెలుస్తున్నాయి. పురపాలికగా మారక ముందు వేసిన లేఅవుట్లలో ఏర్పాటు చేసిన రహదారులను, నీటి వనరుల కింద ఆయకట్టుకు నీరందించే కాల్వలు చాలాచోట్ల ఆక్రమణలకు గురవుతున్నాయి. రెవెన్యూ దస్త్రాల్లోని స్థలాలపై పర్యవేక్షణ లేకపోవడం.. కనీసం ఇప్పటి అధికారులు వాటిపై అవగాహన లేక ఇంటి నిర్మాణాలకు అనుమతులిస్తున్నారు. ఈ ఆక్రమణలతో చిన్నపాటి వర్షాలకే రహదారులపై వరదనీరు ముంచెత్తుతోంది.

**ఎక్కడెక్కడంటే..**

సిరిసిల్ల పురపాలికగా మారక ముందే పట్టణ శివారు విద్యానగర్‌లో 6.21 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. దీనిలో ప్రత్యేకంగా దారులు కూడా వదిలారు. అయితే ఈ లేఅవుట్ను ఆనుకొని సిరిసిల్ల నుంచి తాడురుకు మానేరువాగు నుంచి వెళ్లే పాత దారి ఉంది. ప్రస్తుతం ఈ దారిని పూర్తిగా మార్చేశారు. దీని పక్కనుంచే బైపాస్ రహదారి రావడంతో ప్రస్తుతం ఈ ప్రాంతంలో గుంట రూ.30 లక్షలపైనే పలుకుతుంది.



శాంతినగర్ ప్రధాన రహదారిలో 50 ఫీట్లు ఉన్న రహదారి ఆక్రమణలతో 30 ఫీట్లకు కుంచించుకుపోయింది. శ్రీనగర్ కాలనీలోనూ అదే పరిస్థితి. వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన స్థలం పక్కన స్థలాన్ని ఆక్రమించి లేఅవుట్ వేయడంతో దేవాదాయశాఖ అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేయడంతో ఆక్రమణలు నిలిచిపోయాయి. కొత్త చెరువు నుంచి దిగువన దామెరకుంట, తుమ్మలకుంటలకు నీరు వెళ్లేందుకు కాల్వలు ఉన్నాయి. పట్టణం విస్తరణతో కొత్తచెరువు కింద ఆయకట్టు లేకుండా పోయింది. దీంతో వరదనీరు వచ్చే కాల్వలు ఆక్రమణలకు గురికాగా కొత్త చెరువు మత్తడి పారినప్పుడు శాంతినగర్‌ను వరదనీరు ముంచెత్తుతోంది. పురపాలకశాఖ ఈ కాల్వలను పునరుద్ధరించాల్సింది పోయి.. పక్కనే ఉన్న శ్రీనగర్ కాలనీ మీదుగా కొత్త కాల్వలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీని భూసేకరణకు నిధులు మంజూరైనా సమీపంలో భూ యజమానులు ఒప్పుకోవడంలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి.

పట్టణ వ్యాప్తంగా పురపాలకశాఖకు చెందిన 152 లేఅవుట్ స్థలాలు ఉండాలి. వాటిలో చాలావరకు ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తున్నారు. కొన్నింటి హద్దులు ఏర్పాటు చేశారు. ఇంకా చాలాచోట్ల ఉన్న ఖాళీ స్థలాలు ఎక్కడ ఉన్నాయనేది రెవెన్యూ, పురపాలకశాఖ అధికారులే గుర్తించలేని పరిస్థితి.

**రక్షణ చర్యలు ఏవీ?**

పురపాలికలకు రిజిస్ట్రేషన్ చేసిన ఖాళీ స్థలాలు చాలాచోట్ల బోర్డులు కనిపించకుండా పోతున్నాయి. కొన్ని చోట్ల ఆక్రమణదారులు చొచ్చుకొస్తున్నారు. కోట్ల రూపాయల విలువచేసే ఖాళీ స్థలాల రక్షణకు కనీసం కంచె వేసే పరిస్థితి లేదు. వీటికోసం పురపాలికలో ప్రత్యేకంగా బడ్జెట్ను ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేకాకుండా వివిధ పథకాలతో వీటిని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు చేసి పంపిస్తున్నా.. నిధులు విడుదల కాక అవి కాగితాలకే పరిమితమయ్యాయి. రక్షణలేని స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి.

# సేకరించి.. మిల్లర్ల చేతికందించి!

సుల్తానాబాద్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పక్కదారి పడుతోంది. స్థానికంగా కొంత మంది దళారులు ఇంటింటా తిరుగుతూ సన్నబియ్యాన్ని సేకరించి సొమ్ము చేసుకుంటున్నారు. సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైన కొద్ది రోజుల వ్యవధిలోనే సుల్తానాబాద్‌లో ఈ అక్రమ రవాణా బహిరంగంగా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

**మిల్లులు అధికంగా ఉండగా..**

సుల్తానాబాద్ ప్రాంతంలో బియ్యం మిల్లులు అధికంగా ఉన్నాయనే ఉద్దేశంతో స్థానికంగా ఉండే కొంత మంది దళారులు సన్నబియ్యం అక్రమ రవాణాకు తెర లేపారు. ఇందుకోసం ప్రత్యేకమైన ఆటోలను ఏర్పాటు చేసుకున్నారు. వాటికి మైక్‌సెట్లు బిగించి ప్రతీ రోజు ఉదయం ఇంటింటా తిరుగుతూ సన్న బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రజల నుంచి రూ.20 చొప్పున కొనుగోలు చేసి ఓ ప్రాంతంలో కొన్ని రోజులపాటు నిల్వ చేస్తున్నారు. ఇలా పెద్ద మొత్తంలో స్థానికంగా ఉండే బియ్యం మిల్లర్లకు కిలో రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. గతంలో దొడ్డు బియ్యం కొనుగోలు చేసిన దళారులే సన్నబియ్యం అక్రమ సేకరణ చేస్తున్నారని కొంత మంది చెబుతున్నారు.



**మిల్లర్లు వాటిని ఏం చేస్తున్నారంటే..**

గతంలో ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) బకాయిపడ్డ మిల్లర్లు సన్నబియ్యాన్ని సేకరించి తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం కొంత మంది మిల్లర్లు బృందంగా ఏర్పడి ఇంటింటా సేకరించిన సన్నబియ్యాన్ని బహిరంగంగా కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సేకరణ గత వర్షాకాలంలో పెద్ద మొత్తంలో జరిగినట్లు సమాచారం.

**కేసులు తప్పవు**

ప్రభుత్వం చౌకధరల దుకాణాల నుంచి ప్రజలకు పంపిణీ చేసిన సన్నబియ్యాన్ని అమ్మినా.. ఎవరైనా కొనుగోలు చేసినా కేసులు తప్పవు. ప్రజలు సన్న బియ్యాన్ని అమ్మితే రేషన్‌కార్డులను రద్దు చేస్తాం. అలాగే దళారులు ఇంటింటా సన్నబియ్యాన్ని సేకరించడం నేరం. సన్నబియ్యం అక్రమ సేకరణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం.

శ్రీనాథ్, డీసీఎస్‌వో, పెద్దపల్లి

చురకలు



# అక్రమార్కుల గుప్పిట ఇసుక కుప్పలు

నంద్యాల: జిల్లాలో ఇసుక నిల్వలు అక్రమార్కుల గుప్పిట ఉన్నాయి. నియోజకవర్గానికి ఒక నిల్వ కేంద్రాన్ని (స్టాక్ పాయింట్) ఏర్పాటు చేశారు. టన్ను ఇసుక రూ.770కి విక్రయించాలని ప్రభుత్వం నిర్దేశించింది. నిబంధనల ప్రకారం నియోజకవర్గ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల వద్దే కొనుగోలు చేయాలి. కొన్ని కేంద్రాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయి.

**ఇక్కడ చెప్పిందే ధర**

నంద్యాల, ఆళ్లగడ్డలో రూ.950 వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ రెండు పట్టణాల్లో పదుల సంఖ్యలో డిపోలు వెలిశాయి. నేరుగా వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పెన్నా నది నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. స్టాక్ పాయింట్ డిపో హోల్డర్ అనధికారికంగా ఏర్పాటు చేసిన వ్యక్తుల ద్వారా ఇసుక విక్రయాలు సాగుతున్నాయి. నంద్యాల, ఆళ్లగడ్డ ఇసుక నిల్వ కేంద్రాల్లో కొన్ని నెలలుగా ఇసుక నిల్వలు కనిపించడం లేదు. ఇక్కడ దస్త్రాల నిర్వహణ సరిగా లేదు. దీంతో ఈ రెండు కేంద్రాల రెన్యువల్‌పై ఉన్నతాధికారి అభ్యంతర వ్యక్తం చేశారు.

**వారి కనుసన్నల్లోనే**

నంద్యాల స్టాక్ యార్డును ఒక నాయకుడు పరోక్షంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం టెండర్లు నిర్వహించినప్పుడు తొలుత ఓ గుత్తేదారుడు ఈ డిపోను దక్కించుకొన్నారు. తర్వాత ఆయన ఓ నాయకుని కనుసన్నల్లో కొంతకాలం పనిచేశారు. 'లెక్క'ల్లో తేడా రావడంతో మరో నాయకుడికి అప్పగించారు. తొలుత టన్ను రూ.770 ఉండగా.. తరువాత రూ.850



కు.. కొన్ని నెలల కిందట రూ.950కు పెంచారు.

ఆళ్లగడ్డలో ఇద్దరు ప్రభావితం చేస్తున్నారు. డిపో ఒకరి పేరుతో ఉండగా.. ఒక నాయకుని కనుసన్నల్లో నడుస్తోంది. విక్రయాలు మాత్రం ఇద్దరు దళారులు చేస్తున్నారు. ఇక్కడ కూడా ఇసుక ధర ఇప్పటికే మూడుసార్లు పెంచారు.

**దళారులదే హవా**నంద్యాల, ఆళ్లగడ్డ స్టాక్ యార్డు డిపో హోల్డర్లు నామమాత్రంగా మారారు. ఈ రెండు పట్టణాల్లో డిపోల నుంచి కాకుండా ఇసుకను 'దళారుల' నుంచే వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. నంద్యాల పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 20 వరకు ఉన్నాయి. అనధికార ఇసుక డిపోల వద్ద ఎక్కడా బిల్లులు ఇవ్వడం లేదు.

# మూత్ర గండం.. గట్టెక్కని జనం

బద్వేలు : పనులు పూర్తిస్థాయిలో కాకముందే ఉమ్మడి కడప జిల్లాలో గత వైకాపా ప్రభుత్వం హడావుడిగా డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించారు. ఆశించిన మేర ఇక్కడ వైద్య సేవలు అందకపోవడంతో కిడ్నీ బాధితుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. మరోవైపు ఏటా రోగుల సంఖ్య పెరుగుతున్నా సేవలందించాల్సిన సిబ్బంది, వ్యాధి తీవ్రత నిర్ధారించాల్సిన పరికరాలు కొరతగా ఉన్నాయి. దీంతో బాధితులు తీరా ఆ కేంద్రాలకు వచ్చాక వైద్యం సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట, వైఎస్సార్ జిల్లాలో కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు పట్టణాల్లో ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తున్నాయి. ప్రతి రోజూ మూడు నుంచి నాలుగు షిఫ్టుల వంతున పరీక్షలు చేస్తున్నారు. బద్వేలు ప్రభుత్వ వైద్యశాలలో 2023లో రాహే కంపెనీ ప్రతినిధులు రూ.2 కోట్లతో కేంద్రాన్ని నిర్మించింది. 25 పడకలు, ఎనిమిది యంత్ర పరికరాలను సమకూర్చారు. డాక్టర్, మేనేజర్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్ చెరొకరు, కంటింజెంట్ వర్కర్లు ఇద్దరిని నియమించారు. ఇక్కడికి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల నుంచి 60 మంది పైచిలుకు నిత్యం వస్తున్నారు. వీరి సంఖ్యకు తగ్గట్టు యంత్రాలు, సిబ్బంది లేకపోవడం గమనార్హం. బద్వేలు కేంద్రానికి ప్రత్యేకంగా జనరేటర్, మోటారు బోరు ఏర్పాటు చేయలేదు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వాసుపత్రికి చెందినవాటిని వినియోగిస్తున్నారు.


రవాణా సౌకర్యంలేక ఇక్కట్లు

డయాలసిస్ చేయించుకునేందుకు వచ్చే రోగులకు రవాణా సౌకర్యం లేదు. ఆటోలు, బస్సుల్లో రాకపోకలు చేస్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఒక్కొక్కరు వారానికి మూడు సార్లు సెంటర్‌కు రావాల్సి ఉంది. క్రమం తప్పితే ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. చాలీచాలని వచ్చే రూ.10 వేల పింఛనుతో మందులు, ఆహారం, రవాణా ఖర్చులను భరించాల్సి వస్తోంది. రూ.15 వేలకు పెంచాలని చాలా ఏళ్లుగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. ఈ సమస్యలపై బద్వేలు డయాలసిస్ కేంద్రం వైద్యాధికారి రామ్‌ప్రసాద్‌తో ప్రస్తావించగా ఇక్కడి సమస్యలను తమపై అధికారుల దృష్టికి తీసుకుపోయామన్నారు.

# అధికారులకు అ'ధన'పు అంతస్తులు

కడప : ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీలోపు పైకప్పు వేసిన అనధికారిక నిర్మాణాలు.. మంజూరు చేసిన ప్లాన్‌కు భిన్నంగా చేపట్టిన వాటి క్రమబద్ధీకరణకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఇదే అదనుగా కొందరు అధికారులు జేబులు నింపుకొంటున్నారు.

కడప నగరం యర్రముక్కపల్లి-అంగడీవీధికి మధ్య వెలసిన ఒక గేటెడ్ కమ్యూనిటీలో పదుల సంఖ్యలో అనధికారిక నిర్మాణాలు చేపట్టారు. కొన్నింటికి రెవెన్యూ శాఖ నోటీసులు సైతం జారీ చేసింది. పలువురి నుంచి ఫిర్యాదులు వచ్చాయి. అయినా ప్రణాళికా విభాగంలోని కీలక అధికారి కింది స్థాయి సిబ్బందిని కాపలాగా ఉంచి నిర్మాణాలు చేయించారు.దేవుని కడప రోడ్డులో ఓ కళాశాల నిర్మాణానికి చెల్లించాల్సిన ఫీజులను రూ.18 లక్షల మేర తగ్గించారు.



కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిపై నిర్మాణం తుది దశలో ఉన్న భవంతి నిర్మాణంలో లోపాలున్నాయి. అయినా అధికారులు అనుమతులిచ్చారు.

వన్‌టౌన్ పరిధిలోని వాణిజ్య ప్రాంతాల్లో అధికారులే అక్రమ నిర్మాణాలను భారీగా ప్రోత్సహించారు. అనుమతి ఒకటి చేపట్టిన నిర్మాణం మరొకటి కనిపిస్తున్నా పట్టించుకోలేదు.పారదర్శకతకు పాతర: కడప నగరపాలక సంస్థ పరిధిలో ఆగస్టు 31కి ముందు కట్టిన అనధికారిక నిర్మాణాల లెక్కపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా అక్రమ కట్టడాల లెక్కలు వెల్లడిస్తున్నా.. నగరపాలక సంస్థ ప్రణాళికా విభాగం మాత్రం అత్యంత గోప్యంగా ఉంచుతోంది. అక్రమ నిర్మాణాలపై సర్వే చేపట్టలేదని.. రెండు, మూడు రోజుల్లో వివరాలు తెలుస్తాయని పొంతన లేని సమాధానాలిస్తున్నారు. నగరపాలక సంస్థలో కీలకమైన డీసీపీని బదిలీ చేసి ఆ స్థానంలో కుడా అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించడం.. ఇద్దరు ఏసీపీలు ఉండగా ఒకరిని క్షేత్రస్థాయి విధులకు దూరం పెట్టడం వంటి పరిణామాలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి.

# కాసుక్కూర్చుంటారు..




తిరుపతి : చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పనిచేసే ఓ సబ్ రిజిస్ట్రార్.. ఈ స్థాయిలో కాకున్నా బాగానే వెనకేసుకున్నారు. ప్రతి పనికీ ధర నిర్ణయించారు. దస్తావేజు లేఖరులే మధ్యవర్తులుగా వ్యవహరించి సాయంత్రానికి ఆయన వాటా ముడితేనే తూర్పు ప్రాంతంలోని ఇంటికి చేరుకుంటారు.జిల్లాలోని ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చూసినా అవినీతి రాజ్యమేలుతోంది. దస్తావేజు లేఖరులు ఈ దందాకు మధ్యవర్తులు. మీరు కేవలం బయోమెట్రిక్ వేయడానికి కార్యాలయానికి వస్తే చాలని.. మిగతా పని అంతా మేమే చూసుకుంటామని క్రయ విక్రయదారులకు స్పష్టం చేస్తున్నారు. కాసులిస్తే కానీ పని కాదనేది బహిరంగ రహస్యమే.అక్రమ లేఅవుట్ల పండగే..: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కలిపి 23 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఏటా ప్రభుత్వానికి దాదాపు రూ.380 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. సబ్ రిజిస్ట్రార్లు, ఉద్యోగులు, కార్యాలయ సిబ్బందికి ఇవ్వాల్సిన మొత్తం సపరేటుగా ఉంటోంది. ఆస్తుల క్రయవిక్రయాలకు వెళ్లిన వారు ఎవరైనా ఎంతోకొంత సమర్పించుకోకుంటే అనేక ఆటంకాలు కలిగిస్తారు. దస్తావేజు లేఖరులే ఈ వ్యవహారంలో చక్రం తిప్పుతున్నారు. ప్రధానంగా అక్రమ లేఅవుట్లు సబ్ రిజిస్ట్రార్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఇటీవల సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఓ సబ్ రిజిస్ట్రార్ అనధికారిక లే అవుట్ రిజిస్ట్రేషన్‌కు ప్లాటుకు రూ.40వేలు వసూలు చేశారు.

**నిషేధిత భూమి అయితే రూ.10 లక్షలు- రూ.15 లక్షలు**

నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేయకూడదు. అయినా కొందరు సబ్ రిజిస్ట్రార్లు తీరు మార్చుకోవడంలేదు. తిరుపతి జిల్లాలో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో వారికి లాభదాయకంగా ఉంది. పక్క సర్వే నంబరు వేసి భూములు కట్టబెడుతున్నారు. తిరుపతి, చుట్టుపక్కల ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇలాంటి పనులు చేయడానికి రూ.10 లక్షలు- రూ.15 లక్షల వరకు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. చిత్తూరు జిల్లాలో గ్రామ కంఠాలకు రూ.5వేలు- రూ.10వేలు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ భూములైతే ఎకరాకు విలువను బట్టి కనీసం రూ.5వేలు- రూ.25వేలు వసూలు చేస్తున్నారు.

**ఎక్కువ ఖర్చు చేసి వచ్చామంటూ**

సబ్ రిజిస్ట్రార్లను ఎవరినైనా ప్రశ్నిస్తే తాము ఎక్కువ ఖర్చు చేసి వచ్చామని.. అలాంటప్పుడు తిరిగి వసూలు చేసుకోవాలి కదా? అని ప్రశ్నిస్తున్నారు. తిరుపతి నగరానికి దగ్గర్లో ఉన్న ఓ సబ్ రిజిస్ట్రార్ రూ.50 లక్షలు ప్రజాప్రతినిధికి లంచం ఇస్తేనే తనకు ఇక్కడ పోస్టింగ్ వచ్చిందని అంటున్నారు. మరొకరు రూ.20 లక్షలు సమర్పించానని కుండబద్దలు కొడుతున్నారు. దస్తావేజు లేఖరులను పరిసరాల్లోకి రానివ్వకుండా, క్రయవిక్రయదారులతోనే డాక్యుమెంట్లు రూపొందిస్తే ప్రభుత్వం ఆశించిన అవినీతి రహిత సేవలు అందుతాయి.

# గంపగుడ్డుగా దోపిడీ



ఆళ్లగడ్డ: అమ్మను రక్తహీనత ఇబ్బంది పెడుతోంది.. చిన్నారులు పోషకలేమితో బక్కచిక్కిపోతున్నారు.. దీని నివారణకు జిల్లాకు నెలకు రూ.16.35 కోట్ల విలువైన పోషకాహారం సరఫరా చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి.. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు సరిగా అందడం లేదు. గుత్తేదారు 'గుడ్లు'తేలేస్తున్నారు.. కందిపప్పు పుచ్చిపోతోంది.. భోజనం 'రుచి' తప్పుతున్నట్లు 'న్యూస్‌టుడే' పరిశీలనలో తేలింది.

బాలింతలకు, గర్భిణులకు, ఆరు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులకు, మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు 25 గుడ్లు ఇవ్వాలి. ఉమ్మడి జిల్లాలో నెలకు 76 నుంచి 78 లక్షల గుడ్లు అందిస్తున్నట్లు లెక్కలు రాసుకొంటున్నారు.

నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ నిర్ధారించిన గుడ్డు ధర ప్రకారం గుత్తేదారులు అందించాల్సి ఉంది. 'నెక్' ప్రకారం శుక్రవారం ఒక గుడ్డు ధర రూ.5.90 పైసలు ఉంది. ఒక ట్రే(30 గుడ్లు) బరువు 1500 గ్రాములు ఉండాలి. బయటి మార్కెట్‌లో గుడ్డు 60 నుంచి 65 గ్రా. ఉండగా, అంగన్‌వాడీ కేంద్రాల గుడ్డు మాత్రం 40 నుంచి 45 గ్రాములకే పరిమితమైంది.

గుడ్లు పక్కదారి పట్టకుండా ఉండేందుకు వీటిపై రంగులు వేయాలి. ఎక్కడా ఇది అమలు కావడం లేదు.

**'కిట్ల'కు కటకట**

బాలింతలు, గర్భిణులకు ప్రతి నెలా బాల సంజీవని కిట్లు ఇవ్వాలి. ఇందులో కిలో అటుకుల, రాగిపిండి, 250 గ్రాముల ఖర్జూరాలు, చిక్కీలు, బెల్లం ఉండాలి. మూడు కిలోల బియ్యం, కిలో కంది బేడలు, అర కిలో నూనెతో(రూ.300), 25 గుడ్లు(రూ.150), 5 లీటర్ల పాలు(రూ.250) కలిపి టేక్ హోమ్ రేషన్ కింద ఇస్తారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో బాలింతలు, గర్భిణులు కలిపి 70,766 మంది వరకు ఉన్నారు. ప్రతి ఒక్కరికీ నెలనెలా రూ.975 విలువైన పోషకాహారాన్ని అందించాలి. 30 శాతం మందికి చేరడం లేదని 'న్యూస్‌టుడే' పరిశీలనలో తేలింది. కొందరికి ఆలస్యంగా ఇస్తున్నారు.. ఇచ్చిన వాటిలో నాణ్యత ఉండటం లేదు. 'కంది'పప్పు నాసిరకంగా ఉంది.

**రూ.కోట్లు వెచ్చిస్తున్నారు**

6 నెలల నుంచి మూడేళ్ల మధ్యనున్న పిల్లలకు నెలకు 2.5 లీటర్ల పాలు, 25 గుడ్లు, 2.5 కిలోల బాలామృతాన్ని పోషకాహారంగా ఇస్తారు. ఒక్కో పిల్లవాడికి రూ.500 విలువ చేసే వీటిని ఇంటికే ఇస్తారు.

కేంద్రంలో చదువుకునే పిల్లలకు 75 గ్రా. బియ్యం, 15 గ్రా. కంది బేడలు, 5 గ్రా. నూనె, ఒక గుడ్డుతో కూడిన భోజనాన్ని అందిస్తారు. వీరికి నెలకు రూ.300 వరకు విలువైన ఆహారాన్ని అందిస్తుంటారు.

ప్రతి నెలా గర్భిణులు, బాలింతలకు రూ.7 కోట్లు, చిన్నారులకు రూ.9.35 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు : 3,558

బాలింతలు, గర్భిణులకు: రూ. 975

6 నెలలు-3 ఏళ్ల మధ్య పిల్లలకు: రూ. 500

3-6 ఏళ్ల మధ్య పిల్లలకు: రూ.300

# సివిల్స్‌కు ఉచిత శిక్షణ

నంద్యాల : అఖిల భారత స్థాయిలో నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత ఉపయోగించుకోవచ్చు. నాలుగు నెలల పాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. అర్హులైన, ఆసక్తి ఉన్నవారు నవంబరు 26లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి చింతామణి సూచించారు.

**అర్హత**

డిగ్రీ పాసై, కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.8 లక్షలలోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అర్హులు. ఎంపికైన అభ్యర్థులకు డిసెంబరు 12 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 10 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం

ఏపీస్టడీసర్కిల్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

కుల, ఆదాయ, పదో తరగతి, డిగ్రీ ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అప్‌లోడ్ చేయాలి.

పిక ప్రక్రియ అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు.

దీనిలో మెరిట్ సాధించిన వారికి రిజర్వేషన్ ప్రకారం అవకాశం కల్పిస్తారు.



ఎంపికైన అభ్యర్థులకు ఈమెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇస్తారు.

విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలో స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేశారు.

340 సీట్లలో ఎస్సీలకు 240, ఎస్టీలకు 100 సీట్లు కేటాయించారు.

మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఉంది.

ఈ సబ్జెకుల్లో..జనరల్ స్టడీస్(పేపర్-1), సీఎస్ఏటీ(పేపర్-2)లో శిక్షణ ఇస్తారు.

ప్రతి వారం పరీక్షలు, ప్రిపరేషన్ పర్యవేక్షణ, మానిటరింగ్ చేస్తారు.

స్టడీ మెటీరియల్ ఇస్తారు.

మరిన్ని వివరాలకు 94933 43866 నంబరును సంప్రదించాలి.

# హైవేలో సీసీ గస్తీ

నందికొట్కూరు : జాతీయ రహదారి 340సీ కొత్తగా నిర్మించారు.. నాలుగు వరుసలపై రయ్.. రయ్ మంటూ వాహనదారులు దూసుకెళ్తున్నారు.. 'మృత్యు'వేగానికి కళ్లెం వేసేందుకు 32 నిఘా నేత్రాలు బిగించారు.. వాహనం ఎన్ని కి.మీ వేగంతో ప్రయాణిస్తుందో ఆ తెరలపై కనిపిస్తుంది. 100 కి.మీ కన్నా అధిక వేగంతో ప్రయాణిస్తే బీప్ సౌండ్ వచ్చి వాహనదారులను అప్రమత్తం చేస్తుంది.

**అర కి.మీ. మేర పసిగడతాయి**

జాతీయ రహదారిపై అమర్చిన సీసీ కెమెరాలు, డిజిటల్ తెరలు సౌర విద్యుత్తుతో పనిచేస్తాయి. 40 మెగా పిక్సెల్ సామర్థ్యం కలిగిన ఈ కెమెరాలు అర కి.మీ పరిధిలో రోడ్డుపై ఏం జరిగినా స్పష్టంగా రికార్డు చేస్తాయి.

**క్షణాల్లో జరిమానా**

కెమెరాలను కంట్రోల్ రూంతో అనుసంధానం చేశారు. అక్కడి సిబ్బంది వీటిని పర్యవేక్షిస్తుంటారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు కార్యాలయం



నుంచే కెమెరాలను రొటేట్ చేస్తూ వాటిని రికార్డు చేసుకునే సదుపాయం ఉంది. వీటిని పోలీసు శాఖతో అనుసంధానం చేయనున్నారు. వారు నిబంధనలు ఉల్లంఘించి అతివేగంతో ప్రయాణించిన వారిని కంట్రోల్ రూం నుంచి గుర్తించి జరిమానా విధిస్తారు. వెంటనే వాహనదారుడి చరవాణికి మెసేజ్ వెళ్తుంది.

**34 కి.మీ. 32 నిఘా నేత్రాలు**

నన్నూరు టోల్‌ప్లాజా నుంచి మండ్లెమ్ వరకు రూ.587 కోట్ల వ్యయంతో 34 కి.మీ మేర నాలుగు వరుసల రహదారి పనులు పూర్తి చేశారు. ఈ మార్గంలో నిత్యం సుమారు 5,300 వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్తున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు 34 కి.మీ పరిధిలో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రెండుచోట్ల డిజిటల్ తెరలతో కూడిన వేగ నియంత్రికలు ఏర్పాటు చేశారు.

# రాచ'ముల్లు' గట్టిగానే గుచ్చుకుంది

ప్రొద్దుటూరు : గత వైకాపా ప్రభుత్వంలో పరిపాలన ఇష్టారాజ్యంగా సాగిందనేందుకు ఇదో నిదర్శనం. ఆ పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, నేతలు తామంతా నిబంధనలకు అతీతులమైనట్లు వ్యవహరించారు. తమ మాటే శాసనమంటూ చెలరేగిపోయారు. చట్టం ప్రకారం నిబంధనలు అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం ఆ విషయాన్ని విస్మరించింది. వారికి వంత పాడుతూ అక్రమాలకు యథాశక్తి సహకరించింది. ఫలితంగా ఇప్పుడు చర్యలకు లోనవుతోంది.పేరు ఉచితం.. తీరు అనుచితం: 2019-24 మధ్య గత ప్రభుత్వ హయాంలో కొందరు కమిషనర్లు నిబంధనలకు



విరుద్ధంగా భవన నిర్మాణాలకు అనుమతులిచ్చారు. కొర్రపాడు రోడ్డులో అప్పటి ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఉచిత అన్నదాన కేంద్రానికి స్థలం కేటాయింపులో అక్రమాలకు సహకరించారు. నెలకు రూ. 5 వేలకు విలువైన స్థలాన్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అనుమతి లేకుండానే కట్టబెట్టేశారు. ఈ తీరుపై ప్రభుత్వం మారిన తర్వాత కూటమి ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి ఫిర్యాదు చేశారు. స్పందించిన ప్రభుత్వం అనంతపురం పురపాలక రీజినల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీని నియమించింది. ఎనిమిది మాసాల కిందట క్షేత్రస్థాయి పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ మేరకు కమిషనర్లు చంద్రమౌళీశ్వరరెడ్డి, రాధా, వెంకట రమణయ్య, పట్టణ ప్రణాళికా విభాగం సహాయక కమిషనర్ మునిరత్నంతో పాటు ఇద్దరు విశ్రాంత అధికారులు, ముగ్గురు ఏఈలు, అకౌంట్ సిబ్బంది ఇద్దరు, సచివాలయం వార్డు కార్యదర్శులు 24 మంది, నలుగురు సీనియర్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పురపాలక చరిత్రలో ఇప్పటి వరకు ఇంతమందిపై అభియోగాల నమోదు, చర్యలకు ఉత్తర్వులు జారీ చేయడం ఇదే ప్రథమం కావడం గమనార్హం.

# 'డ్రోన్'ట్‌వర్రీ బ్రో

పీలేరు : వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై కూటమి ప్రభుత్వం రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. రైతులు కూడా మూస సాగు విధానాలకు స్వస్తి పలుకుతూ ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే వరి నాట్లు, పంట ఒబ్బిడి, కలుపు తొలగింపు పనులకు యంత్రాల వినియోగం బాగా పెరిగింది. కూలీల సమస్యను అధిగమించారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలతో డ్రోన్ల వినియోగం కూడా ఊపందుకుంటోంది. ఎరువులు, పురుగు మందుల పిచికారీకి వాటిని వినియోగించేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ముందుకొస్తున్న రైతులకు 80 శాతం రాయితీపై డ్రోన్ పరికరాన్ని అందజేస్తున్నారు. సంఘాలుగా ఏర్పడిన రైతులకు ఈ పరికరాన్ని రాయితీపై అందజేసి దాని వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఆసక్తి ఉన్న యువ రైతులను ఎంపిక చేసి ఈ పరికరాన్ని అందజేస్తున్నారు.

ఉపయోగాలివి...పంటకు పురుగుల మందు, ఎరువుల పిచికారీని పాత విధానంలో చేస్తే ఎకరాకు సగటున 200 లీటర్ల నీరు అవసరం ఏర్పడుతుంది. అదే డ్రోన్ పరికరంతో అయితే 10 లీటర్ల నీరు సరిపోతాయి.

ఈ పరికరంతో నానో యూరియాను వినియోగిస్తే మొక్కకు 90 శాతం చేరుతుంది. అదే యూరియాను నేరుగా చేత్తో చల్లితే పంటకు 40 నుంచి 50 శాతం వరకు మాత్రమే చేరుతుంది. ఈ పరికరం వినియోగంతో కూలీల అధిగమించడంతో పాటు తక్కువ సమయంలో పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుంది.

## పూర్తయితే.. రయ్ రయ్

పలమనేరు : కృష్ణగిరి- పలమనేరు రోడ్డుకు మహర్దశ పట్టనుంది. ఈ రహదారి విస్తరణకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పలమనేరు నుంచి బైరెడ్డిపల్లె, వి.కోట మీదుగా తమిళనాడులోని కృష్ణగిరి వరకు ఇప్పుడున్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఈ పనులు పూర్తయితే మన రాష్ట్రం నుంచి తమిళనాడుకు రాకపోకలు సులభతరమవుతుంది. దీన్ని జాతీయ రహదారుల శాఖ అభివృద్ధి చేయనుంది.

**ఇప్పుడు ఏ దశలో ఉంది**

ఈ ప్రతిపాదన ప్రస్తుతం డీపీఆర్ దశలో ఉంది. ఇందుకోసం



అధికారులు టెండర్లు పిలువనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక భూసేకరణ మొదలు పెడతారు. ఇప్పటికే ఎక్స్‌ప్రెస్ హైవే పనులు దాదాపు పూర్తికావస్తున్నాయి. ఈ పనులు కూడా పూర్తయితే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు అనుకూలంగా ఉంటుంది. పలమనేరు నుంచి కుప్పం వరకు భూసేకరణ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

దారి పొడవునా కల్వర్టులు, వంతెనలు ఎన్ని అవసరమో తరువాత నిర్ణయిస్తారు. నెల రోజుల్లో ప్రక్రియ మొదలవుతుందని ఎన్‌హెచ్ డీఈఈ సరిత తెలిపారు.

కృష్ణగిరి-పలమనేరు రోడ్డుకు మహర్దశ

పలమనేరు నుంచి కృష్ణగిరి వరకు 82 కి.మీ

అంచనా వ్యయం: రూ.800 కోట్లు

## కొండ దిగిన కుండ

బనగానపల్లి: పడకేసిన నీటి పథకం.. గుక్కెడు నీటి కోసం కి.మీ. దూరం కాలినడక.. రక్షిత పథకాల నిర్వహణపై నిర్లక్ష్యం.. ఇది గత వైకాపా ప్రభుత్వ హయాంలో తీరు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. అవుకు మంచినీటి పథకం ఎట్టకేలకు పూర్తయింది. ఇంటింటికి కుళాయికు నీరు సరఫరా అవుతోంది.

**చొరవ తీసుకున్న కూటమి ప్రభుత్వం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుమారు రూ.2 కోట్లతో పైపులైన్లు, ఓహెచ్ఆర మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. కొన్ని చోట్ల పైపులైన్లు పగిలిపోయి లీకేజీ ఉండటంతో పనులు పూర్తి చేశారు. కొలిమిగుండ్ల మండలంలో 17 గ్రామాలు, అవుకు



మండలంలో 16 గ్రామాలు, సంజామల మండలంలో 6 గ్రామాలకు కోవెలకుంట్ల పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తీరిపోయింది.

"మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవ తీసుకోవడంతో పనులు పూర్తిచేసి 40 గ్రామాలకు నీరు ఇస్తున్నామని " ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సాయికృష్ణ తెలిపారు.

**పడకేసిన వైకాపా**అవుకు జలాశయం సమీపంలోని కొండపై మంచినీటి పథకం నిర్మాణం చేపట్టారు. 40 గ్రామాలకు మంచినీరు అందించాలనే లక్ష్యంతో 2010లో రూ.10 కోట్లతో పనులు ప్రారంభించారు. రెండో దశలో ఈ పథకాన్ని తిరిగి రూ.18 కోట్లకు పెంచారు. ఆగిపోయిన పనులు చేపట్టేందుకు 2019లో తెదేపా ప్రభుత్వం రూ.8.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు నత్తనడకన సాగాయి.

పథకం ప్రారంభం : 2010

మొత్తం ఖర్చు: రూ. 36.50 కోట్లు

తాగునీరు అందే గ్రామాలు: 40

నిత్యం నీటి శుద్ధి: 90 లక్షల లీటర్లు

## గజారామంలో.. ఆహ్లాదం.. విజ్ఞానం

పలమనేరు : ప్రజలు, విద్యార్థులకు ఆహ్లాదం, ఆనందం, విజ్ఞానం అందించేందుకు అటవీశాఖ సిద్ధమవుతోంది. పలమనేరు పరిధిలో గజారామం వద్ద నగరవనాన్ని తీర్చిదిద్దనున్నారు. దీనికి ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అటవీ సంపదను భావితరాలకు చూపించేందుకు వనాలు దోహదం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. **రూ.24 లక్షలతో అంచనాలు**

ప్రస్తుతం ఉన్న సౌకర్యాలతో పాటు మరిన్ని వసతులు కల్పించనున్నారు. ఇక్కడ బటర్ ఫ్లై గార్డెన్ ఏర్పాటు చేస్తారు. కాక్టస్ మొక్కలు పెంచనున్నారు. లోటస్ పాండ్ల ఏర్పాటుకు రూ.24 లక్షలతో అంచనాలు సిద్ధం చేశారు.

**విద్యార్థులకు ఉపయుక్తం**

వనంలో ఏర్పాటు చేసిన వాతావరణ విద్యాకేంద్రంతో విద్యార్థులకు మేలు జరగనుందని అధికారులు చెబుతున్నారు. వీరి కోసం ప్రొజెక్టర్, స్క్రీన్ ఏర్పాటు చేశారు. ప్రతి మొక్కకు సంబంధించిన వివరాలు తెలియజేసే సైన్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. ఎటు చూసినా సీసీ కెమెరాలతో కట్టుదిట్టమైన భద్రత కల్పించారు.

**4.50 లక్షల మొక్కలు..**

ఈ ప్రాంతంలో పవిత్ర, రాశి, ఉసిరి, నక్షత్ర వనాలు ఉన్నాయి. ఇక్కడ వివిధ రకాలకు చెందిన 4.5 లక్షల మొక్కలు పెరుగుతున్నాయి. ఫుట్‌పాత్‌లు, కుంటలతో ఆహ్లాదకరంగా ఉండటంతో అడవిలో సంచరించే అనుభూతి కలుగుతుంది.

నూతన సంవత్సరంలో ప్రజలకు సేవలు

నగరవనం 2026 జనవరి 31 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. ప్రవేశానికి టికెట్ ధరను ఉన్నతాధికారులు నిర్ణయించాల్సి ఉంది. పిల్లలు, పెద్దలు అందరికీ ఆహ్లాదం పంచేలా నిర్మాణం రూపుదిద్దుకుంటోంది.

– నారాయణ ఎఫ్ఆర్‌వో

4.50 లక్షల మొక్కలు..

ప్రాజెక్టు: గజారామం

విస్తీర్ణం: 50 హెక్టార్లు సౌకర్యాలు: సిట్టింగ్ హట్, చిన్నారుల ఆటస్థలం, వాతావరణ విద్యా కేంద్రం, గ్రంథాలయం

# నీటి ప్రవాహం గగనమే!



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా నీటి ప్రాజెక్టుల పరిధిలో ఉన్న కీలకమైన కాలువల్లో పీఏబీఆర్ కుడి కాలువ ఒకటి. ఇంతటి ప్రాధాన్యం కల్గిన కాలువ నిర్వహణ, మరమ్మతులను గత వైకాపా ప్రభుత్వం అటకెక్కించింది. ఐదేళ్లలో పైసా కూడా ఇవ్వలేదు. ఫలితంగా కాలువ దయనీయ దుస్థితికి చేరింది. ఎక్కడ చూసినా కంపచెట్లు, జమ్ము గడ్డి పెరిగాయి. గట్లు బలహీనంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జూన్‌లో నిర్వహణ, మరమ్మతుల కోసం 23 పనులకుగాను రూ.2.12 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో నిర్దేశిత పనులు తుది దశకు చేరాయి. కానీ హెచ్చెల్సీ డివిజన్ అధికారుల బాధ్యతారాహిత్యం మూలంగా 0-40 కి.మీ. దాకా కాలువ నిర్వహణ, మరమ్మతుల కోసం సకాలంలో తగిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించలేదు. దీంతో నిధులు రావడానికి అవకాశం లేకుండా పోయింది. ఈనెల 25న నీటిని విడుదల చేయనున్నారు. మొదట 40 కి.మీ. నీటి ప్రవాహం గగనంగా మారనుంది.

**160 కి.మీ.. 50వేల ఎకరాలు**

పీఏబీఆర్ కుడి కాలువ కింద ఏకంగా 40 పైగా చెరువులు ఉన్నాయి. ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలో కాలువ వెళ్తుంది. మొత్తంగా 50 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. స్థిరీకరణ కాకపోయినా కాలువల్లో నీటి ప్రవాహం కొనసాగితే బోర్లు, చెరువుల కింద ఆయకట్టు సాగు చేస్తారు.

**పర్యవేక్షణ కష్టమే..**

డ్యాం నుంచి మొదలయ్యే 0-40 కి.మీ. కాలువే అసలు సమస్య. 25 కి.మీ. దాకా అనంత డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడి అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతిపాదనల తయారీలో వైఫల్యం చెందారు. 25-40 కి.మీ. కాలువ డీసీ డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ 15 కి.మీ. నిర్వహణ, మరమ్మతులకు రూ.40 లక్షలు అవుతుందని అంచనాలు పంపారు. తొలి 25 కి.మీ. గురించి ప్రస్తావనే లేదు. కాలువలో విపరీతంగా గడ్డి మొక్కలు పెరిగాయి. ఇసుక మూటలు ఎక్కడపడితే అక్కడ వేశారు. పర్యవేక్షణ చేయడం కష్టమే. ముళ్లకంపలు పెరిగి నీటి దారి రూపు కోల్పోయింది. కనీసం నీటి విడుదల లోపు అడ్డంగా ఉన్న కంపలు, గడ్డిని తొలగించాల్సి ఉంది.

**ప్రత్యామ్నాయం ఆలోచిస్తున్నాం సుధాకర్‌రావు, ఎస్ఈ, హెచ్చెల్సీ**

నిర్వహణకుగాను ప్రభుత్వం కొద్దిమేర నిధులు ఇచ్చింది. దాదాపు కాలువలన్నీ శుభ్రం చేస్తున్నాం. కాలువ తొలి 40 కి.మీ. పరిస్థితి బాగాలేదు. దీనికి నిధులు తెచ్చుకోలేని ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచిస్తున్నాం. నీటి ప్రవాహానికి ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

# కాసులియ్యి.. కనెక్షన్ తీసుకో!



రాయదుర్గం : జిల్లాలోని కరవు ప్రాంతాలైన కళ్యాణదుర్గం, రాయదుర్గం పురపాలక సంఘాల్లో అక్రమ కుళాయి కనెక్షన్లు నానాటికీ అధికమవుతుండటంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోంది. ఇళ్లకు కొత్త కనెక్షన్ల నిమిత్తం కొందరు మున్సిపల్ కౌన్సిలర్లు, దళారులు, పలు పార్టీల నాయకులు, నీటి నిర్వహణ విభాగంలోని సిబ్బందిని సంప్రదిస్తుండటంతో వారు ఎంతోకొంత పుచ్చుకుని నల్లా కనెక్షన్ ఇచ్చేస్తుండటం గమనార్హం. కొత్త నల్లా అనుమతి పేరుతో వసూళ్ల దందా ఏళ్లుగా కొనసాగుతూనే ఉంది. చేయి తడిపితే చాలు కుళాయి ఇచ్చేస్తున్నారు. గతంలో తనిఖీలు నిర్వహించి మొక్కుబడిగా జీరో నల్లాల సంఖ్య లెక్కకట్టినా.. నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**ఒకటి అధికారికం.. మరొకటి అదనం**

కళ్యాణదుర్గం, రాయదుర్గం పురపాలికల్లో గతంలో పలు గ్రామాలు, కాలనీలు విలీనం అయిన సమయంలో ఇష్టారాజ్యంగా మధ్య దళారుల అక్రమ కుళాయి కనెక్షన్లకు తెరలేపారు. పట్టణం, శివారులోని ప్రాంతాల్లో అక్రమ కుళాయిలు ఎక్కువగా ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో ఒక కుళాయికి అనుమతి తీసుకుని మరొకటి అదనంగా కనెక్షన్ ఇప్పించుకోవడం గమనార్హం. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లోని వాణిజ్య భవనాలు, ఎక్కువ అంతస్తులు, అపార్ట్‌మెంట్లకు డొమెస్టిక్ కనెక్షన్లు ఉండటం విశేషం. నీటి సరఫరా విభాగంలోని కొందరు అమ్యామ్యాలు తీసుకుని హోటళ్లకు సైతం సాధారణ కనెక్షన్లు ఇచ్చినట్లు విచారణలో తేలింది. అక్రమ కనెక్షన్ల వల్ల శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదనే ఆరోపణలున్నాయి.

**దుర్గాల్లో 2,400 అక్రమ కనెక్షన్లు**

రాయదుర్గం పట్టణంలో 11237, కళ్యాణదుర్గంలో 4855 కుళాయి కనెక్షన్లు అధికారికంగా ఉన్నాయి. ఒక కుళాయికి నీటి పన్ను రూ.125లు వసూలు చేస్తున్నారు. కళ్యాణదుర్గంలో 2 వేలు, రాయదుర్గంలో 400లకు పైగా అక్రమ కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. వీటిల్లో కళ్యాణదుర్గం మున్సిపాల్టీకి ఏటా సుమారు రూ.36 లక్షలు, రాయదుర్గంకు రూ.6 లక్షల ఆదాయానికి గండి పడుతోంది. అక్రమ కనెక్షన్లను రెగ్యులరైజ్ చేయడానికి సగటున రూ.8 వేల చొప్పున డిపాజిట్లు స్వీకరిస్తే రాయదుర్గం పురపాలికకు రూ.30 లక్షలు, కళ్యాణదుర్గంకు రూ.50 లక్షలకుపైగా ఆదాయం సమకూరనుంది.

**తాఖీదులు సిద్ధం చేస్తున్నాం**

కళ్యాణదుర్గంలో ఇప్పటికే 2 వేలు, రాయదుర్గంలో 500 వరకు అక్రమ కుళాయి కనెక్షన్లు గుర్తించాం. క్షేత్రస్థాయిలో వాటి యజమానులకు నోటీసులు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. జీరో నల్లాలు రెగ్యులరైజ్ చేసుకోకపోతే వెంటనే కనెక్షన్లు తొలగించడంతోపాటు జరిమానా విధిస్తాం.వంశీకృష్ణభార్గవ, కమిషనర్, కళ్యాణదుర్గం, సురేష్ డీఈ, రాయదుర్గం

# ప్ర'గతి' తప్పుతున్న చక్రాలు



పుట్టపర్తి : పుట్టపర్తి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ అద్దె బస్సు 20 రోజుల క్రితం అనంతపురంలో వంద మందికిపైగా ప్రయాణికుల తో బయల్దేరింది. బస్సు పుట్టపర్తి చేరుకునే సమయానికి 43 మంది ఉన్నారు. ఆ సమయంలో ఇంజిన్‌లో మంటలు రావడంతో ప్రయాణికు లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బస్సును ఆపి వారిని దింపేయటంతో ప్రాణనష్టం లేకుండా ప్రమాదాన్ని నివారించగలిగారు. హిందూపురం డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు 15 రోజుల క్రితం కదిరిలో పరిమితికి మించి ప్రయాణికులతో బయల్దేరింది. 2 కి.మీలు ప్రయాణించకనే టైరు పగిలి ఆగిపోయింది. అదే డిపోకు చెందిన మరో బస్సులో ప్రయాణికులను ఎక్కించారు. ఆ బస్సు ఓడీసీ మండలం వారేవాండ్లపల్లి స్టేజీ దాటుతూనే టైరు దెబ్బతింది.

పుట్టపర్తి డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు వారంరోజుల కిందట నల్లమాడ మండలం రాగానిపల్లి వద్ద సాంకేతిక కారణాలతో ఆగింది. అదే డిపోకు చెందిన అద్దె బస్సు అనంతపురం వెళ్తూ ధర్మవరం వద్ద బ్రేకులు పడక ద్విచక్రవాహనానికి ఢీకొంది. పెనుకొండ వద్ద మరో బస్సు 15 రోజుల కిందట ఆగిపోయింది.ఆర్టీసీ ప్రయాణం సురక్షితం.. క్షేమంగా గమ్యానికి చేరవచ్చు.. అంతేస్థాయిలో ప్రయాణికులకు నమ్మకం. అయితే రాష్ట్రంలో తరచూ బస్సు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యం.. శ్రీసత్యసాయి జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం.. సాంకేతిక లోపాల కారణంగా ప్రయాణం ఆగుతూ.. సాగుతోంది. ప్రాణాపాయం లేకున్నా ప్రమాదపు గంటలైతే తరచూ మోగుతూనే ఉన్నాయి. భయంతో జనం ఉలిక్కి పడుతున్నారు. అధికారులు భద్రత చర్యల్లో కదలిక కనిపించక పోవటం మరింత ఆందోళనకు దారి తీస్తోంది.

**ప్రథమ చికిత్స పెట్టెలేవీ?**

రోడ్డు రవాణాలో ప్రధానంగా వాహనానికి టైర్లు, బరువు మోసే కట్టలు, బ్రేకులతో పాటు ఇంజిన్ ఆధారంగా ప్రయాణం సాగుతుంది. ప్రస్తుత వాటికే భద్రత కొరవడింది. ఫలితంగా తరచూ ప్రమాదాలకు తావిస్తోంది. ప్రతి బస్సులోనూ ప్రథమ చికిత్స పెట్టెలు, ఇంజిన్ వేడెక్కి మంటలు రేగితే ఆర్పటానికి సిలిండర్ వంటివి ఏర్పాటు చేయాలి. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అలాంటివేవీ కనిపించటం లేదు. కొన్ని బస్సుల్లో ప్రథమ చికిత్సకు అవసరమైన సామగ్రి లేకుండా ఖాళీ పెట్టెలు దర్శనమిస్తున్నాయి. ఒక బస్సులో వందకు మించి జనం ఎక్కుతున్నారు. దీంతో బరువు అధికమై కట్టలు దెబ్బతింటున్నాయి. టైర్లు పగులుతున్నాయి. ఇంజిన్ వేడెక్కి మంటలు రేగుతున్నాయి.

జిల్లా: శ్రీసత్యసాయి ఆర్టీసీ డిపోలు: 6 బస్సులు: 272

అద్దె బస్సులు: 119

పదేళ్లు దాటిన సర్వీసులు: 66

## మట్టిమేల్ తలపెట్టండి

ఎమ్మిగనూరు : సాగులో పెట్టుబడి తగ్గించి అధిక ఉత్పత్తుల సాధనకు మట్టి పరీక్షలు కీలకం. వైకాపా హయాంలో వీటిని విస్మరించగా.. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత చేపట్టింది. జిల్లాలోని పశ్చిమ మండలాల్లో సేకరించిన వేల మట్టి నమూనాల పరీక్షలు ఇటీవల పూర్తయ్యాయి. ప్రధానమైన కర్బన పదార్థం లోపం అధికంగా ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. రైతులు మేల్కొని గట్టి చర్యలు చేపట్టకపోతే నేల నిస్సారంగా మారి పంటలు పండని దుస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే భూమిలో సమతుల్యత లోపించి చీడపీడలు విజృంభించి పంటను దెబ్బతీస్తున్న పరిస్థితి.

**12,281 మట్టి నమూనాల పరీక్ష**

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, ఆస్పరి, పెద్దకడబూరు, ఆలూరు, హోళగుంద, చిప్పగిరి, ఆదోని, కౌతాళం, కోసిగి మండలాల్లో 2025-26లో సేకరించిన 12,281 మట్టి నమూనాలను మృత్తిక భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షించారు. వాటి ఫలితాలను ఆన్‌లైన్ చేసి రైతులకు వాటి ఫలితాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు.

**సేంద్రియ పదార్థం లోపం**

పంటలు పండేందుకు ప్రధానమైన సేంద్రియ పదార్థం 67శాతం నేలల్లో తక్కువగా ఉంది. 32శాతం మధ్యస్థంగా ఉంది. లోపంతో



పోషకాలు వేరు వ్యవస్థకు అందక దిగుబడులు తగ్గుతాయి. సేంద్రియ పదార్థం లోపం కారణంగా పంటపై ప్రభావం అధికంగా ఉంటోంది. రసాయన ఎరువుల వాడకం తగ్గించి పశువుల ఎరువు, వర్మీకంపోస్టు, గొర్రెలు, మేకలు, కోళ్ల ఎరువు వేసుకుంటే నేలకు సేంద్రియ పదార్థం పెరుగుతుంది. ఇది లోపించడంతో నేల నిస్సారంగా మారి దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. భవిష్యత్తులో పంటలు పండని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే చాలా మంది రైతులు బస్తాల కొద్దీ ఎరువులు కుమ్మరించినా.. దిగుబడులు ఆశాజనకంగా రాక దిగులు చెందుతున్నారు.

**ఫలితాలు ఇలా..**

నేలలో నత్రజని 72శాతం తక్కువగా ఉన్నట్లు ఫలితాల్లో తేలింది. దీంతో మొక్క పెరుగుదల ఉండదు. ఇందుకు యూరియా బదులుగా పచ్చిరొట్ట ఎరువులు నేలలో చల్లి కలియ దున్నడం వల్ల కుళ్లి సేంద్రియ పదార్థం పెరుగుతుంది.

85శాతం నేలల్లో భాస్వరం మధ్యస్థంగా.. 16శాతం నేలల్లో అధికంగా ఉంది. కావాల్సినంత ఉన్నందున కాంప్లెక్స్ ఎరువులు పెద్దగా వేసుకోనకవసరం లేదు. రైతులు మాత్రం విచక్షణారహితంగా డీఏపీ, సింగల్‌సూపర్ ఫాస్ఫేట్ వంటివి వేసి పెట్టుబడులు పెంచుకుంటున్నారు.

నేలలో పొటాష్ 90శాతం అధికంగా ఉంది.

లవణ సాంద్రత సాధారణంగా ఉంది.

సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్న మండలాలు: ఎమ్మిగనూరు, నందవరం, మంత్రాలయం, ఆస్పరి, పెద్దకడబూరు, ఆలూరు, హోళహర్వి, హోళగుంద, చిప్పగిరి, ఆదోని, కౌతాళం, కోసిగి

నత్రజని తక్కువగా ఉన్న మండలాలు: ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, ఆస్పరి, పెద్దకడబూరు, ఆలూరు, హోళహర్వి, చిప్పగిరి, ఆదోని, కౌతాళం, కోసిగి. హోళగుంద మండలంలో మధ్యస్థంగా ఉంది. పీహెచ్(ఉదజని సూచిక): ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెద్దకడబూరు, హోళగుంద, చిప్పగిరి, ఆదోని, కోసిగి మండలాల్లో తటస్థంగా ఉంది. నందవరం, ఆస్పరి, ఆలూరు, హోళహర్వి, కౌతాళం మండలాల్లో మధ్యస్థంగా ఉంది.

భూసార పరీక్షలు తప్పనిసరి

ముందు మట్టి పరీక్షలు చేయించుకొని అందుకు అనుగుణంగా రైతులు ఎరువులు వేసుకోవాలి. లేదంటే పెట్టుబడి పెరిగి దిగుబడులు ఆశించినంత రావు. 12వేల మట్టి నమూనాలు పరీక్షిస్తే.. ప్రధానమైన సేంద్రియ పదార్థం లోపం అధికంగా ఉన్నట్లు తేలింది. పొటాష్ ఎక్కువగా ఉంది. లోపం ఉన్న ఎరువుల వేసుకుంటే చాలు. రైతులు ఏడాది పొడవునా మట్టిని తెచ్చుకొని పరీక్షలు చేయించుకోవచ్చు. ఇతర వివరాలకు 83310 57570 నంబరును సంప్రదించవచ్చు.

అశోక్‌వర్ధన్‌రెడ్డి, ఏడీఏ, భూసార పరీక్ష కేంద్రం

## రాయితీ ధర ఖరారయ్యేదెన్నడో..?

పుత్తూరు: ఉమ్మడి జిల్లాలో వేరుశెనగ సాగు: 56 వేల హెక్టార్లు ఒక్క పుత్తూరు, నగరి వ్యవసాయ డివిజన్ పరిధిలోనే 10వేల హెక్టార్లు సాగవుతుంది..

చిత్తూరు, తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో రబీలో వేరుసెనగ విత్తనాలు రైతులు విత్తుతారు.రాష్ట్ర ప్రభుత్వం ఏటా రైతులకు రాయితీ వేరుసెనగ విత్తనాలు అందిస్తోంది.. పెద్దరైతులు అనంతపురం, కడపకు వెళ్లి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వ



హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఒక్కో రైతుకు 30 కేజీల బస్తాలు రెండు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు.. ఈ ఏడాది విత్తన ధర ఖరారు కాక రైతులు అసలు పంపిణీ ఎప్పుడు మొదలు పెడతారోనని ఆందోళన చెందుతున్నారు. **నవంబరు 14 వచ్చినా..**

రబీలో వేరుసెనగ విత్తనాలు డిసెంబరు 15లోగా విత్తాలి. రైతులు సైతం నవంబరులోనే దుక్కులు సిద్ధం చేసుకుంటారు. వాతావరణశాఖ సూచనలు, వర్షాల ఆగమనాలను బట్టి విత్తనాలు వేస్తుంటారు. ఈ నేపథ్యంలో నవంబరు మొదటి వారంలోనే విత్తనాలు ప్రభుత్వం పంపిణీ చేసేది. ఈ ఏడాది ఇప్పటివరకు ఆ ఊసే లేదు. ధర ఖరారు కాలేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతుండటం గమనార్హం. ప్రస్తుతం బహిరంగ విపణిలో 40 కిలోల బస్తా రూ.3,600 నుంచి రూ.4వేలు పలుకుతోంది. వేరుసెనగ ఒబ్బిడి సమయంలో అమ్మలంటే అంత ధర దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. ధర నిర్ణయించిన వెంటనే అందిస్తా వేరుసెనగ విత్తనాలు రాయితీ ధర ఖరారు అయిన వెంటనే పంపిణీ చేస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. గతంలో కంటే 10 రోజులు ఆలస్యమవుతుంది. - విజయ్‌కుమార్, ఇన్‌ఛార్జి ఏడీఏ, పుత్తూరు

చురకలు



# ఇంటిపై టోల్‌బండ

నందికొట్కూరు : నాపరాయి గనుల్లో నుంచి వాహనాల్లో తరలించే గోడ రాయి, ఫ్లోరింగ్ రాయి, గ్రావెల్‌కు టోల్ వసూలు చేస్తున్నారు. టోల్ గేట్ల వద్ద బిల్లుల రూపంలో కాకుండా గనుల శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలన్న నిబంధన పెట్టారు. ఫలితంగా వాహనదారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని నాగలూటి, పీరుసాహెబ్‌పేట,



దామగట్ల, నాగటూరు గ్రామాల పరిధిలో పెద్దఎత్తున నాపరాయి గనులున్నాయి. వీటిల్లో ప్రతిరోజూ తవ్వకాలు సాగుతుంటాయి. కాగా తవ్వకాలు జరిగిన తర్వాత వ్యర్థాలు ఉత్పత్తవుతుంటాయి. ఆయా ప్రాంతాల నుంచి నందికొట్కూరుకు గ్రావెల్ తరలించాలంటే ట్రాక్టరు రూ. 1,200 (దూరాన్ని బట్టి పెరుగుతుంది), గోడరాయి రూ. 2,200, ఫ్లోరింగ్ రాయికి రూ. 1,200 నుంచి రూ. 1,800 వరకు ధర ఉంటుంది.

# తప్పని మోత

కర్నూలు : ప్రస్తుతం గ్రావెల్‌కు టన్నుకు రూ. 90, గోడరాయి రూ. 190, ఫ్లోరింగ్ రాయికి రూ. 240 కేటాయించారు. వినియోగదారుడికి సంబంధించి రెండు, మూడు వాహనాలకు మాత్రమే స్థానికంగా అనుమతులిస్తున్నారు. ఎక్కువ వాహనాల్లో తరలించాలంటే గనుల శాఖలో ముందస్తుగా డబ్బులు చెల్లించి రసీదు తీసుకోవాల్సి వస్తోంది. టోల్‌గేట్ వసూలు నేపథ్యంలో గ్రావెల్‌పై (టన్నులను బట్టి) రూ. 700, గోడరాయి రూ. 1,200, ఫ్లోరింగ్ రాయి రూ. 1,500 వరకు వినియోగదారుడిపై అదనపు భారం పడుతుంది.

**గతంలో ఉచితంగా..**

గతంలో గనుల నుంచి గోడరాయి, గ్రావెల్‌ను ఉచితంగా తరలించేవారు. ఫ్లోరింగ్ రాయి ట్రాక్టర్‌కు రూ. 90, లారీలకు సంబంధించి రూ. 500ను గ్రామ పంచాయతీ తరఫున వసూలు చేసేవారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి సుమారు 20 ట్రిప్పుల గోడ రాయి పడుతుంది. వీటికి మొదట నంద్యాల మైనింగ్ కార్యాలయానికి వెళ్లి అనుమతులు తెచ్చుకోవాలి. ప్రస్తుతం టోల్ గేట్ల ద్వారా వసూలు చేస్తుండడంతో వ్యాపారాలు తగ్గడమేకాక వినియోగదారుడిపై అదనపు భారం పడుతుండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

ట్రాక్టర్, నాపరాయి గనుల యజమానులు, కార్మికులు టోల్‌గేట్ వసూలును వ్యతిరేకిస్తున్నారు. టన్నుల ప్రకారంకాక ట్రాక్టరు, లారీల ప్రకారం వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బేతంచెర్ల రాయి కంటే స్థానిక గనుల్లో వచ్చే నాపరాయి గట్టితనం కావడంతో ఇక్కడి నుంచి రాజస్థాన్, తెలంగాణ ప్రాంతాలకు అధికంగా పాలిష్ చేసిన ఫ్లోరింగ్ రాయిని ఎగుమతి చేస్తుంటారు. వీటికి డిమాండ్ పెరగడంతో పాలిష్ కటింగ్ యంత్రాలు సైతం పెరిగిపోయాయి.

అదనపు భారం – తమిదెల ఉషారాణి, నాగలూటి సర్పంచి

టోల్ వసూలుతో వినియోగదారుడిపై అదనపు భారం పడుతుంది. వ్యాపారాలు తగ్గుతాయి. కార్మికులకు జీవనం కష్టంగా మారింది. గనుల నుంచి గోడరాయికి వినియోగదారుడు చెల్లించే డబ్బులతో యజమానికి సంబంధం ఉండదు. కార్మికులు తీసుకుంటారు. గనుల్లో బండ పరుపులో మొదట గోడరాయిని తొలగిస్తేనే ఫ్లోరింగ్‌కు సంబంధించిన రాయి వస్తుంది. గతంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో టోల్ వసూలు చేసేవారు. 20 ఏళ్లుగా వసూలు నిలిపేశారు. ప్రస్తుతం టోల్‌గేట్ ఛార్జీలు అదనపు భారంగా మారాయి.

# దత్తత.. చట్టబద్ధత

చిత్తూరు : పుట్టగానే తల్లిదండ్రులను కోల్పోయిన వారు.. ఉన్నా ఆదరణ నోచకోక.. పొదల్లో పడేసిన వారు.. ఇలా ఎంతో మంది చిన్నారులు అనాథలుగా మిగులుతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం శిశు విహార్ కేంద్రాలను నిర్వహిస్తోంది. ఇక్కడ వసతి పొందుతున్న చిన్నారులను దత్తత ఇస్తున్నారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు ఇదో వరం. దీనిపై అవగాహన లేమితో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో అతి తక్కువ మందే ఇప్పటివరకు దత్తత వెళ్లడం ఈ విషయాన్ని స్పష్టంచేస్తోంది.

**రెండు చోట్ల..** తిరుపతి, చిత్తూరు జిల్లా కేంద్రాల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిశువిహార్ కేంద్రాలు కొనసాగుతున్నాయి. చిత్తూరు జిల్లా సచివాలయం సమీపంలో ఉన్న కేంద్రంలో ఆరేళ్లలోపు చిన్నారులు 10 మంది ఉన్నారు. వీరిలో ఏడుగురు బాలికలు, ముగ్గురు బాలురు ఉన్నారు.

**అర్హతలు ఇవే..** దత్తత తీసుకునే వారు శారీరక దృఢత్వంతో, మానసిక జాగరూకతతో బిడ్డను తీర్చిదిద్దే ప్రేరణ ఉన్న వారై ఉండాలి. దంపతులిద్దరి అంగీకారం తప్పనిసరి. నిబంధనల ప్రకారం, ప్రమాణాలు అన్ని నెరవేర్చిన తర్వాత ఒంటరి లేదా విడాకుల పొందిన వ్యక్తి కూడా తీసుకోవచ్చు. ఒంటరిగా నివసించే మగ వ్యక్తి బాలికను దత్తత తీసుకునేందుకు అనర్హుడు.

**ఆసక్తి ఉంటే..**

పిల్లలను దత్తత తీసుకో వడంపై ఆసక్తి ఉంటే అంగన్‌వాడీ కేంద్రం, ఐసీడీఎస్, జిల్లా బాలల సంరక్షణ అధికారి కార్యాలయంలో సంప్రదించాలి. వెబ్‌సైట్: %www.cara.nic.in

రెండు రకాలుగా..ప్రభుత్వం దత్తత ప్రక్రియలో మార్పులు తీసుకొచ్చింది. తాజాగా పోస్టర్ కేర్, పోస్టర్ అడాప్షన్ విధానాల అమలుకు శ్రీకారం చుట్టింది. పోస్టర్‌కేర్‌లో భాగంగా చిన్నారులను రెండేళ్ల పాటు దత్తత ఇస్తారు. ఈ కాలంలో సంరక్షకులకు ప్రతి నెలా రూ. 4 వేలు ప్రభుత్వం అందిస్తుంది. హోమ్ స్టడీ కమిటీ సభ్యులు 30 రోజుల అనంతరం సంరక్షణ తీరును పరిశీలిస్తారు. రెండేళ్ల పాటు చిన్నారుల బాగోగులు చూసుకునే తల్లిదండ్రులకు వారిపై ప్రేమ పెరిగితే శాశ్వతంగా పోస్టర్ అడాప్షన్ కింద దత్తత తీసుకోవచ్చు.

**ఊయల ఏర్పాటు** పిల్లలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా జిల్లాల్లో పలు చోట్ల ఊయలలు ఏర్పాటుచేశారు. శిశుగృహ కేంద్రం (ఎం.ఆర్.పల్లి, తిరుపతి), చంద్రగిరి (పంచముఖ ఆంజనేయస్వామి గుడి), తిరుపతిలోని ఆర్టీసీ, అలిపిరి బస్టాండ్లు, పిచ్చాటూరు బస్టాండు, పీహెచ్‌సీలు – చెన్నూరు, వరగలి, చిల్లకూరు, చింతవరం.

శిశువిహార్‌లో అప్పగించండి : వసంతబాయి, ఐసీడీఎస్ పీడీ, తిరుపతి

పిల్లలను వద్దనుకుంటే శిశువిహార్ కేంద్రాల్లో అప్పగించవచ్చు.

# దుకాణం.. పెట్టుబడిలేని వ్యాపారం



అమలాపురం : అమలాపురం పురపాలక సంఘం పరిధిలోని వ్యాపార సముదాయాలు, దుకాణాల ద్వారా వచ్చే ఆదాయాన్ని కొంత మంది కొల్లగొడుతూ జేబులు నింపుకొంటున్నారు. దీంతో పురపాలికకు రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. దుకాణాలను బహిరంగ వేలం ద్వారా ఎక్కువ మొత్తంలో పాడిన వారికి కేటాయిస్తారు. కొందరు రంగప్రవేశం చేసి పోటీ లేకుండా చేస్తున్నారు. అధికారులు సూచించిన మొత్తంపై కేవలం రూ. 500 నుంచి రూ. వెయ్యి వరకు పెంచి దక్కించుకుంటున్నారు. ఒక్కోసారి ఎవరూ వేలంలో పాల్గొనకుండా చేస్తున్నారు. తర్వాత సీల్డ్ టెండర్ విధానంలో అంతా ఒక్కటై తక్కువకు దక్కించుకుంటున్నారు. అనధికారిక వేలం నిర్వహించి బయటి వ్యక్తులకు ఎక్కువ మొత్తానికి అప్పగిస్తున్నారు.

**కళ్లెదుటే కనిపిస్తున్నా..**

పురపాలక సంఘం పరిధిలో నాలుగు షాపింగ్ కాంప్లెక్స్‌లలో 104 దుకాణాలు ఉన్నాయి. అద్దె రూపంలో ఏడాదికి రూ. కోటి ఆదాయం వస్తోంది. సబ్‌లీజుకు తీసుకుంటున్న వ్యక్తులు రూ. 1.50 కోట్లు చెల్లిస్తున్నట్లు అంచనా. ఏడాదికి రూ. 50 లక్షలు పక్కదారి పడుతున్నాయి. పురపాలక కమిషన్ నిర్మల్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. దుకాణాలను నిబంధనల ప్రకారమే కేటాయిస్తున్నామన్నారు. సబ్‌లీజు గురించి తెలిసినా నిబంధనల ప్రకారం వారిపై చర్యలు తీసుకోలేకపోతున్నామని పేర్కొన్నారు.

అమలాపురం పురపాలక సంఘానికి చెందిన పెద్ద దుకాణాన్ని నెలకు రూ. 78వేలకు ఓ గుత్తేదారులు టెండర్ ద్వారా దక్కించుకున్నాడు. తర్వాత అతను దానిని ఓ కార్పొరేట్ సంస్థకు నెలకు రూ. లక్ష చొప్పున సబ్‌లీజుకు అప్పగించాడు.

సర్క్యులర్ బజారులోని కాప్లెంక్స్‌లో పురపాలక సంఘం నిర్వహించిన వేలంలో దుకాణాలు దక్కించుకున్న వారు అధిక అద్దెలకు సబ్‌లీజ్‌కు ఇచ్చారు. మార్కెట్ పరిధిలోని కాంప్లెక్స్‌లోనూ ఇదే తంతు. అమలాపురం మున్సిపాల్టీకి చెందిన పలు దుకాణాలు కొందరు నేతల చేతుల్లో ఉన్నాయి. వారు ఇతరులకు అధిక ధరకు అద్దెకు ఇచ్చి లాభం పొందుతున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లు: 4

దుకాణాలు: 104

ఏడాదికి అద్దె: రూ. కోటి(సుమారు)

సబ్‌లీజుకు ఇచ్చేవారు చెల్లించేది: రూ. 1.59 కోట్లు(అంచనా)

రిజర్వేషన్ వారీగా దుకాణాల కేటాయింపు(శాతంలో..)

ఎస్సీ: 15

ఎస్టీ: 8

దివ్యాంగులు: 3

# తినగ.. తినగ.. తేడాగా ఉండు!



కాకినాడ: తెల్లనివన్ని పాలు కావు.. నల్లనివన్ని నీళ్లు కావు.. కాదేదీ కల్తీలకు అనర్హమంటూ ఉప్పు, పప్పు నుంచి పండ్లు, మిఠాయిల వరకు అన్నింటా ఇదే దుస్థితి. కృత్రిమ రంగులతో పోషకాహారాన్ని కల్తీమయం చేసి వినియోగదారుల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. కాకినాడ జిల్లాలో గత ఏడాది కాలంలో పరీక్షించిన నమూనాల్లో 30 శాతం పైగా కల్తీలేనని తేలడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో వేల సంఖ్యలో చిన్న, పెద్ద వ్యాపార, వాణిజ్య సంస్థలు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు ఉన్నాయి. ఏటా కొన్నింటే ఆహార భద్రతా అధికారులు తనిఖీలు చేపట్టి నమూనాలు పరీక్షిస్తున్నారు. ప్రమాణాలను పాటించనివారు కొందరైతే.. హానికలిగించే స్థాయిలో కల్తీకి పాల్పడుతున్నవారు ఇంకొందరు. ఆహార భద్రతా విభాగంలో సిబ్బంది కొరత కొందరికి కలిసివస్తోంది. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో చాలావరకు సింథటిక్ కలర్లు, అనుమతించని రంగులు వినియోగిస్తున్నారు. వీటిని అదేపనిగా తింటే మూత్రపిండాలు, కిడ్నీలు త్వరగా పాడవతాయని వైద్యులు చెబుతున్నారు.

**ఇవిగో కొన్ని ఉదంతాలు..**

కాకినాడలోని ప్రతాప్‌నగర్‌లో పది నెలల క్రితం పాలను కల్తీ చేసి వాటితో పెరుగు తయారుచేసి హోటళ్లకు కుండలతో సరఫరా చేయడాన్ని గుర్తించి పట్టుకున్నారు. ఆ కుండలు సైతం బూజు పట్టేశాయి. ఇటీవల తునిలో పశువుల కొవ్వు నుంచి నూనె తయారీ కోసం డబ్బాల్లో కొవ్వును నింపి ఉంచగా పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. వాటిని సబ్బుల తయారీకి పంపిస్తున్నామని చెబుతున్నా నకిలీ నూనె తయారీలోనే వాడుతారని స్థానికులు ఆరోపించారు.

నగరంలోని పెదమార్కెట్‌లో చిలగడ దుంపలకు ఎర్రటి రంగులు వేసి అమ్మకాలు చేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. హోల్‌సేల్ వర్తకులే ఇలా పంపించారని చెప్పి ఆ వ్యాపారులు తప్పించుకున్నారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం**

ఆహార కల్తీ తీవ్రతను బట్టి గరిష్ఠంగా రూ. లక్ష జరిమానా, ఆరు నెలల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే కేసులు నమోదు చేస్తాం. ఆహార పరిరక్షణ, ప్రమాణాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఏడాది కాలంలో 11 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం.

నందాజీ, సహాయ నియంత్రణాధికారి, ఆహార భద్రతా, ప్రమాణాలశాఖ

గత ఏడాది కాలంలో పరిశీలించిన నమూనాలు: 216

ప్రమాణాలకు అనుగుణంగా లేని ఉత్పత్తులు: 23

కల్తీ నిర్ధారణ జరిగినవి : 34

నమోదైన క్రిమినల్ కేసులు: 11

# ఆందోళన వీడు.. సఖి నీ తోడు

కాకినాడ : తల్లిదండ్రులు తిట్టారని క్షణికావేశంలో ఇంటి నుంచి కొంతమంది బాలికలు ఎవరికీ చెప్పకుండా వచ్చేస్తున్నారు. మహిళలు సైతం కొన్ని పరిస్థితుల్లో బయటకు వస్తున్నారు. తప్పిపోయిన, మతిస్థిమితం లేని, కిడ్నాప్ అయిన వారు ఉంటున్నారు. వీరు అసాంఘిక శక్తుల బారిన పడుతున్న సందర్భాలున్నాయి. అలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా బాధితులకు అండగా నిలుస్తోంది కాకినాడలోని సఖి వన్‌స్టాప్ సెంటర్. ఇక్కడ వారికి తాత్కాలిక వసతి అందిస్తున్నారు. అనారోగ్య, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్స చేయిస్తున్నారు. తర్వాత కుటుంబసభ్యులకు అప్పగిస్తున్నారు. ఎవరూ లేని వారైతే స్థానికంగా ఉన్న వసతిగృహాలకు పంపిస్తారు. కాకినాడ జీజీహెచ్‌లో 2017 ఆగస్టులో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ సెంటర్‌లో మొత్తం 14 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారు.

బాలికలు, స్త్రీలపై జరిగే హింసను ఆపుదాం, వారికి అండగా ఉందాం అంటూ ఉద్యోగులు అవగాహన కల్పిస్తున్నారు.

**ఇవీ సేవలు...** ఇక్కడ బాధితులకు వీడియో కాన్ఫరెన్సు సౌకర్యం, పోలీసు రక్షణ, ప్రాసిక్యూషన్, వైద్య, న్యాయ సహాయం, ఎఫ్ఐఆర్ నమోదుకు సహకారం, ఆహారం, కౌన్సెలింగ్ చికిత్స, తాత్కాలిక వసతి, పునరావాసం, పిల్లల స్నేహ పూర్వక కోర్టు, అత్యవసర స్పందన వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి.

**వారికి మద్దతుగా..** కుటుంబం, సమాజం, పనిస్థలాల్లో ప్రైవేటు, పబ్లిక్ ప్రదేశాల్లో హింసకు గురైన మహిళలు, బాలికలకు సమగ్ర మద్దతు ఇస్తాం. బాధితులకు 10 రోజుల పాటు తాత్కాలిక వసతి కల్పిస్తాం. మానసిక, సామాజిక సహాయం, కౌన్సెలింగ్, చట్టపరమైన సలహాలు,




తాత్కాలిక ఆశ్రయం, ఆహారం కల్పిస్తాం. తర్వాత కుటుంబసభ్యుల వద్దకు లేదా వసతిగృహాలకు పంపిస్తాం. శైలజ, అడ్మిన్, సఖి వన్‌స్టాప్ సెంటర్ సహాయానికి సంప్రదించాల్సిన నంబర్లు

టోల్ ఫ్రీ – 181

చైల్డ్ హెల్ప్‌లైన్ – 1098

అత్యవసరం – 100, 112

సఖి సెంటర్ – 08842380181

2017 నుంచి ఇప్పటివరకు సేవలు పొందిన బాధితులు

గృహహింస: 551అత్యాచారం: 389 లైంగిక వేధింపులు: 66

యాసిడ్ దాడి–2 మహిళల అక్రమ రవాణా– 39

పిల్లలపై లైంగిక వేధింపులు–17 బాల్య వివాహాలు– 60 తప్పిపోయిన వారు– 163 కట్నవేధింపులు–3 ఇతర కేసులు 633

# గురుకులం.. అవస్థలమయం

డోన్ : పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం గురుకుల పాఠశాలలను నిర్వహిస్తోంది. కానీ అందుకు తగ్గట్లు సౌకర్యాలు కల్పించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. డోన్‌లో రెండేళ్ల క్రితం డా. బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సొంత భవనం లేకపోవడంతో పట్టణ శివారులోని క్రీడా వికాస కేంద్రంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. భవన నిర్మాణానికి సంబంధించి స్థలాల పరిశీలనతోనే అధికారులు కాలయాపన చేస్తున్నారు తప్ప విద్యార్థుల ఇక్కట్లను పట్టించుకోవడం లేదు.

**వైకాపా హయాంలో నిర్లక్ష్యం**

డోన్ పట్టణంలో డా. బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు 280 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గురుకులం ఏర్పాటై రెండేళ్లు గడుస్తున్నా సొంత భవనాలు లేవు. దీంతో గురుకుల పాఠశాల నిర్వహణను డోన్ పట్టణాని



కి 3 కి.మీ. దూరంలోని క్రీడా ప్రాంగణ భవనాల్లో సాగిస్తున్నారు. ఇక్కడ 15 ఏళ్ల క్రితమే పదెకరాల స్థలంలో స్టేడియం ఏర్పాటుకు అవసరమైన పెవిలియన్ భవనం, ఇండోర్ స్టేడియం, దుకాణ సముదాయాలతో పాటు పలు భవనాలు నిర్మించారు.

ఐదేళ్ల క్రితం వరకు ఇక్కడ క్రీడా సౌకర్యాలు ఉండటంతో పలు మండలాల క్రీడాకారులు వసతితో పాటు శిక్షణ పొందేవారు. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా క్రీడా ప్రాంగణ నిర్వహణ లోపించింది. క్రీడా పరికరాలు మంజూరు కాకపోవడం, శిక్షణ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి.

# స్మార్ట్ పేరుతో స్వాహా

రాజమహేంద్రవరం : దిల్లీ జనపథ్ తరహాలో నగరపాలికలు, పురపాలికల్లో రహదారులు నిర్మించేందుకు కేంద్రం గతంలో నిధులు కేటాయించింది. అందులో భాగంగా రాజమహేంద్రవరానికి రూ. 6కోట్లు కేటాయించారు. ఈ మొత్తంతో గత ప్రభుత్వ పాలనలో రాజమహేంద్రవరంలోని వై–జంక్షన్ నుంచి లాలాచెరువు వరకు స్మార్ట్‌రోడ్డు నిర్మించారు. గ్రాండ్ ట్రంక్ రోడ్డు అని పేరు పెట్టి గొప్పగా ప్రచారం చేశారు. తీరా ఆ రోడ్డు అత్యంత దయనీయంగా మారింది. స్మార్ట్ రోడ్డు పేరుతో నిధుల విషయంలో గోల్‌మాల్ జరిగిందనే విమర్శలు ఉన్నాయి. నిబంధనలు గాలికి వదిలేసి గత ప్రభుత్వ నేతలు, గుత్తేదారులు జేబులు నింపుకొన్నారనే వాదన ఉంది.

**నిబంధనలకు నీళ్లు..**

నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనాలకు, సైకిళ్లకు ప్రత్యేకంగా రోడ్డు కేటాయించాలి. మధ్యలో పచ్చదనం పెంచేలా ఏర్పాటు చేయాలి. ఉదయం, సాయంత్రం నడకకు అనుకూలంగా సదుపాయాలు కల్పించాలి. ఇక్కడ మాత్రం అవేమీ జరగలేదు. తూతూమంత్రంగా వేసిన బ్రిక్స్ దిగబడ్డాయి. రోడ్డును ఆనుకుని అటానమస్ కళాశాల వరకూ అక్కడక్కడ మొక్కలు నాటి వదిలేశారు. కేంద్రం నిధులతో పాటు అదనంగా సాధారణ, ఆర్థిక సంఘం నుంచి రూ. 4 కోట్లు కేటాయించారు. వీటితో అలంకరణ, లైటింగ్ వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ వర్షం పడితే నీరు రహదారిపైనే నిలిచిపోతుంది. వాటర్ ఫౌంటేన్ కూడా పనిచేయట్లేదు. రూ. 10 కోట్లు కుమ్మరించి కనీస ప్రణాళిక లేకుండా నిర్మించారనే విమర్శలు ఉన్నాయి.

**విచారణకు డిమాండ్..**



గత పాలనలో నగరంలో ఎండ్ టు ఎండ్ రహదారుల పేరుతో రూ. 7 కోట్లతో పలు మార్గాల్లో 28 కి.మీ. మేర బ్రిక్స్ వేశారు. వాస్తవానికి రహదారి చివర 5 అడుగులు కేటాయించి అందులో గడ్డి, మొక్కలు పెంచాలి. దీంతో వాహనాల ఒత్తిడిని మొక్కలు తట్టుకుంటాయి. అవేమీ పట్టించుకోకుండా సార్వత్రిక ఎన్నికల ముందు హడావుడిగా కానిచ్చేశారు. ఇసుక, కంకర వేసి టైల్స్ వేయాల్సి ఉండగా ఇసుకే ఉపయోగించారు. వర్షాలకు ఇవన్నీ ఊడిపోయాయి. నామమాత్రపు పనులతో రూ. కోట్ల ధనం వృథా అయ్యింది. దీనిపై విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వాటిని చక్కదిద్ది, సుందరంగా తీర్చిదిద్దాలని నగరవాసులు కోరుతున్నారు.

# చూసేవారులేరని.. మేసేస్తున్నారు..!

పి.గన్నవరం : జిల్లాలో ఇసుక, మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. కొత్తపేట, మండపేట నియోజకవర్గాల్లోనే అధికారిక ఇసుక ర్యాంపులు ఉన్నాయి. ఇతర ప్రాంతాల్లో ఇసుక తవ్వేందుకు అనుమతులు లేవు. రాజకీయ బలంతో అక్రమార్కులు యథేచ్ఛగా తరలించేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి వరద కనిష్ఠస్థాయికి చేరడంతో అధికారిక ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్రమార్కులు సైతం తవ్వకాలకు సిద్ధమవుతున్నారు. పి.గన్నవరం మండలం ఊడుమూడిలంకలో వశిష్ఠ గోదావరి నదీతీరంలో వందల టిప్పర్లతో బాహాటంగా ఇసుక తరలించి జి.పెదపూడి, చాకలిపాలెంవద్ద అనధికారికంగా స్టాకు పాయింట్లు పెట్టారు. దీనిపై అప్పట్లో ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

విజయవాడ కేంద్రంగా..నెలరోజుల క్రితం నుంచే విజయవాడను కేంద్రంగా చేసుకుని పావులు కదుపుతున్నారు. లంకమట్టిని తరలించేందుకు తాత్కాలిక పర్మిట్లు ఇవ్వాలని కీలకశాఖ అధికారులను ఇప్పటికే సంప్రదించారు. దీనిపై ఆ శాఖ అధికారులు ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోలేదు.

తక్కువ సిబ్బంది..గనులశాఖలో సిబ్బంది కొరత ఉంది. సహాయ సంచాలకుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, కార్యాలయ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్, క్షేత్రస్థాయిలో ఎ.డి, ఆర్.ఐ, సర్వేయర్ మాత్రమే ఉన్నారు.

నోటీసులు ఇచ్చినా...వరదల సీజన్‌కు ముందు జిల్లాలో 65,670 క్యూబిక్ మీటర్లమేర వనరులు అక్రమంగా తరలించారు. రూ. 3.35 కోట్లు అపరాధరుసుం చెల్లించాలని 18 కేసుల్లో పలువురికి నోటీసులు పంపించినా స్పందన లేదు.

ప్రత్యేక బృందానికి ప్రతిపాదనఅక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు అసిస్టెంట్ జియాలజిస్ట్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్‌తో కూడిన అదనపు బృందాన్ని నియమించాలని ప్రతిపాదించనున్నట్లు జిల్లా గనులశాఖ ఏడీ ఎల్. వంశీధరరెడ్డి తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారికి నోటీసులు ఇచ్చామన్నారు.

## లెక్కల్లో తేడాలు.. పౌష్టికారహారం అందక చిక్కులు

అనంతపురం : జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధి లోని లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారంలో మతలబు నెలకొంది. వారం రోజుల్లో అక్టోబరు నెల ముగియనున్నా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందని ద్రాక్షలా మారింది. నిర్దేశిత ఇండెంట్ను దాదాపు సరఫరా చేసినట్లు 'ఆన్‌లైన్' లెక్కలు చెబుతున్నా.. అంగన్‌వాడీ కేంద్రాలకు అదే సంఖ్యలో చేరకపోవడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. సదరు శాఖలో ప్రతి నెలా కోడిగుడ్లు, పాలు, బాల సంజీవని కిట్లు, బాలామృతం, బియ్యం, కందిపప్పు, వంటనూనె.. తదితర పౌష్టికాహారం పంపిణీ ప్రక్రియ అత్యంత కీలకం. మూడు వారాలు గడిచినా అత్యధిక శాతం లబ్ధిదారులకు సదరు పౌష్టికాహారం అందకపోవడం గమనార్హం.

**పంపిణీ తీరు..**

**మూడు సరుకులు:** జిల్లాలో గర్భిణి, బాలింతలు 23,275 మంది ఉన్నట్లు చూపిస్తున్నారు. బియ్యం 3 కిలోలు, కిలో కందిపప్పు, వంట నూనె ప్యాకెట్లను అదే సంఖ్యలో పంపాలి. ఇప్పటికీ జిల్లా అంతటా 72 శాతమే పంపిణీ నమోదైంది.

**బాలామృతం:** 3ఏళ్లలోపు పిల్లలకు బాలామృతం ఇవ్వాలి. 64,475 ప్యాకెట్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటికీ కంబదూరు, కణేకల్లు, తాడిపత్రి, ఉరవకొండ ప్రాజెక్టుల పరిధిలోని కేంద్రాలకు పూర్తిగా చేరలేదు. కొన్ని చోట్ల చేరినా పిల్లలకు ఇవ్వలేదు.

**బాలసంజీవని కిట్లు:** గర్భిణి, బాలింతలకు 23,175 కిట్లు పంపిణీ



జరగాలి. 68 శాతం సరఫరా చేసినట్లు ఆన్‌లైన్ లెక్క చెబుతోంది. ఉరవకొండలో 28 శాతం, అనంత అర్బన్‌లో 37, తాడిపత్రి, అనంత గ్రామీణం, రాయదుర్గం, గుత్తి ప్రాజెక్టుల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

**పాలు:** జిల్లాంతటా 3.98 లక్షల లీటర్లు సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటి దాకా 74 శాతమే అయింది. తాడిపత్రి, కణేకల్లు, గుతఇత, ఉరవకొండ, అనంత అర్బన్, గ్రామీణం, నార్పల, శింగనమల ప్రాజెక్టుల్లో నిర్దేశించిన మేర పాలు అందలేదు.

**కోడిగుడ్లు:** ప్రతి నెలా నాలుగు విడతల్లో గుడ్లను కేంద్రాలకు చేర్చాలి. ప్రస్తుతం నాల్గో విడత సరఫరా జరగాలి. తొలి విడతలో 14.12లక్షల గుడ్లను సరఫరా చేయాల్సి ఉండగా.. ఇప్పటికీ తాడిపత్రి, అనంత అర్బన్, నార్పలకు ఇవ్వలేదు. రెండు, మూడో విడతలోనూ అంతే. మూడో విడత కింద 12.75లక్షల గుడ్లకు 73 శాతమే ఇచ్చారు. నాలుగో విడత కింద 22 శాతమే సరఫరా జరిగింది.

**కిట్లు ఏవీ?**

అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణి, బాలింత, 3 ఏళ్లలోపు చిన్నారులకు ప్రతి నెలా మొదటి వారంలోనే ఇంటింటా సరకుల పంపిణీ చేయాలి. 3 నుంచి 6ఏళ్లలోపు పిల్లలకు కేంద్రాల్లోనే మధ్యాహ్నం వంట చేసి వడ్డించాలి. పౌర సరఫరాల శాఖలో తలెత్తిన సాంకేతిక సమస్య మూలంగా అంగన్‌వాడీల వేలిముద్రలు నమోదు కాలేదు. దీంతో బియ్యం, కందిపప్పు, నూనె పంపిణీలో జాప్యమైంది. మిగతా పాలు, గుడ్లు, కిట్లు, బాలామృతం.. పౌష్టికాహారం సైతం చాలా కేంద్రాలకు అందలేదు.

## ఉపాధికి ఊతం.. స్వచ్ఛతకు మార్గం

ఉరవకొండ: వ్యర్థాలు వృథాగా పడేయకుండా ఇంటివద్దే వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేసుకుని ఆదాయం పొందే మార్గానికి కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. తద్వారా గ్రామాల్లో స్వచ్ఛత నెలకొనడంతోపాటు ఉపాధి కూలీలకు లబ్ధి చేకూరనుంది. ఇళ్ల ముందు, పశువుల పాకల వద్ద ఉపాధి హామీ పథకంలో గుంతలు తవ్వుకునేలా జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే తగు చర్యలకు శ్రీకారం చుట్టింది.

**రెండు విధాలా ఆదాయం..**

జిల్లాలోని 31 మండలాల్లో 1,04,040 కంపోస్టు గుంతలు తవ్వించాలనేది ప్రభుత్వ లక్ష్యం. డ్వామా అధికారులు మొదటి విడతలో జిల్లాలో 2,911 గుంతలు మంజూరు చేయగా.. 982 మంది గుంతల తవ్వకాలు పూర్తిచేసుకున్నారు. ఉపాధి కార్డు కలిగిన కుటుంబ సభ్యులు స్వయంగా తవ్వకాలు చేసుకుని రూ.1600, పశువుల పాక వద్ద తవ్వుకున్న వారు రూ.800 వేతనం తీసుకోవడం గమనార్హం. దీనివల్ల ఉపాధి హామీ పథకంలో 'కూలి'తోపాటు కంపోస్టు ఎరువును



అమ్ముకోవడం వల్ల కూడా లబ్ధి పొందవచ్చు.

**మూడు నెలల్లో ఎరువు తయారీ**

ఇళ్ల వద్ద రింగ్ రూపంలో ఒక మీటరు లోతు, వెడల్పుతో రెండు గుంతలు, పశువుల పాకల వద్ద అయితే 1.5 మీటరు పొడవు, 1.5 మీటరు వెడల్పు, ఒక మీటరు లోతుతో గుంతను తవ్వుకోవాలి. వీటిల్లో క్రమం తప్పకుండా తడి, పొడి చెత్తలను వేస్తే మూడు నెలల్లో ఎరువు తయారవుతోంది. ఈ ఎరువును అవసరం మేరకు పొలాలు, కిచెన్ గార్డెన్‌కు తరలించుకోవచ్చు. మిగిలితే ఇతరులకు అమ్ముకుంటే ఆదాయం పొందే వీలుంది.

**చైతన్యం తీసుకొస్తాం**

కంపోస్టు గుంతల తవ్వకానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లాకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా తవ్వకాల్లో ముమ్మరంగా చేయిస్తున్నాం. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామాల్లో వివరించాలని ఉపాధి యంత్రాంగాన్ని ఆదేశించాం. ప్రజలు ముందుకొచ్చి గుంతలు తవ్వుకుని తద్వారా స్వచ్ఛతతోపాటు ఉపాధిని పొందాలి. సలీంబాషా, డ్వామా పీడీ

# రేషన్ మాఫియా బరితెగింపు



అనంతపురం : కూడేరు, విడపనకల్లు మండలాల పరిధిలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. గతంలో ఆగిపోయిన అక్రమ రవాణా రెండు నెలలుగా జోరుగా సాగుతోంది.

తాడిపత్రి పరిధిలో స్థానిక నాయకుల కనుసన్నల్లో పేదల బియ్యం తమిళనాడుకు తరలిపోతోంది. ఇంకొందరు బనగానపల్లిలోని మిల్లులకు తరలించి.. పాలిష్ చేసి వివిధ బ్రాండ్ల పేరుతో విక్రయిస్తున్నారు. యల్లనూరు, పుట్లూరు, పామిడి మండలాల్లో కొందరు రాత్రి వేళల్లో రహస్యంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. జాతీయ రహదారి మీదుగా రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

జిల్లాలో పేదల బియ్యం పక్కదారి పడుతోంది. రేషన్ మాఫియా జాతీయ రహదారుల మీదుగానే బియ్యాన్ని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఆయా మార్గాల్లో పోలీసులు.. అక్రమార్కులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నెలవారీగా మామూళ్లు తీసుకుంటూ కొందరు మాఫియాతో చేతులు కలిపారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడపాదడపా విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నా అక్రమ రవాణాకు అడ్డకట్ట పడటం లేదు. అధికారులు, పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే రేషన్ మాఫియా రెచ్చిపోతోందనే అభిప్రాయం వినిపిస్తోంది.

**స్టాక్ పాయింట్ల నుంచే..**

గతంలో కార్డుదారుల నుంచి కిలోకు కొంతమొత్తం చెల్లించి బియ్యాన్ని సేకరించేవారు. ఇప్పుడు మరో అక్రమార్గాన్ని ఎంచుకున్నారు. కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయిన స్థానిక నాయకులు నేరుగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచే బియ్యాన్ని తరలిస్తున్నారు. ఆయా పాయింట్లలో డీలర్లకు బియ్యం సరఫరా చేసే సమయంలో బస్తాకు 2, 3 కిలోలు తగ్గించి ఇస్తున్నారు. దీంతోపాటు కొందరు డీలర్లు తూకాల్లో మోసాలకు పాల్పడుతూ ఒక్కో కార్డుదారుడి నుంచి సగటున 2 కిలోలు దోచుకుంటున్నారు. ఇలా మిగిలిన బియ్యాన్ని ప్రతి నెలా మొదటివారంలో రేషన్ మాఫియాకు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారు.

**తాడిపత్రిలో ఇష్టారాజ్యం**

యాడికి కేంద్రంగా మాఫియా రెచ్చిపోతోంది. తాడిపత్రి, యల్లనూరు, పుట్లూరు, పామిడి, గుత్తి ప్రాంతాల నుంచి సేకరించిన బియ్యాన్ని యాడికిలో డంప్ చేస్తున్నారు. ఇటీవల ఓ మిల్లులో భారీ మొత్తంలో రేషన్‌బియాన్ని అధికారులు పట్టుకున్నారు. తాడిపత్రి పట్టణానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో అక్రమ రవాణా సాగుతోంది. కిలోకు రూ.15 నుంచి రూ.20 వరకు ఇచ్చి బియ్యం సేకరిస్తున్నారు. అధికార పార్టీ కావడంతో పోలీసులు సైతం అడ్డుకునేందుకు ప్రయత్నించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నిఘా పెట్టాం..**

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టాం. అక్రమార్కులపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. మాఫియాకు స్థానికంగా పోలీసులు సహకరిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. ఎవరినీ ఉపేక్షించేది లేదు.
జగదీశ్, ఎస్పీ, అనంతపురం

## వందేళ్ల వేడుక.. చేయాలి ఏర్పాట్లు చకచకా..



పుట్టపర్తి : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు వచ్చే నెలలో జరగనున్నాయి. ప్రముఖులు, దేశ, విదేశాలకు చెందిన భక్తులు పుట్టపర్తికి రానున్నారు. నవంబరు 15 నుంచి 25 వరకు జరగనున్న ఉత్సవాలకు 21 రోజులు మాత్రమే గడువు ఉంది. ఆ దిశగా పాలకులు, అధికారులు దృష్టి సారించి పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

**క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమిటి..**

పుట్టపర్తి పురపాలిక పరిధిలో ప్రశాంతి నిలయం పడమర రహదారి పనులు ప్రారంభించారు. నవంబరు మొదటి వారానికి పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. జాయ్ అలూకాస్ సంస్థ సహకారంతో రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టిన చిత్రావతి నది సుందరీకరణ పనులు సాగుతున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే సంస్థ గుత్తేదారుల సహకారంతో నగర సుందరీకరణ పనులు మరింత వేగం పెంచాల్సి ఉంది. భక్తుల భద్రతకు సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

**చేపట్టాల్సినవి..**

భక్తులు, పర్యాటకులకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో తాత్కాలిక షెడ్లు, స్నానపు ఘట్టాలు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలి.

మూతబడిన సామూహిక మరుగుదొడ్లకు వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది.

పట్టణంలోకి వచ్చే ప్రధాన రహదారులకు గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతులు చేయాలి.

శుద్ధిప్లాంట్ల మోటార్లు సక్రమంగా పనిచేయకపోవడంతో మురుగు చిత్రావతి నదిలోకి కలుస్తోంది. వెంటనే చర్యలు చేపట్టాలి.

**ట్రాఫిక్ క్రమబద్ధీకరణ..**

పుట్టపర్తిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్ ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు.. పార్కింగ్ ప్రాంతాల నుంచి భక్తులు ప్రశాంతినిలయం చేరుకునేలా రవాణా వ్యవస్థకు కార్యాచరణ రూపొందించాల్సి ఉంది. వేడుకల వివరాలు తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయాలి.

## గాడితప్పుతోన్న క్రమశిక్షణ

పుట్టపర్తి : ఈనెల 12న పుట్టపర్తి మండలం కంబాలపర్తి ప్రాథమిక పాఠశాలలో కొందరు విద్యార్థులు కిటికీ తలుపులు ధ్వంసం చేసి.. కోడిగుడ్లను పగులగొట్టారు. అంతటితో ఆగక.. దస్త్రాలు, పరీక్ష సామగ్రిని కోడిగుడ్లతో కొట్టి తడిపేశారు. చిక్కీలను మరుగుదొడ్లలో పడేశారు ఒకప్పుడు గురువు మాటంటే శాసనం. నేడు.. ఆ గౌరవం గాలిలో కలిసిపోతోందన్నది వాస్తవం. ఉపాధ్యాయులు పిల్లలకు అక్షర జ్ఞానం నేర్పుతారు. కానీ, ఆ జ్ఞానానికి విలువ నేర్పాల్సింది తల్లిదండ్రులే. పాఠశాలలో నేర్పే పాఠాలకు బలమైన నీతి పునాది పడాల్సింది ఇంట్లోనే. లేదంటే.. విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగలేడు. బడిలో పిల్లలు ఏ చిన్న తప్పుచేసినా ఉపాధ్యాయుడు సరిదిద్దేందుకు ప్రయత్నిస్తే చాలు.. కొందరు తల్లిదండ్రులు ప్రత్యక్షమై ఎందుకిలా శిక్షించావని ప్రశ్నిస్తున్నారు. దీంతో విద్యార్థులు మరింత రెచ్చిపోతున్నారు. నల్లమాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థి చొక్కా గుండీ సరిగ్గా పెట్టుకోమన్నందుకు ఉపాధ్యాయుడిపైనే దాడి చేసి గాయపరిచాడు. ఇవి మచ్చుకు కొన్నే.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి.

**తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి**

పిల్లలు క్రమశిక్షణారాహిత్యంగా ప్రవర్తించడాన్ని కాండాక్ట్ డిజార్డర్ అంటారు. ఇది 8 నుంచి 12 ఏళ్ల వయసువారిలో ఉంటుంది. ఎదురుతిరిగే స్వభావం, గొడవలు పెట్టుకోవడం, డిమాండ్ చేసే వ్యక్తిత్వం, అబద్ధాలు చెప్పడం చేస్తుంటారు. దీనికి ప్రధానంగా తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపమే కారణం. ఈ పరిస్థితుల్లో వారిని సమర్థిస్తే అది మరింత ప్రమాదకరం. ఈ దశలోనే తల్లిదండ్రులు గమనించి మానసిక వైద్య నిపుణులకు చూపిస్తే మార్పు ఉ



ంటుంది. తల్లిదండ్రులు పట్టించుకోకపోతే 16 ఏళ్ల తర్వాత పర్సనాలిటీ డిజార్డర్‌గా మారుతుంది. వివాహమయ్యాక కూడా వారు సమస్యల్లో చిక్కుకుని భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. శిక్షకంటే ప్రేమతో అర్థం చేసుకోవడం ద్వారా పిల్లల మనసు మారుతుంది. డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణులు

**విలువల పాఠాలు చెబుతాం**

ప్రతి పాఠశాలలో విలువల పాఠాలు తప్పనిసరి చేస్తాం. పిల్లల్లో సంస్కారం, బాధ్యత, సహనం పెంపొందించేందుకు కృషి చేస్తాం. తల్లిదండ్రులు, గురువులు కలిసి విద్యార్థుల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టేలా చర్యలు తీసుకుంటాం. కిష్టప్ప, జిల్లా విద్యాశాఖాధికారి

జిల్లా: శ్రీసత్యసాయి
ప్రభుత్వ పాఠశాలలు: 2,094
ప్రైవేటువి: 484
మొత్తం విద్యార్థులు: 2,44,797

## పాపం.. మర్మం తెలియని మగ్గం

నగరి : నాడు నగరిలో చేనేత కార్మికునిగా జీవించే నేతన్న ఒక అడుగు ముందుకేసి మరమగ్గం వైపు నడిచారు. వస్త్ర ఉత్పత్తిలో రాష్ట్రాన్ని ఒక స్థానంలో నిలబెట్టారు. విదేశీ మారకద్రవ్యం ఆర్జించి ఆర్థికంగానూ గుర్తింపు తెచ్చారు. నగరిలో మర మగ్గ పరిశ్రమ అంటే దక్షిణ భారతదేశంలోనే ఒక మణిహారం. మారుతున్న కాలంతో పాటు ఆధునికతను అందిపుచ్చుకోవడంలో నగరి వెనుకబడింది. కుటుంబమంతా శ్రమించినా కష్టమే మిగులుతోంది.

**ప్రధాన సమస్య..**

వస్త్ర ఉత్పత్తిలో ప్రధాన క్రతువు రంగులు వేయడం. ఇందుకు వాడే రసాయనాల వ్యర్థాల కారణంగా భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం అవుతున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈటీపీ ప్లాంట్‌లో



పరికరాలు, మోటార్లు తుప్పు పట్టడంతో నామమాత్రంగా రసాయనాలను శుద్ధి చేస్తోంది.

**పరిశ్రమ నిలబడాలంటే..**

సుమారు 40 వేల మంది కార్మికులకు జీవనోపాధి కల్పించే పరిశ్రమ బతకాలంటే ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలి. కాలుష్య సమస్య పరిష్కారానికి తమిళనాడులో అమలు చేస్తున్నట్టుగా సీఈటీపీ ప్లాంట్, జడ్ఎల్‌డీ విధానంతో నడిపించే యూనిట్‌ను నెలకొల్పాలి. దీనికి వీకేఆర్‌పురం వద్ద ఏపీఐఐసీకి చెందిన 150 ఎకరాల భూమి అందుబాటులో ఉంది.

తయారయ్యే వస్త్రాలు : షర్టింగ్, చీరలు, చుడీదార్, పంచెలు, లుంగీలు
ఎగుమతులు: జపాన్, అమెరికా, యూరప్
స్వదేశీ మార్కెట్: చెన్నై, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్
ప్రభుత్వ ప్రోత్సాహం: 500 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించనున్నట్లు జీఓలో పేర్కొన్నారు.
వస్త్ర ఉత్పత్తి కేంద్రాలు: నగరి, పుత్తూరు, చింతలపట్టడ, ఏకాంబరకుప్పం, పుదుపేట, సత్రవాడ, కేవీపీఆర్‌పేట
మర మగ్గాల సంఖ్య: 9 వేలు
ఆధునిక మరమగ్గాలు : 120
కుటుంబాల సంఖ్య: 16 వేలు
ఏడాదిలో లావాదేవీలు: రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లు

## కొయ్య బొమ్మలకు కొత్త ఆశలు

తిరుపతి : తిరుపతి జిల్లా పరిధిలో కొయ్య బొమ్మల తయారీ (కార్వింగ్) కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. బొమ్మల తయారీకి అవసరమైన చెక్కలు, కొయ్యలు సరఫరా చేసి, వాటితో వివిధ కళారూపాలను తయారు చేసేలా కళాకారులకు చేయూత ఇస్తారు. తద్వారా వాటి ఆకృతులకు డిమాండ్ కల్పించి మార్కెటింగ్ చేసేలా అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఉడ్ బ్యాంక్ ఏర్పాటు విధివిధానాల రూపకల్పనకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది.

**ఉడ్ బ్యాంకు ఏర్పాటు ఇలా..** శ్రీకాళహస్తి, శెట్టిగుంట, మాధవమాలలో సుమారు వెయ్యి కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా కొయ్య బొమ్మల తయారీపై ఆధారపడ్డాయి. వీరికి ముడిసరకు (ఉడ్) సమకూర్చుకోవడం సమస్యాత్మకంగా ఉంది. కళాకారులు బొమ్మల తయారీకి ప్రధానంగా మోగి, వేప, పనస, ఎర్ర చందనం, టేకు, మహోగని పలపను ఉపయోగిస్తారు. కలప కోసం అడవులపై ఆధారపడాలి. అందుకు అటవీ శాఖ అనుమతులు రావడం అంత సులువు కాదు. ఈ ఇబ్బందులను దూరం చేసి, ప్రభుత్వమే అటవీ శాఖ ద్వారా కలపను సులభంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ, అటవీ శాఖ సలహాదారు, మాజీ పీసీసీఎఫ్ పి.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కమిటీ



ఏర్పాటైంది. జాతీయ రహదారుల నిర్మాణాల కోసం కేటాయించే అటవీ భూముల్లో తొలగించే చెట్లు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా కూలిపోయే వృక్షాలను సమీకరించి, వాటితో తిరుపతి పరిధిలో ఉడ్ బ్యాంకును ఏర్పాటు చేస్తారు.

**ఎర్రచందనం కేటాయింపుపైనా..**

ఇటీవల అమరావతి కేంద్రంగా సీఎం నేతృత్వంలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఇదే అంశాన్ని జిల్లా కలెక్టర్ ప్రస్తావించారు. ఒక్కో కళాకారుడికి 20 కిలోల ఎర్రచందనం కలపను అందించి శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిమలు తయారు చేయించాలన్నది లక్ష్యం. విధివిధానాల ఖరారుకు ప్రత్యేక కమిటీ అధ్యయనం చేస్తోంది. తిరుపతి ఎర్రచందనం గోదాముల పరిధిలోనే కళాకారులకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, బొమ్మల తయారీకి అవకాశం కల్పించాలని కళాకారులు ప్రభుత్వాన్ని కోరారు.

## నిల్వకు వీల్లేక.. నీరంతా సముద్రంలోకే..

గూడూరు : వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజీకి గురువారం మధ్యాహ్నం వరకు వరద మరింత పోటెత్తింది. దీంతో 7 గేట్లు ఎత్తివేసి దిగువకు 8 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. మరో వైపు బ్యారేజీ పరిధిలోని చెరువులకు కాలువ ద్వారా 500 క్యూసెక్కులను వదిలారు. నాలుగు రోజులుగా బ్యారేజీకి వరద వస్తుండటంతో తొలుత రెండు, ఆ తర్వాత మరో ఐదు గేట్లు తెరిచారు. నాలుగు రోజులుగా 25 వేల క్యూసెక్కుల వరదనీరు సముద్రం పాలైంది. బ్యారేజీ వద్ద గేట్ల ఎత్తు పెంచక నీటిని నిల్వ చేసుకునే అవకాశం లేక ఏటా వేలాది క్యూసెక్కులు సముద్రం పాలవుతున్నాయి.

17 ఏళ్లుగా..: 17 ఏళ్ల కిందట అప్పటి పాలకులు బ్యారేజీ గేట్లు ఒకటిన్నర అడుగు ఎత్తు పెంచాలని ప్రతిపాదించారు. నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఏటా వేలాది క్యూసెక్కుల వరద నీరు వృథా అవుతోంది. కూటమి ప్రభుత్వమైనా ఈ దిశగా ఆలోచన చేయాలని స్థానికులు కోరుతున్నారు. తద్వారా మరో 10వేల ఎకరాలకు సాగు నీటిని అందించవచ్చని ఇంజినీర్లు చెబుతున్నారు.

చురకలు



## బ్లాక్ అవుట్ ఫిట్ లో ఆకట్టుకుంటున్న కనకావతి..

సాధారణంగా ఇండస్ట్రీలో తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలి అంటే సినిమాలలో మంచి పాత్రలైనా పడాలి. లేదా సోషల్ మీడియాలో ఫాలోవర్స్ అయినా ఎక్కువగా ఉండాలి. ఇకపోతే అదృష్టం ఉంటేనే సరైన పాత్రలు లభిస్తాయని ఇప్పటికే ఎంతోమంది నిరూపించారు కూడా. మరి కొంతమంది ఇటు సోషల్ మీడియా ఫ్లాట్ ఫార్మ్ ను వేదికగా చేసుకొని తమ అందాలతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇకపోతే గ్లామర్ తోనే కాదు సాంప్రదాయంగా కూడా ఆకట్టుకుంటున్న హీరోయిన్స్ లేకపోలేదు.. అలాంటి వారిలో ప్రథమంగా వినిపించే పేరు రుక్మిణి వసంత్. సప్తసాగరాలు దాటి అనే కన్నడ సినిమాతో ఇటు తెలుగు ప్రేక్షకులను కూడా పలకరించిన రుక్మిణి వసంత్.. 2024లో వచ్చిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె రిషబ్ శెట్టి హీరోగా వచ్చిన కాంతార 2లో కనకావతి పాత్ర పోషించి అబ్బురపరిచింది. ముఖ్యంగా యువరాణి పాత్రలో నటించిన ఈమె నెగటివ్ షేడ్స్ లో కనిపించి.. తన నటనతో ఒక సందర్భంలో హీరోనే డామినేట్ చేసింది అనడంలో సందేహం లేదు. అంతలా తన నటనతో ఆకట్టుకుని పాన్ ఇండియా హీరోయిన్ గా పేరు సొంతం చేసుకున్న రుక్మిణి వసంత్ ప్రస్తుతం ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో వస్తున్న ఎన్టీఆర్ 31 సినిమాలో నటిస్తోంది. అలాగే ప్రముఖ కన్నడ హీరో యష్ హీరోగా నటిస్తున్న టాక్సిక్ సినిమాలో కూడా ఈమె హీరోయిన్గా అవకాశం దక్కించుకుంది. ఇక అలా ఇప్పుడు ఏకంగా




రెండు పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా మారిన రుక్మిణి వసంత్ మరొకవైపు అభిమానులను అలరించడానికి సోషల్ మీడియాలో యాక్టివ్ గా మారిన విషయం తెలిసిందే. ఇకపోతే ఈ చిత్రంలో కనకావతీ పాత్రలో నటించిన ఈమె.. ఆ పాత్ర నుండి కొద్ది రోజులు తేరుకోలేకపోయింది. అందులో భాగంగానే యువరాణిలా తన గెటప్లతో అభిమానులను ఆకట్టుకుంది. రోజుకొక సాంప్రదాయ వేషధారణతో అబ్బురపరిచింది. దీనిని చూసిన అభిమానులు కాంతార నుంచి ఇంకా బయటపడలేకపోతోంది అనే కామెంట్ కూడా చేశారు. అయితే ఇప్పుడిప్పుడే తన మేకోవర్లో మార్పులు చేసుకుంటుంది ఈ ముద్దుగుమ్మ.. తాజాగా క్రీమ్ కలర్ ప్యాంట్ , బ్లాక్ కలర్ టీ షర్ట్ ధరించి తన అందంతో ఆకట్టుకుంది.. ముఖ్యంగా ఇందులో టీనేజ్ అమ్మాయిలా కనిపిస్తూ.. హొయలు పోయింది. పైగా జుట్టును సరళంగా వదిలేసిన రుక్మిణి వసంత్ తన అందంతో.. చిరునవ్వుతో అభిమానుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకుంటుంది. ఇక చేతిలో పుస్తకంతో అందరినీ ఆకట్టుకుంది రుక్మిణి వసంత్ ప్రస్తుతం ఈమె షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇప్పుడిప్పుడే తన అందంతో నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె.. ఇటు సోషల్ మీడియాలో కూడా ఫాలోవర్స్ ను పెంచుకునే పనిలో పడింది. ఏదేమైనా రుక్మిణి వసంత్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

## రవితేజతో ఆ డైరెక్టర్ ప్రయోగం చేస్తున్నాడా?

మాస్ మహారాజ రవితేజ నుంచి రీసెంట్ గా మాస్ జాతర అనే సినిమా రాగా ఆ సినిమా డిజాస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. మూవీలో మాస్ కంటెంట్ ఉన్నప్పటికీ రొటీన్ స్టోరీ అవడంతో ఆడియన్స్ మాస్ జాతరను చూడ్డానికి ఆసక్తి చూపించలేదు. అయితే సక్సెస్ ఫెయిల్యూర్లతో సంబంధం లేకుండా రవితేజ వరుస పెట్టి సినిమాలు చేసుకుంటూ వెళ్తారనే సంగతి తెలిసిందే.

**సంక్రాంతికి భర్త మహాశయులకు విజ్ఞప్తి అంటూ..** మాస్ జాతర సెట్స్ పై ఉన్నప్పుడే కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఓ సినిమాను అనౌన్స్ చేసి దాన్ని సెట్స్ పైకి తీసుకెళ్లిన రవితేజ, ఆ సినిమాను సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి రెడీ అవుతున్నారు. భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే టైటిల్ తో ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా ప్రేక్షకుల ముందుకు రానున్న మాస్ మహారాజా ఈసారి ఎలాగైనా



హిట్ కొట్టాలని మంచి కసితో ఉన్నారు. కాగా రవితేజ ఈ మూవీ తర్వాత మరో సినిమాను లైన్ లో పెట్టినట్టు తెలుస్తోంది.

**శివ నిర్వాణతో రవితేజ మూవీ...** భర్త మహాశయులకు విజ్ఞప్తి తర్వాత రవితేజ నెక్ట్స్ మూవీని శివ నిర్వాణతో చేయనున్నారని తెలుస్తోంది. రీసెంట్ గా శివ నిర్వాణ చెప్పిన క్రైమ్ థ్రిల్లర్ స్టోరీ మాస్ మహారాజాకు బాగా నచ్చిందని, అందుకే వెంటనే ఆ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్టుపై తాజాగా ఓ అప్డేట్ వినిపిస్తోంది. ఇప్పటికే స్క్రిప్ట్ లాకైపోయిందని, నవంబర్ ఎండింగ్ నుంచి ఈ సినిమా షూటింగ్ మొదలవనుందని అంటున్నారు. అయితే శివ నిర్వాణకు క్లాసిక్ కథల డైరెక్టర్ గా ఓ స్పెషల్ ఇమేజ్ ఉంది. నిన్ను కోరి, మజిలీ, ఖుషీ లాంటి లవ్ స్టోరీలతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ ను క్రియేట్ చేసుకున్న శివ నిర్వాణ గతంలో నానితో టక్ జగదీష్ మూవీతో డిఫరెంట్ గా ట్రై చేసినా ఫలితం లేకపోయింది. అలాంటి శివ నిర్వాణ ఇప్పటివరకు టచ్ చేయని క్రైమ్ థ్రిల్లర్ తో రవితేజతో ప్రయోగం చేయబోతున్నారు. మరి ఈ ప్రయత్నమైనా శివ నిర్వాణకు కలిసొచ్చి, రవితేజకు సక్సెస్ ను అందిస్తుందేమో చూడాలి.




## సింహం సరికొత్త గర్జనకు ముహూర్తం!



నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మరో సినిమా లాక్ అయిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం ఇంత వరకూ పట్టాలెక్కలేదు. అఖండ2 చిత్రీకరణ పూర్తయిన బాలయ్య వేర్వేరు పనుల్లో బిజీగా ఉండటంతో లాంచింగ్ ఆలస్యమైంది. గత నెలలోనే లాంచింగ్ ప్లాన్ చేసారు. కానీ వీలు పడలేదు. ఈ నేపథ్యం లో ఈనెలఖరున పూజాకార్యక్రమాలతో ప్రారంభించ డానికి ముహూర్తం ఫిక్స్ చేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ నుంచి కొంత మంది ప్రముఖులు పాల్గొంటారని సమాచారం. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ని ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తున్నట్లు తెలిసింది.

**పవన్ మరోసారి రంగంలోకి:** ఆయనే ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టనున్నారుట. ఇదే నిజమైతే బాలయ్య-పవన్ అభిమానులకు బిగ్ ట్రీట్ అవుతుంది. ఇంత వరకూ బాలయ్య నటించిన ఏ సినిమాకు పవన్ క్లాప్ కొట్టలేదు. ఆ సందర్భంగా కూడా ఏ సినిమాకు రాలేదు. ప్రస్తుతం పవన్ కూటమి లో భాగస్వామ్యం కావడంతో నందమూరి కుటుంబంతో మంచి సాన్నిహిత్యం కూడా కొనసాగుతుంది. మరో 15 ఏళ్ల పాటు ఆ పార్టీతోనే తన ప్రయాణం కూడా ఉంటుందని ప్రకటించిన నేపథ్యంలో? నందమూరి ఫ్యామిలీతో పవన్ బాండింగ్ మరింత స్ట్రాంగ్ అవుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**ఓ పాత్రలో రాజుగా:** ఈ క్రమంలో ఆ కుటుంబం కూడా పవన్ కు అంతే ప్రాధాన్యత ఇస్తోంది. వృత్తి, వ్యక్తిగత విషయాల్లోనూ పవన్ ని భాగ స్వామ్యం చేస్తున్నట్లు కనిపిస్తోంది. బాలయ్య తాజా సినిమాకు పీకే క్లాప్ ఇస్తే అది వేరే లెవల్లో ఉంటుంది. మరి ఈ ప్రచారంలో నిజమెంత? అన్నది అధికారికంగా ప్రకటన వచ్చే వరకూ క్లారిటీ రాదు. అలాగే సినిమా స్టోరీ విషయం కూడా లీకైంది. చరిత్ర-వర్తమానం అంశాలు మేళవింపుతో యాక్షన్ థ్రిల్లర్ గా మలుస్తున్నారుట. ఇందులో బాలకృష్ణ రెండు విభిన్న కోణాల్లో కనిపించనున్నారుట. ఓ పాత్రలో రాజుగా అలరించనున్నారుట.

**మరో నటిగా తెలుగు హీరోయిన్:** మరో పాత్రకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది. అలాగే ఓ హీరోయిన్ గా నయనతార ఎంపికైనట్లు ఇప్పటికే ప్రచారంలో ఉంది. ఆ విషయం మరో రెండు..మూడు రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్నారని సమాచారం. మరో నాయిక ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని దర్శకుని సన్నిహితుల నుంచి తెలిసింది. ఆ పాత్ర కోసం తెలుగు నటిని తీసుకోవాలనుకుంటున్నారుట. మరి ఆ ఛాన్స్ ఏ బ్యూటీకి దక్కుతుందో చూడాలి. ఇప్పటికే బాలయ్య-గోపీచంద్ కాంబినేషన్ లో తెరకెక్కిన వీరసింహారెడ్డి బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే.

## ప్లాన్ మార్చిన రామ్.. 'ఆంధ్ర కింగ్ తాలూకా' కొత్త డేట్!




రామ్ పోతినేని హీరోగా, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో వస్తున్న 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమాపై మొదటి నుంచీ మంచి బజ్ ఉంది. ఇది రెగ్యులర్ కథ కాదని ముందే క్లారిటీ ఇచ్చారు, "బయోపిక్ ఆఫ్ ఎ ఫ్యాన్" (ఒక అభిమాని బయోపిక్) అనే కొత్త కాన్సెప్ట్తో వస్తుండటంతో సినీ లవర్స్ లో ఆసక్తి పెరిగింది. రామ్ అయితే నెవ్వర్ బిఫోర్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. పుష్ప లాంటి బ్లాక్బస్టర్లను అందించిన మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే వివేక్ మెర్విన్ అందించిన సంగీతం చార్ట్బస్టర్గా నిలిచింది. ఈ సినిమా కోసం అభిమానులు నవంబర్ 28 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కానీ ఇప్పుడు ఆ ప్లాన్లో చిన్న మార్పు చోటుచేసుకుంది. ప్రేక్షకుల నుంచి వస్తున్న భారీ డిమాండ్, సినిమాపై ఉన్న అంచనాల కారణంగా, మేకర్స్ ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. ముందుగా ప్రకటించిన నవంబర్ 28కి బదులుగా, ఒక రోజు ముందే.. అంటే నవంబర్ 27నే సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో, రామ్ సరసన డెబ్యూ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్స్ నటిస్తోంది. వీరిద్దరి ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీకి మంచి ఫీడ్బ్యాక్ వస్తోందని సమాచారం. రామ్తో పాటు కన్నడ స్టార్ ఉపేంద్ర కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది ఇండియన్ సినిమాలో మునుపెన్నడూ చూడని కాన్సెప్ట్ అని చిత్ర బృందం చెబుతోంది. ప్రమోషన్ల విషయంలో కూడా టీమ్ తగ్గేదేలే అంటోంది. నవంబర్ 18న కర్నూలులో భారీ ఎత్తున ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ప్లాన్ చేస్తున్నారు. తెలుగు సినిమా చరిత్రలోనే ఇది మొట్టమొదటి భారీ పబ్లిక్ ఈవెంట్ కానుండటం విశేషం. ఈ సినిమాలోని ఓ పాటను రామ్ స్వయంగా రాయడం కూడా హైలైట్గా నిలిచాయి. ఈ చిత్రానికి నేషనల్ అవార్డ్ విన్నర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్గా పనిచేస్తుండగా, సిద్ధార్థ నూని సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. టి సిరీస్, మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా సమర్పిస్తున్న ఈ చిత్రం, ఇప్పుడు కొత్త డేట్ అయిన నవంబర్ 27న థియేటర్లలోకి రానుంది.

## 157 లో తమన్నాకు ఛాన్స్ లేదా?

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో మన శంకర వరప్రసాద్ గారు తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. చిత్రీకరణ ఇప్పటికే ముగింపు దశలో ఉంది. లిరికల్ సాంగ్స్ ఒక్కొక్కటిగా రిలీజ్ అవుతున్నాయి. మీసాలా పిల్ల సాంగ్ కి మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. చిరు-నయన్ రొమాన్స్ ఆకట్టుకుంటుంది. ఇదంతా సరే? సినిమాలో అసలైన మాస్ మసాలా సాంగ్ పరిస్థితి ఏంటి? అంటే ప్రస్తుతం డిస్కషన్ అంతా ఆ పాట గురించి జరుగుతోంది. చిరు సరసన ఐటం పాటలో నర్తించే భామ ఎవరు? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో పాట కోసం మిల్కీబ్యూటీ తమన్నాను రంగంలోకి దించుతున్నట్లు వార్తలొస్తున్నాయి. అనీల్ రావిపూడి ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నారని, ఆమె ఎంట్రీ దాదాపు ఖాయమైందనే ప్రచారం బలంగానే జరుగుతోంది. సీనియర్ హీరోలకు పర్ఫెక్ట్ జోడీగా సెట్ అవ్వడంతో పాటు బోల్డ్ అప్పిరియన్స్ ఇవ్వడంలోనూ తమ్మన్నా అయితే బ్యాలెన్స్ చేస్తుందని అన్న కోణంలో ఆమెనే తీసుకుంటున్నట్లు వినిపిస్తోంది. తాజా సమాచారం ఏంటంటే? తమన్నా కంటే కొత్త



భామతోనే ముందుకెళ్లాలని అనీల్ భావిస్తున్నట్లు సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది. తమన్నా ఇప్పటికే చాలా సినిమాల్లో ఐటం పాటల్లో నటించడంతో కొత్తదనం ఉండదని భావించి ఆ నటికి బధులుగా మరో సీనియర్ లేదా? కొత్త భామను తీసుకుంటే బాగుంటుందని అనీల్ అసిస్టెంట్ సలహా ఇవ్వడంతో? ప్లాన్ మారు స్తున్నట్లు తెలిసింది. ఈ విషయం చిరంజీవి దృష్టికి కూడా తీసుకెళ్లారుట. ఆయన కూడా ఆ విషయంలో తాను ఇన్వాల్వ్ కానని..తమ ఇష్టం మేరకే ఎంపిక చేయండని సూచించారుట. దీంతో ఐటం భామ ఎంపిక పూర్తిగా అనీల్ హాండ్స్ లోనే ఉందని తెలుస్తోంది. చిరంజీవి సినిమా అంటే ఐటం పాటలో ఓ వైబ్ ఉంటుంది. తనదైన మార్క్ సిగ్నెచర్ స్టెప్స్ ఉంటాయి. ఆయన గ్రేస్ ను అందుకుని ఏ నటి అయినా డాన్స్ చేయాల్సి ఉంటుం ది. ఈ నేపథ్యంలో ఐటం పాటలో ఎంపికయ్యే ఏ నటి అయినా మంచి డాన్సర్ కూడా అయి ఉండాలి. అలాంటి పెర్ఫార్మన్ ని వెతికి పట్టుకోవడం అంత సులభం కాదు. అందంతో పాటు మంచి డాన్సర్ అయి ఉండాలి. ఐటం పాటలో ఒకే ఎనర్జీతో పని చేయగలగాలి. మరి ఆ ఛాన్స్ ఏ నటికి దక్కుతుందో చూడాలి.

## 'కింగ్'తోను ఇలాగే ప్రవర్తిస్తావా? నిలదీసిన ప్రభాస్ ఫ్యాన్స్!

పిల్లల తల్లులు- ఎనిమిది గంటల పనిదినంపై కొంతకాలంగా సినీపరిశ్రమల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది. బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపిక పదుకొనే ప్రత్యేకించి ఈ అంశంపై పోరాటం సాగిస్తున్నారు. సందీప్ వంగా స్పిరిట్, నాగ్ అశ్విన్ కల్కి 2898 ఏడి నుంచి తొలగించిన తర్వాతా దీపిక తన పట్టుదలలో తగ్గేదే లే! అంటూ భీష్మించుకు కూచుంది. తనకు శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక శ్రేయస్సు చాలా ముఖ్యమని పదే పదే బహిరంగ వేదికలపై ప్రకటిస్తోంది దీపిక. ఆ రెండిటి కోసం నిబద్ధతతో కట్టుబడి ఉన్నానని చెబుతోంది. ఇప్పుడు మరోసారి పని కట్టుబాట్ల విషయంలో సొంత నియమాలు ఉన్నాయని బలంగా చెబుతోంది. మనమంతా ఓవర్ టైమ్ పని చేయడాన్ని నిబద్ధత అనుకుంటున్నాం. అందుకే దీనిని కామన్ గా మార్చేశాం. కానీ మనిషి 8గంటలు మించి పని చేయకూడదు. మంచి ఆరోగ్యంతో ఉంటేనే మంచి పని చేయగలం. అనారోగ్యం పాలైతే అసలుకే మోసం.. ఎన్ని అదనపు గంటలు పని చేసినా ఎలాంటి ప్రయోజనం ఉండదు.. అని దీపిక వ్యాఖ్యానించింది. అయితే దీపిక వ్యాఖ్యలు ప్రభాస్ అభిమానులను తీవ్రంగా హర్ట్ చేసాయి. సందీప్ వంగా తో పాటు కల్కి ఫ్యాన్స్ ను కూడా తీవ్రంగా కలచివేసాయి. ప్రభాస్ అభిమానులు దీపికపై తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. షారుఖ్ ఖాన్ తో కింగ్ సినిమాలో నటిస్తున్నావు కదా..ఆ సినిమా కోసం రోజుకు 8 గంటలు మాత్రమే పనిచేస్తున్నావా? అంటూ నిలదీస్తున్నారు. అయితే షారూఖ్ తో ఇప్పటికే కొన్ని చిత్రాల్లో నటించాను.. మా మధ్య ప్రతిదీ బావుంటుందని దీపిక వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.



ఖాన్ స్కూల్ లో తాను ఎప్పుడూ సౌకర్యంగా ఉన్నానని వెల్లడించింది. కెరీర్ లో నేను చాలా ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. ప్రతిసారీ నా కుటుంబం, అభిమానుల కారణంగా అన్నిటి నుంచి బయటపడ్డానని, పరిశ్రమలో తనను నమ్మి అవకాశాలు కల్పించే వారు ఎప్పుడూ ఆదుకున్నారని కూడా దీపిక ధీమాను వ్యక్తం చేసింది. ఇప్పుడు కూడా టాలీవుడ్ లో రెండు పెద్ద అవకాశాల్ని కోల్పోయాకా దీపిక ఎంతో కాన్ఫిడెంట్గా వ్యవహరిస్తోంది. అయితే దీపిక వర్సెస్ ప్రభాస్ వివాదంలో చాలా విషయాలు సైడ్ లైన్ అయిపోయాయని కూడా గుసగుసలు వినిపించాయి. దీపిక పదుకొనే 6గంటలు మాత్రమే సెట్స్ లో పని చేస్తానని కండిషన్ పెట్టిందని, తన స్టాఫ్ సభ్యులకు కూడా స్టార్ హొటల్ సౌకర్యాలు కోరిందని, ఊహించిన దానికంటే అధిక పారితోషికం డిమాండ్ చేసిందని కూడా గుసగుసలు వినిపించాయి. వీటన్నిటినీ మించి వందల కోట్లు పెట్టుబడులుగా వెదజల్లి పని చేసే భారీ ప్రాజెక్టులకు కొంత పట్టు విడుపు ఉండాలి. కానీ దీపికలోని బలమైన ఫెమినిజంతో వేగలేమనే భయాందోళన దర్శకనిర్మాతలలో మొదలైందని కూడా గుసగుసలు వినిపించాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536